జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 | సంపుటి : 15 | సంచిక : 263 | వెల: రూ.5 | పేజీలు: 08

RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528



## విపక్షాలకు అవకాశమిస్తే.. చొరబాటుదారులతో బిహార్ నిండిపోతుంది

- కేంద్ర మంత్రి అమిత్ షా
- భాజపా అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని గతంలో ఇదే తరహా దుష్ప్రచారం చేసింది
- బంగ్లాదేశీ చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఇటీవల రాహుల్ గాంధీ యాత్ర నిర్వహించారు



## రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నిరాధారం.. అవాస్తవం

- రాహుల్ ఆరోపణలపై ఈసీ రియాక్షన్.. పటాకులే పేలాయంటూ సెటైర్లు
- సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటునూ తొలగించడం లేదు
- "ఎన్నికల నిర్వహణ కోసం ఈసీ నిష్పక్షపాతంగా పనిచేస్తోంది.

## ఆర్థిక ఇబ్బందులు వచ్చినా దేశం,
# రాష్ట్రమే ముఖ్యం



- అభివృద్ధి జరిగితే సంపద సృష్టితో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది
- ప్రభుత్వానికి ఆదాయం వస్తేనే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుంది
- సంపద సృష్టించని వారికి సంక్షేమం ఇచ్చే అధికారం లేదు
- అప్పులు చేసి సంక్షేమం ఇవ్వడం సరికాదనేది నా నమ్మకం.

**అమరావతి**

జీఎస్టీ అమలు.. గేమ్ ఛేంజర్‌గా మారిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జీఎస్టీ సంస్కరణలపై ఏపీ అసెంబ్లీలో చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. "జీఎస్టీ రెండోతరం సంస్కరణలు తీసుకొచ్చారు.. సంస్కరణలకు నేను ఎప్పుడూ ముందుంటాను. అభివృద్ధి జరిగితే సంపద సృష్టితో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ప్రభుత్వానికి ఆదాయం వస్తేనే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుంది. సంపద సృష్టించని వారికి సంక్షేమం ఇచ్చే అధికారం లేదు. అప్పులు చేసి సంక్షేమం ఇవ్వడం సరికాదనేది నా నమ్మకం. ఆర్థిక ఇబ్బందులు వచ్చినా.. దేశం, రాష్ట్రమే ముఖ్యం. దీర్ఘకాల - మిగతా3లో



## రాష్ట్రానికి 13,050 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిన కేంద్రం

### వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

**అమరావతి**

రాష్ట్రానికి 13,050 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిస్తూ గురువారం కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 20వ తేదీకి గంగవరం పోర్ట్ కు యూరియా రాష్ట్రానికి చేరుతుందని అన్నారు. ఈ కేటాయింపుతో రైతులకు మరింత వెసులుబాటు లభిస్తుందని , రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని, రాష్ట్రంలో ఇప్పటికే సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. రైతుల భవిష్యత్తు కోసం కూటమి దృఢంగా నిలబడి ఉందని, ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతి రైతు అవసరాలను, సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సమగ్ర దృష్టితో ముందుకొస్తుందని, రైతుల ఆదాయాన్ని పెంచడం, పంటలకు సరైన మార్కెటింగ్‌ను అందించడం కూటమి లక్ష్యమని - మిగతా3లో



## 100 శాతం ఆధారాలున్నాయ్

- ఓట్ల దొంగలకు రక్షగా.. సీఈసీపై రాహుల్ సంచలన ఆరోపణలు
- ఓట్ల చోరీ గురించి ఈసీ నుంచి మాకు సమాచారం వస్తోంది. చాలా చోట్ల మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగిస్తున్నారు
- సాఫ్ట్‌వేర్‌ను వాడి.. ఓటర్ ఐడీలను తొలగిస్తున్నారు: రాహుల్ గాంధీ ఆరోపణలు
- "ఈ ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు

## విద్య, వైద్యం, వ్యవసాయ
# రంగాలు నిర్వీర్యం



- అసెంబ్లీలో ప్రజల గొంతు వినాలని కూటమికి లేదు
- శాసనసభలో తాము మాట్లాడేలా తగిన సమయం కేటాయించడం ఇష్టం లేకనే, వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదు
- అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైంది
- ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, నిలదీసేందుకు అవసరమైన పూర్తి మెటీరియల్ సిద్ధంగా ఉంది
- మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు జగన్

**తాడేపల్లి**

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. శాసనసభ, మండలి సమావేశాల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో తొలిసారి ప్రభుత్వంపై ఇంత తక్కువ వ్యవధిలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఈ ప్రభుత్వం అన్ని రంగాల్లో దారుణంగా విఫలమైందని తెలిపారు. అసలు రాష్ట్రంలోప్రభుత్వం ఉందా? అన్న సందేహం ప్రజలకు కలుగుతోందన్నారు. శాసనసభలో తాము మాట్లాడేలా తగిన సమయం కేటాయించడం ఇష్టం - మిగతా3లో



## అఫ్గాన్ ఉగ్రస్థావరంగా
# మారకూడదు

- "భారత్-అఫ్గాన్ మధ్య సాంస్కృతిక బంధం ఉంది
- ఘర్షణలతో దెబ్బతిన్న దేశంలో శాంతి, స్థిరత్వానికి కృషి చేసే విషయంలో భారత ప్రభుత్వం ఆసక్తిగా ఉంది
- ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ వెల్లడి

## చారిత్రాత్మక జీఎస్టీ సంస్కరణలకు
# ఏపీ తొలి మద్దతుదారు

- జీఎస్టీ సంస్కరణలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటనను స్వాగతిస్తున్నా
- రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బందిగా ఉన్నా ఈ చారిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఏపీనే
- జీఎస్టీ పన్నుల నూతన విధానం ద్వారా ప్రజలకు మేలు చేసే విధానం మంచిది.. దీనివల్ల దేశం స్థిరమైన వృద్ధి



**అమరావతి**

జీఎస్టీ 2.0 సంస్కరణలపై ఏపీ శాసనసభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీర్మానం చేశారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జీఎస్టీ సంస్కరణలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటనను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. జీఎస్టీ మండలి 56వ సమావేశంలో జీఎస్టీ సంస్కరణలను కేంద్రమంత్రి నిర్మాలా సీతారామన్ ఆమోదించారని గుర్తుచేశారు. రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బందిగా ఉన్నా ఈ చారిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఏపీనే అని ఉద్ఘాటించారు. జీఎస్టీ పన్నుల నూతన విధానం ద్వారా ప్రజలకు మేలు చేసే విధానం మంచిదని.. - మిగతా3లో



## నేపాల్‌లో శాంతి స్థాపనకు అండగా ఉంటాం

- సుశీలా కార్కీకి మోదీ హామీ.. ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుంది
- సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగింది
- నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం
- శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత మద్దతును పునరుద్ఘాటించినట్లు మోదీ వెల్లడి

### 30 రకాల్లో 11 వస్తువుల
## రేట్లలో భారీ తగ్గుదల

- పాలు, ప్రాసెస్ చేసిన ఆహారం వంటి నిత్యావసరాలతో పాటు వాహనాలు, బ్యూటీ సేవలు చౌకగా మారే అవకాశం
- ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ రేటింగ్స్ గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో వెల్లడి



# రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నిరాధారం.. అవాస్తవం

**న్యూఢిల్లీ:** ఓట్ల చోరీ పేరిట కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ చేసిన సంచలన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల స్పందించింది. ఆన్‌లైన్‌లో ఓట్లు ఎవరూ తొలగించలేరని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. అదే సమయంలో మరోవైపు.. బీజేపీ సైతం ఆయన చేసిన ఆరోపణలపై వ్యంగ్యాస్త్రాలు సంధించింది. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నిరాధారం.. అవాస్తవం. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటునూ తొలగించడం లేదు అని ఈసీ స్పష్టం చేసింది. అదే సమయంలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓట్ల తొలగింపు ప్రయత్నాలను మాత్రం అంగీకరించింది. "ఆ సమయంలో కర్ణాటకలోని ఆలంద్ శాసనసభ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించేందుకు కొన్ని విఫలయత్నాలు జరిగాయి. ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ఎన్నికల సంఘం స్వయంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు జరిపింది" అని పేర్కొంది. మరోవైపు రాహుల్ గాంధీ చేసిన ఓట్ల దొంగతనం.. నకిలీ ఓట్ల చేర్పు ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఆయన బాంబు పేలలేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ భారత్‌ను బంగ్లాదేశ్, నేపాల్ లాంటి పరిస్థితుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నారు అని మండిపడ్డారు. "ఎన్నికల నిర్వహణ కోసం ఈసీ నిష్పక్షపాతంగా పనిచేస్తోంది. కానీ రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తూ..



ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారు. ఆయన నేతృత్వంలో కాంగ్రెస్ సుమారు 90 ఎన్నికల్లో ఓడిపోయింది. ఆ వైరాగ్యంతోనే ఆయన అసత్య ఆరోపణలు చేస్తున్నారు అని ఠాకూర్ విమర్శించారు. హైడ్రోజన్ బాంబ్ పేలుస్తానన్న రాహుల్.. చివరికి పటాకులతోనే సరిపెట్టారు. ఆరోపణలే ఆయన రాజకీయ ఆభరణంగా మారాయి. కోర్టులు క్షమాపణలు కోరడం, మందలించడం ఆయనకు అలవాటైపోయింది అని అనురాగ్ ఠాకూర్ ఎద్దేవా చేశారు.

# 100 శాతం ఆధారాలున్నాయ్

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల సంఘంపై మరోసారి సంచలన ఆరోపణలకు దిగారు. ఓట్ల దొంగతనం ఒక పథకం ప్రకారమే జరుగుతోందని.. ఆ దొంగలను రక్షించే ప్రయత్నంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఉన్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గురువారం న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ ఆడిటోరియంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని.. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు.

**100 శాతం ఆధారాలున్నాయ్**

ఓట్ల చోరీ గురించి ఈసీ నుంచి మాకు సమాచారం వస్తోంది. చాలా చోట్ల మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగిస్తున్నారు. ఇప్పటికే ఉద్దేశపూర్వకంగానే లక్షల ఓట్లను తొలగించారు. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లోనూ పెద్ద ఎత్తున ఓట్లు తొలగించారు. కర్ణాటక ఓటర్లకు లింక్ చేసిన ఫోన్ నెంబర్లన్నీ తప్పుడువే. కాంగ్రెస్‌కు బలమున్న ప్రాంతాల్లోనే ఓట్ల తొలగింపు జరిగింది. ఓట్లను తొలగించేందుకు కొందరు వ్యవస్థను హైజాక్ చేస్తున్నారు. ఫేక్ లాగిన్‌తో కాంగ్రెస్ సానుభూతి ఓట్లను తొలగించారు. ఇవన్నీ ఆరోపణలు కాదు..

**పక్కా ఆధారాలతో చెబుతున్నా..**

ఎవరో 6018 ఓట్లను తొలగించడానికి ప్రయత్నించారు.




2023 ఎన్నికల్లో అలంద్‌లో మొత్తం ఎన్ని ఓట్లు తొలగించారో మాకు తెలియదు. ఈ సంఖ్య 6018 కంటే చాలా ఎక్కువ, కానీ 6018 ఓట్లను తొలగిస్తూ ఒకరు చిక్కారు, ఇది యాదృచ్ఛికంగా జరిగింది. అక్కడ బూత్ స్థాయి అధికారి తన మామ ఓటు తొలగించారని చూసి, తన మామ ఓటును ఎవరు తొలగించారో విచారించగా, ఓటు తొలగించిన వ్యక్తి తన పొరుగువాడని తేలింది. అతను తన పొరుగువారిని అడగ్గా, నేను అలా చేయలేదని చెప్పారు. ఓటు తొలగించిన వ్యక్తికి కానీ, ఎవరి ఓటు తీసేశారో వారికి కానీ దీని గురించి తెలియదు. మరెవరో ఈ ప్రక్రియను హైజాక్ చేసి ఓటును తొలగించారు."రాహుల్ గాంధీ కర్ణాటకకు చెందిన కొంతమంది వ్యక్తుల ఉదాహరణ ఇచ్చారు.

**సీఈసీపై సంచలన ఆరోపణలు**

ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నవారిని కాపాడుతోంది. అధికారులకు తెలియకుండా జాబితా నుంచి ఓట్లు ఎలా పోతాయి?. కేవలం కాంగ్రెస్ ఓటర్లే టార్గెట్‌గా ఇదంతా నడుస్తోంది. కర్ణాటక సీఐడీ ఓట్ల తొలగింపు వివరాలు 18సార్లు అడిగినా ఈసీ స్పందించడం లేదు. మాకు ఓట్ల తొలగింపు ఐడీల వివరాలు, ఓటీపీలు కావాలి. వారంలోగా సీఐడీ అడిగిన వివరాలు అందించాలి.

**ఓట్ల దొంగలను రక్షిస్తూ..**

కర్ణాటక అలంద్‌లో గోదాబాయ్ పేరుతో 18 ఓట్లు తొలగించారు . మహారాష్ట్ర రాజురా నియోజకవర్గంలో 6,851 ఫేక్ ఓట్లు కలిపారు. కర్ణాటక, యూపీ, మహారాష్ట్ర, హర్యానాలో ఒకే రీతిలో ఓట్ల తొలగింపు జరిగింది. సెంట్రలైజ్డ్ వ్యవస్థ ద్వారా పథకం ప్రకారం రాష్ట్ర ఎన్నికల్లో ఓట్లు డిలీట్ చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే వ్యవస్థ ఆ పని చేయడం లేదు. ఓట్ల దొంగలను సీఈసీ రక్షిస్తోంది. అందుకే ప్రతిపక్ష నేతగా నేను ప్రజల ముందు ఉంచుతున్నా ఓటు చోరీ అనేది ప్రజాస్వామ్యంపై అణుబాంబ్ లాంటిది. కానీ ఇప్పుడు హైడ్రోజన్ బాంబ్ పేలబోతోంది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నవాళ్లను ఈసీ కాపాడుతోంది. ఓట్లు చోరీ చేస్తున్న వారిని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రక్షిస్తున్నారు. అన్నింటికీ మా దగ్గర ఆధారాలన్నాయ్. ఎన్నికల వ్యవస్థలో అక్రమాలను కోర్టులు పరిశీలించాలి. ఓట్ల చోరీపై న్యాయ వ్యవస్థ దృష్టి సారించాలి అని రాహుల్ గాంధీ కోరారు. ఈ క్రమంలో ఆధారాల పేరిట పలువురు ఓటర్లతో మాట్లాడించిన ఆయన, ఓట్ల అవకతవకల పేరిట జరిగిన అంశాలనూ మీడియా ముందు ప్రవేశపెట్టారు.

# అఫ్గాన్ ఉగ్రస్థావరంగా మారకూడదు

**ఇంటర్నెట్‌డెస్క్:** లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్ సహా ఐరాస ప్రకటిత ఉగ్రసంస్థలు అఫ్గానిస్థాన్‌లో కార్యకలాపాలు సాగించకుండా చూడాలని ప్రపంచ దేశాలకు భారత్ పిలుపునిచ్చింది. ఆ దేశంలో భద్రతా పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ వెల్లడించారు. అఫ్గానిస్థాన్‌పై ఐరాస భద్రతామండలిలో జరిగిన సమావేశం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్-అఫ్గాన్ మధ్య సాంస్కృతిక బంధం ఉంది. ఘర్షణలతో దెబ్బతిన్న దేశంలో శాంతి, స్థిరత్వానికి కృషి చేసే విషయంలో భారత ప్రభుత్వం ఆసక్తిగా ఉంది. అఫ్గాన్‌కు సంబంధించిన కీలక అంశాలపై అంతర్జాయంగా, ప్రాంతీయంగా ఏకాభిప్రాయం, సహకారం ఉండాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాం. ఆ దిశగా మా ప్రయత్నాలు అంతర్జాతీయ వేదికలపై ప్రతిబింబిస్తున్నాయి" అని హరీశ్ పేర్కొన్నారు. అలాగే అఫ్గాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రితో మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రెండుసార్లు చర్చలు జరిపిన విషయాన్ని గుర్తుచేశారు. ఇదిలా ఉంటే.. ఏప్రిల్



22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిని ఆ దేశం తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే.

**పాక్-సౌదీ రక్షణ ఒప్పందం.. భారత్ స్పందన ఇదే**

అఫ్గాన్‌లో ఇటీవల భారీ భూకంపం సంభవించింది. ప్రకృతి విపత్తులు, పేదరికం, వ్యాధులు, ఆహార కొరత వంటి సమస్యలతో బాధపడుతోన్న అక్కడి ప్రజలకు సాయం అందించాల్సిన సమయం ఆసన్నమైందని హరీశ్ అన్నారు. ఇటీవలి భూకంపం తర్వాత తక్షణమే స్పందించిన దేశాల్లో భారత్ కూడా ఉంది. ఆహారంతో ఔషధాలు, దుప్పట్లు, జనరేటర్లు, టెంట్లు వంటివాటిని పంపించింది. రానున్న రోజుల్లో ఆ దేశానికి మన నుంచి మరింత సాయం అందనుందని హరీశ్ చెప్పారు. తమ సైన్యంపై దాడులు చేస్తున్న బలోచ్ లిబరేషన్ ఆర్మీ దాని అనుబంధ మజీద్ బ్రిగేడ్‌లపై పాకిస్థాన్ చర్యలను తీవ్రం చేసింది. ఆ రెండింటిని ఉగ్రసంస్థలుగా ప్రకటించాలని ప్రతిపాదించింది. దీనికి చైనా కూడా వంతపాడటం గమనార్హం. పాక్ రాయబారి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ.. ఐఎస్ఐఎల్-కె, అల్‌ఖైదా, తెహ్రిక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్, బలోచ్ దాని అనుబంధ మజీద్ బ్రిగేడ్ వంటి ఉగ్రవాద సంస్థలు అఫ్గాన్ కేంద్రంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అక్కడ దాదాపు 60కి పైగా ఉగ్రవాద శిబిరాలు సీమాంతర దాడులకు పాల్పడుతున్నాయని తెలిపారు. కాగా.. బీఎల్ఏ, మజీద్ బ్రిగేడ్‌లను అమెరికా ఇప్పటికే విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

## నేపాల్‌లో శాంతి స్థాపనకు అండగా ఉంటాం

**ఇంటర్నెట్‌డెస్క్:** సోషల్ మీడియాపై నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో కొన్ని రోజుల క్రితం అట్టుడికిన నేపాల్‌లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ఈ క్రమంలో ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా



కార్కీతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు. సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత మద్దతును పునరుద్ఘాటించినట్లు మోదీ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దీంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే సుశీలా కార్కీని తాత్కాలిక ప్రధానిగా జెన్-జీ ఎంపిక చేసింది. గత శుక్రవారం ఆమె ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కార్కీ సిఫార్సు మేరకు దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పార్లమెంటును రద్దు చేశారు. 2026 మార్చి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.

## రెండు నెలల్లో సుంకాల సమస్యకు పరిష్కారం

**చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ నాగేశ్వరన్ ఆశాభావం!**

భారత్-అమెరికా మధ్య సుంకాల వివాదం రాబోయే రెండు నెలల్లో పరిష్కారమవుతుందని చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ వీ అనంత నాగేశ్వరన్ విశ్వాసం వ్యక్తం చేశారు. భారత్‌పై విధించిన సుంకాలను అమెరికా ఉపసంహరించుకునే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎగుమతిదారులకు ఊరట కలిగించేలా పరస్పర సుంకాలను 25శాతం నుంచి దాదాపు




15శాతానికి తగ్గించేందుకు చర్చలు జరుగుతున్నాయని నాగేశ్వరన్ తెలిపారు. కోల్‌కతాలో మర్చంట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన కార్యక్రమంలో సీఈఏ ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు సమాచారం ఏదీ లేదని.. ఇది తన వ్యక్తిగత అభిప్రాయ మన్నారు. రాబోయే రెండు నెలల్లో సుంకాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. యూఎస్ విధించిన సుంకాలకు పరిష్కారం దొరికే అవకాశం ఉందని.. ఈ దిశగా రెండు ప్రభుత్వాల మధ్య చర్చలు జరుగుతున్నాయన్నారు. సుంకాలు 10శాతం, 15శాతానికి పరిమితమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం భారత్ ఎగుమతుల విలువ 850 బిలియన్ డాలర్లు ఉండగా.. రాబోయే రోజుల్లో ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని.. జీడీపీల్లో ఎగుమతుల వాటా 25శాతంగా ఉందన్నారు. ఇది ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థను సూచిస్తోందని నాగేశ్వరన్ తెలిపారు. అయితే, ఇటీవల అమెరికా భారత్ ఎగుమతులపై 50శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే.

## దిశాపటాని ఇంటిపై కాల్పులు జరిపిన గ్యాంగ్ ఎన్ కౌంటర్

**లక్నో :** బాలీవుడ్ హీరోయిన్ దిశా పటానికి సొంత ఊరు అయిన బరేలీలోని వారి ఇంటిపై కాల్పులు జరిపిన ఇద్దరు నిందితుల్ని పోలీసులు ఎన్ కౌంటర్ లో చంపేశారు. తామే కాల్పులు జరిపామని గోల్డీ బ్రార్ గ్యాంగ్ ప్రకటించుకుంది. యూపీ సీఎం ఆదిత్యనాథ్ ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్నారు. నిందితుల్ని వదిలి పెట్టబోమని దిశాపటాని తండ్రి కి ఫోన్ చేసి మరీ స్వయంగా హామీ ఇచ్చారు. ఆయన హామీ ఇచ్చిన రెండు రోజుల్లోనే నిందితులు ఎన్ కౌంటర్ అయ్యారు. బాలీవుడ్ నటి దిశా పటాని తల్లిదండ్రుల నివాసం ముందు జరిగిన కాల్పుల ఘటనలో నిందితులు పోలీసులతో ఎదురుకాల్పుల్లో చనిపోయారు. ఉత్తరప్రదేశ్ పోలీసులు గాజియాబాద్‌లో రవీంద్ర అలియాస్ కుల్లు , అరుణ్ ఉన్నట్లుగా గుర్తించారు. వారిని పట్టుకునేందుకు వెళ్లారు. అయితే వారిద్దరూ కాల్పులు జరిపి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఎదురు కాల్పులు జరిపి వారిని పట్టుకున్నారు.కానీ బుల్లెట్ గాయాలతో వారు చనిపోయారు. ఈ ఇద్దరు గోల్డీ బ్రార్ , రోహిత్ గోదారా గ్యాంగ్‌కు చెందినవారిగా తేలింది. శుక్రవారం అర్ధరాత్రి సుమారు మూడున్నర గంటలకు బరేల్లీలోని సివిల్ లైన్స్‌లో దిశా పటాని తల్లిదండ్రుల ఇల్లు ముందు ఇద్దరు బైక్ రైడర్లు దిశా పటాని ఇంటికి వచ్చారు. కుక్క వారిని చూసి అరవడంతో రిటైర్డ్ ఆూఖ అయిన దిశా పటాని తండ్రి జగదీష్ పటాని బాల్కనీకి వచ్చారు. వారిని ప్రశ్నించగా, ఒక నిందితుడు "కిల్ హిం" అని చెప్పి, విదేశీ తయారీ గన్‌తో 7 రౌండ్లు కాల్పులు జరిపారు. ఇందులో రెండు ఏరియల్ షాట్స్. జగదీష్ పోలీసు కావడంతో పిల్లర్ వెనుక దాక్కుని తప్పించుకున్నారు. ఇంట్లో జగదీష్, తల్లి పద్మ, సోదరి ఖుష్బూ, సోదరుడు సూర్యాంశ్ ఉన్నారు. దిశా ఆ సమయంలో ముంబైలో ఉన్నారు. ఎవరూ గాయపడలేదు. ఘటన తర్వాత కెనడాలో దాగి ఉన్న గ్యాంగ్‌స్టర్, రోహిత్ గోదారా గ్యాంగ్ సోషల్ మీడియాలో తమ పనేనని ప్రకటించుకుంది. "జస్ట్ ట్రైలర్" అని హెచ్చరించారు. జగదీష్ పటాని ఫిర్యాదు మేరకు బరేల్లీ పోలీస్ ఈఎఫ్ఐ నమోదు చేశారు. 5 టీమ్స్ ఏర్పాటు చేసి, అఋం ఫుటేజ్ స్కాన్ చేశారు. నిందితుల్ని గుర్తించి.. పట్టుకునేందుకు ప్రయత్నించడంతో ఎన్ కౌంటర్ జరిగింది.

## విపక్షాలకు అవకాశమిస్తే.. చొరబాటుదారులతో బిహార్ నిండిపోతుంది



**ఇంటర్నెట్ డెస్క్:** ఓట్ల చోరీ అంటూ 'ఇండియా' కూటమి తప్పుడు ఆరోపణలు చేస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా విమర్శించారు. భాజపా అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని గతంలో ఇదే తరహా దుష్ప్రచారం చేసిందన్నారు. బిహార్‌లోని డెహరీ ఆన్ సోన్‌లో పార్టీ శ్రేణులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ మేరకు మాట్లాడారు. బంగ్లాదేశీ చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఇటీవల రాహుల్ గాంధీ యాత్ర నిర్వహించారని ఆరోపించారు. ఒకవేళ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. రాష్ట్రమంతా చొరబాటుదారులతో నిండిపోతుందని వ్యాఖ్యానించారు. "బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులను రక్షించడమే రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరుగుతూ.. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే బిహార్ చొరబాటుదారులతో నిండిపోతుందని చెప్పండి. అదేవిధంగా 'ఓట్ల చోరీ' అంటూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేయడానికి భాజపా యత్నిస్తుందని గతంలో ఇదే తరహా ఆరోపణలు చేశారు. కానీ.. అలాంటిదేమీ జరగలేదు కదా" అని కాషాయ శ్రేణులను ఉద్దేశించి అమిత్ షా పేర్కొన్నారు. బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు అమిత్ షా ఈ పర్యటన చేపట్టారు. మగధ-శాహాబాద్ ప్రాంతంలోని 10 జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 2020 అసెంబ్లీ ఎన్నికలు, గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీయే పనితీరు అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అంతకుముందు సీఎం నీతీశ్ కుమార్ పాట్నాలో అమిత్ షాను కలిశారు. తాను ఎన్డీయేలోనే ఉంటానని ఇటీవల ప్రధాని మోదీ సమక్షంలో నీతీశ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## పాక్-సౌదీ రక్షణ ఒప్పందంపై భారత్ స్పందన ఇదే..



**న్యూఢిల్లీ:** పాకిస్తాన్- సౌదీ అరేబియా మధ్య వ్యూహాత్మక రక్షణ ఒప్పందం కుదరడంపై భారత్ స్పందించింది. ఆ ఇరు దేశాల ఒప్పందంలో వివరాల ప్రకారం.. ఇరు దేశాలలోని ఎవరిపైన దాడి జరిగినా.. అది ఇరు పక్షాలపైన జరిగిన దాడిగానే పరిగణిస్తారు. అప్పుడు ఆ ఇరు పక్షాలు సమానంగా ప్రత్యర్థితో పోరాడుతాయని పేర్కొన్నారు. దీనిపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఆ ఒప్పందపు పరిణామాలను అర్థం చేసుకునేందుకు అధ్యయనం చేస్తామని వెల్లడించింది. 'సౌదీ అరేబియా- పాకిస్తాన్ మధ్య కుదిరిన పరస్పర వ్యూహాత్మక రక్షణ ఒప్పందంపై సంతకం చేసినట్లు వచ్చిన నివేదికలను చూశాం. రెండు దేశాల మధ్య కుదిరిన దీర్ఘకాలిక ఒప్పందాన్ని అధికారికం చేసే పరిణామ ప్రక్రియ పరిశీలనలో ఉందని భారత ప్రభుత్వానికి తెలుసు. మన జాతీయ భద్రతతో పాటు ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వంపై ఈ పరిణామం వలన వచ్చే చిక్కులపై అధ్యయనం చేస్తాం. భారతదేశ జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకు, అన్ని రంగాలలో సమగ్ర జాతీయ భద్రతను నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని మీడియా ప్రశ్నకు సమాధానంగా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. సౌదీ క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు పాకిస్తాన్ ప్రధాని.. రియాద్‌ను సందర్శించారు అక్కడి అల్-యమామా ప్యాలెస్‌లో సౌదీ యువరాజు షరీఫ్‌ను కలిశారు. సౌదీ అరేబియా - పాకిస్తాన్ మధ్య పరస్పర రక్షణ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం, రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని అభివృద్ధి చేయడం, ఏదైనా దురాక్రమణకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుందని ఒప్పందపు ప్రకటన వెల్లడించింది. పహల్గామ్ ఉగ్రదాడి.. భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత.. పాక్- సౌదీల మధ్య కుదిరిన ఈ ఒప్పందం కీలకమైనదిగా భావిస్తున్నారు.

# విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు నిర్వీర్యం

-మొదటిపేజీ తరువాయి

లేకనే, వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. మొత్తం సభ్యులతో కలిపి, కేవలం ఒక ఎమ్మెల్యేకు మాత్రమే ఇచ్చే అతి తక్కువ సమయంలో ప్రజా సమస్యలు ఎలా ప్రస్తావిస్తామని ఆయన ప్రశ్నించారు. అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్న ఆయన, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, నిలదీసేందుకు అవసరమైన పూర్తి మెటీరియల్ సిద్ధంగా ఉందని, కానీ మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వడం లేదు కాబట్టే.. సభకు హాజరు కావడం లేదని తేల్చి చెప్పారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే..

**విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు నిర్వీర్యం:**

రాష్ట్రంలో కీలకమైన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం ఏడు త్రైమాసికాలు పెండింగ్. ప్రతి క్వార్టర్‌కు రూ.700 కోట్లు. గత ఏడాది ఎన్నికల ముందు.. 2024 జనవరి%-%మార్చి మొదలు ఈ ఏడాది సెప్టెంబరు వరకు చూస్తే.. మొత్తం ఏడు క్వార్టర్లు.. అంటే దాదాపు రూ.4900 కోట్లు బకాయి. అయితే ప్రభుత్వం ఇచ్చింది కేవలం రూ.900 కోట్లు మాత్రమే. అంటే ఇంకా దాదాపు లా రూ.4 వేల కోట్లు బకాయి. వసతి దీవెన గత ఏడాది రెండు దఫాలు. ఈ ఏడాది మరో దఫా పెండింగ్. అలా మొత్తం రూ.4200 కోట్లు బకాయి.

**తాడేపల్లిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వైఎస్ జగన్ భేటీ**

వసతి దీవెన కింద మరో రూ.2,200 కోట్లు బకాయి పడ్డారు. అలా ఈ రెండు పథకాలకే రూ.6,200 కోట్లు బకాయి పడ్డారు. కాలేజీలు కూడా చేతులెత్తేసే పరిస్థితులు వచ్చాయి. స్కూళ్లలో నాడు%-%నేడు పనులన్నీ గాలికి ఎగిరిపోయాయి. గోరుముద్ద నాశనం అయ్యింది. ట్యాబులిచ్చే కార్యక్రమం ఆగిపోయింది. సీబీఎస్‌ఈని రద్దు చేశారు. సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్ గాలికి ఎగిరిపోయింది. స్కూళ్లలో మినరల్ వాటర్ ప్లాంట్లు పని చేయకపోవడం కూడా ఆగిపోయింది. ఇంకా పిల్లలకు ఇచ్చే చిక్కీలు కూడా ఆపేశారు. ఇక వైద్య రంగం పరిస్థితి చూస్తే మరింత ఘోరంగా ఉంది. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీని ఆపేశారు. ఆరోగ్య శ్రీకి రూ.3500 కోట్లకు పైగా బకాయి పడ్డారు. దీంతో పథకంలో వైద్యం చేయలేమని ఆస్పత్రుల్లో బోర్డులు పెట్టేస్తున్నారు. ఇంకా ఆరోగ్య ఆసరా కింద రూ.600 కోట్ల బకాయి పడ్డారు.

**ఇవీ మెడికల్ కాలేజీల ప్రయోజనాలు:**

మన ప్రభుత్వంలో ఒకేసారి 17 మెడికల్ కాలేజీల పనులు మొదలుపెట్టి, ఏడు కాలేజీలు పూర్తి చేశాం. ఒక మెడికల్ కాలేజీ అనేది కేవలం కాలేజీ మాత్రమే కాదు. దాంతో టీచింగ్ హాస్పిటల్ ఉంటుంది. మంచి వైద్య సేవలందుతాయి. అది ప్రభుత్వ బాధ్యత. ఒకవేళ ప్రభుత్వం స్కూళ్లు, ఆస్పత్రులు, బస్సులు నడపకపోతే.. ఆయా రంగాల్లో ప్రై వేటు దోపిడిని అరికట్టగలుగుతారా? అందుకే ఎక్కడైనా, వాటిని ప్రభుత్వం తప్పనిసరిగా నిర్వహిస్తుంది. మనం ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ పనులు మొదలుపెట్టాం. దాని వల్ల అక్కడ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్య సేవలందుతాయి. ఒక మెడికల్ కాలేజీ ఉంటే, సీనియర్ వైద్యులు, స్పెషలిస్టులు, నర్సులు అందరూ అందుబాటులోకి వస్తారు. వైద్య సేవలందిస్తారు. అలా ప్రజలకు మంచి వైద్యం అందడమే కాకుండా, మన పిల్లలకు.. ముఖ్యంగా నిరుపేద పిల్లలకు మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి.

**వ్యవసాయ రంగం పరిస్థితి దారుణం:**

రైతులకు యూరియా కూడా సప్లై చేయని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. మొత్తం బ్లాక్ మార్కెట్‌ను నడిపిస్తున్నారు. ఇంకా ఏ పంటకూ గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు. ఏ పంటకు ఎంత ధర ఇవ్వాలన్న దానిపై నాడు మనం ప్రతి గ్రామంలోనూ పోస్టర్ ఇచ్చే వాళ్లం. సీఎం యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి రైతులకు తోడుగా నిలబడే వాళ్లం. మార్కెట్ జోక్యంతో మంచి ధరలకు పంటలు కొన్నాం. అందుకు రూ.7800 కోట్లు ఖర్చు చేశాం. కానీ ఈ ప్రభుత్వంలో ఏమీ లేవు. ఉచిత పంటల బీమాను కూడా రద్దు చేశారు. అన్నదాతా సుఖీభవ కింద రెండేళ్లకు రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చారు. వ్యవసాయం చేయడానికి రైతులు భయపడుతున్నారు. ఇలా అన్ని రంగాల్లోనూ పూర్తిగా తిరోగమనమే.

**ఎక్కడికక్కడ దోపిడి. నీకింత.. నాకింత:**

శాంతి భద్రతల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వ్యవస్థల్లో ఇంత లంచాలు ఎప్పుడూ చూడలేదు. ఎక్కడికక్కడ సిండికేట్లుగా మారి వసూళ్లు చేస్తున్నారు. పెదబాబుకు ఇంత, చిన బాబుకు ఇంత అని పంచుతున్నారు. లిక్కర్‌ను ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు అమ్ముతున్నారు. అక్రమంగా పర్మిట్ రూమ్‌లు నడుపుతున్నారు. ఉచిత ఇసుక అన్నారు. అది లేదు. ఇంకా క్వార్ట్జ్, సిలికా.. దేన్నీ వదిలిపెట్టడం లేదు. చివరకు ఫ్లైయాష్ కూడా అమ్మేసుకుంటున్నారు.

**అన్నింటా విఫలమైనా నిస్సిగ్గుగా సూపర్‌హిట్!:**

అన్నింటా దారుణంగా విఫలమైనా, ఎన్నికల హామీలు నిలబెట్టుకోకపోయినా, ఇటీవల సూపర్‌సిక్స్.. సూపర్‌హిట్ పేరుతో కార్యక్రమం చేశారు. ఆ సభ సందర్భంగా ఇచ్చిన అడ్వర్టైజ్‌మెంట్, ఎన్నికల నాటి యాడ్‌తో చూస్తే పూర్తిగా మారిపోయింది. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు. 50 ఏళ్లు నిండిన వారందరికీ పెన్షన్ రూ.4 వేలు లేవు. పథకాలు కూడా మారిపోయాయి. ఇదీ ఈ ప్రభుత్వ నిర్వాకం.

**ప్రజల గొంతు వినడం ప్రభుత్వానికి ఇష్టం లేదు:**

అసెంబ్లీలో ప్రజల గొంతు వినిపించాలన్న తపన, ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. నాడు మన ప్రభుత్వం ఉన్నప్పుడు, టీడీపీ నుంచి వారంలోనే 5గురు మనవైపు వచ్చి కూర్చున్నారు. అలా ఇంకొందరిని లాక్కుని, చంద్రబాబుకు ప్రతిపక్ష నాయకుడి హోదా లేకుండా చేద్దామని చాలా మంది సలహా ఇస్తే, నేను వద్దన్నాను. విపక్షం గొంతు వినాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆమేరకు వారికి అవకాశాలు ఇచ్చాం. సభలో వారు చెప్పేది విన్నాం. కానీ, ఈరోజు ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ.. ప్రతిపక్షం లేకుండా ఉండాలని కోరుతోంది. అందుకే మనకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వద్దని అనుకుంటోంది. అందుకే మనల్ని ప్రతిపక్షంగా గుర్తించడం లేదు. ఇటీవల ప్రెస్‌మీట్‌లో మూడు అంశాలపై గంటన్నర మాట్లాడాను. అలా మనకు అసెంబ్లీలో కూడా అవకాశం ఇస్తేనే, ప్రజా సమస్యలు ప్రస్తావించగలం. అలా కాకుండా ఒక ఎమ్మెల్యే మాదిరిగా కొన్ని నిమిషాల సమయం మాత్రమే ఇస్తే, ఏం మాట్లాడగలం?

**ఉన్నదే ఏకైక విపక్షం.. అయినా..!:**

నిజానికి సభలో ఉన్నవి నాలుగే నాలుగు పార్టీలు. అందులో మూడు కూటమిగా అధికారంలో ఉన్నాయి. ఇక్కడ ఉన్నది ఒకేఒక విపక్షం. అటు టీడీపీ, జనసేన, బీజేపీ మూడు కూటమి. ఇక్కడ మనది ఒకేఒక విపక్షం. కానీ దాన్ని గుర్తించబోమని చెబుతోంది. ఎందుకంటే సభలో ప్రజల గొంతు వినడం ప్రభుత్వానికి ఇష్టం లేదు. అందుకే మన పార్టీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదు. అందుకే సభకు వెళ్లకుండా ఇక్కడ ప్రెస్‌మీట్‌లో ప్రభుత్వాన్ని ఎండగట్టాలని నిర్ణయించాం.

**గట్టిగా నిలబడండి. నిలదీయండి:**

కానీ, మనకు కౌన్సిల్‌లో మంచి బలం ఉంది. రాజకీయంగా ఎదగడానికి పార్టీకి చెందిన ఎమ్మెల్సీలకు ఇది మంచి అవకాశం. దాన్ని సద్వినియోగం చేసుకోండి. చూస్తుండగానే ఏడాదిన్నర గడిచిపోయింది. మిగిలింది మరో రెండున్నర ఏళు మాత్రమే. మరో అసెంబ్లీ సెషన్ తర్వాత.. చూస్తుండగానే మరో ఏడాది గడుస్తుంది. కాబట్టి, మీరు కౌన్సిల్‌లో గట్టిగా నిలబడండి. గట్టిగా మాట్లాడండి. ప్రజా సమస్యలు లేవనెత్తండి. ప్రభుత్వాన్ని నిలదీయండి.

వీటన్నింటిపై ప్రభుత్వాన్ని నిలదీయండి:

సూపర్ సిక్స్. సూపర్ సెవెన్ వైఫల్యం..
రీ వెరిఫికేషన్ పేరిట దివ్యాంగులకు ఇబ్బందులు..
పెన్షన్ కోతలు..
ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన బకాయిలు..
యూరియా సహా ఎరువుల కొరత, రైతుల అగచాట్లు..
పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం..
రైతుల ఆత్మహత్యలు..
కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ..
వైఎస్సార్‌సీపీ ఇచ్చిన ఇంటి స్థలాలు లాక్కోవడం..
ఆరోగ్య శ్రీ బంద్..
విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ..
ప్రభుత్వంలో అవినీతి దోపిడీ..
ఉద్యోగస్తుల సమస్యలు, డీఏలు, పీఆర్సీలు, ఐఆర్, సరెండర్ లీవ్స్ తదితర బకాయిలు, వారిపై వేధింపులు..
పులివెందుల జడ్పీటీసీ బైపోల్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ..
అమరావతిలో తొలివిడత రైతులకు ఏమీ చేయకుండానే రెండో విడత ల్యాండ్ పూలింగ్..
అసైన్డ్ అన్న పదయం తీసేయడం. మళ్లీ బినామీల పేర్లతో కొనుగోలు..
రాష్ట్ర ప్రభుత్వం అప్పులు, ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం..
15 నెలల్లోనే రూ.19 వేల కోట్ల కరెంటు ఛార్జీల బాదుడు..

**రాష్ట్ర ఆదాయానికి దారుణంగా గండి:**

రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం రావడం లేదు. అదంతా అధికార పార్టీ నేతల జేబుల్లోకి పోతోంది. ఇసుక అమ్మకం ద్వారా మన హయాంలో ప్రభుత్వానికి ఏటా రూ.750 కోట్లు రాగా, ఇప్పుడు అది రావడం లేదు. మద్యం ఆదాయం మన హయాంలో ప్రభుత్వానికి వచ్చేది. కానీ, ఇప్పుడేం జరుగుతోంది?. వీళ్లే బెల్టు షాప్‌లు పెట్టించి, ఎక్కువ రేట్లకు అమ్మి అంతా జేబుల్లోకి వేసుకుంటున్నారు. లాటరైట్, క్వార్ట్జ్ తవ్వుకుంటున్నారు. అమ్ముకుంటున్నారు. ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే.. హార్బర్లలో వాళ్లే పెట్రోల్, డీజిల్ అమ్ముతున్నారు. ప్రభుత్వానికి పైసా ఆదాయం రావడం లేదు. మండలిలో మనకు మంచి బలం ఉంది. కాబట్టి మండలి సభ్యులు పోరాట పటిమ చూపాలి. ప్రజలకోసం గట్టిగా పోరాటం చేయాలి.

**అధికార పక్షం.. డబుల్ యాక్షన్:**

అసెంబ్లీలో అధికారపక్షం డబుల్ యాక్షన్ చేయాలనుకుంటోంది. 'నువ్వు కొట్టు.. నేను ఏడుస్తా' అన్నరీతిలో వారు వ్యవహరిస్తున్నారు. ఇంకా.. 'ప్రజల్ని ఏడిపించేది ప్రభుత్వమే. వారిని ఏడిపించి, మళ్లీ వారు ఏడుస్తున్నారని, వారి తరఫను తామే ఏడుస్తామంటూ ప్రభుత్వం డబుల్ రోల్ ప్లే చేస్తానంటోంది. అలా రెండు వైపులా యాక్షన్ చేస్తోంది'. నిజం చెప్పాలంటే వారు ఏడ్చినట్లు నటించిన మాత్రాన ప్రజల్లో సానుభూతి రాదు. విపక్షంగా మేము ప్రజా సమస్యలు లేవనెత్తితేనే, అందులో నిజాయితీ ఉంటుంది.

**నాడు చంద్రబాబు డ్రామాలు:**

నాడు చంద్రబాబు కూడా అసెంబ్లీకి రాలేదు. ఆయన్ను ఎవరూ ఏమీ అనకున్నా.. బయటకు వెళ్లి ఏడ్చాడు. నేను రికార్డులన్నీ చూశాను. మన సభ్యులు ఎవరూ ఏమీ అనలేదు. అయినా అబద్ధాలు చెప్పి, సభకు రాలేదు. అదే మనం జాయింట్ సెషన్‌లో గవర్నర్ అడ్రస్ సమయంలో అటెండ్ అయ్యాం. ఏటా అలా వెళ్తున్నాం. గవర్నర్ ఎదుట మన సమస్య ప్రస్తావించి, మనకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పి వస్తున్నాం

**మెడికల్ కాలేజీలు కాపాడుకోవాలి:**

మెడికల్ కాలేజీలు అన్నవి తరతరాల ఆస్తి. అలాంటి కాలేజీలను ప్రైవేటు పరం చేస్తున్నాడు. పైగా అందులో ఫీజులు దారుణంగా ఏకంగా రూ.57 లక్షలకు పెంచేస్తున్నాడు. ఆ కాలేజీలు తన అత్తగారి సొత్తు అన్నట్టుగా అమ్మేస్తున్నాడు. అవి ప్రభుత్వ రంగంలో ఉంటేనే పేదలకు ఉచితంగా వైద్యం అందుతుంది. అందుకే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పోరాటం చేయాలి. ప్రజలకు అత్యంత నష్టం కలిగిస్తున్న ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు అన్నిరకాల మార్గాలను అన్వేషించాలి. చంద్రబాబు తన వాళ్లకు కట్టబెట్టడానికి ఏమైనా చేస్తాడు. పేద ప్రజల ఆరోగ్య భద్రతకు తూట్లు పొడిస్తే సహించేది లేదు

## ఆర్థిక ఇబ్బందులు వచ్చినా దేశం, రాష్ట్రమే ముఖ్యం

-మొదటిపేజీ తరువాయి

సంస్కరణలను దృష్టిలో పెట్టుకుని చూడాలి. గతంలో 4 టైర్ (5, 12, 18, 28 శాతం) పన్నుల వ్యవస్థ ఉండేది. ఒకే ఉత్పత్తికి సంబంధించి అనుబంధ ఉత్పత్తులు వస్తే పన్నులు మార్చేవారు. పన్నుల విధానంలో 2 శ్లాబులు (5, 18శాతం) ఉంచి సరళతరం చేశారు. ఈసారి అన్ని పండుగలు ఘనంగా జరుపుకొనే అవకాశం ఉంది. ప్రధాని మోదీ సంస్కరణలతో పరోక్ష పన్ను చెల్లింపుదారులు 132శాతం పెరిగారు. 2017లో 65లక్షల మంది ఉంటే.. ప్రస్తుతం 1.51 కోట్ల మంది ఉన్నారు. జీఎస్టీ రిసిప్ట్‌ల ద్వారా 2018లో రూ.7.19లక్షల కోట్ల ఆదాయం వస్తే.. ప్రస్తుతం 22.08లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. జీఎస్టీ సంస్కరణలు పేదల జీవితాలపై ప్రభావం చూపుతాయి. 'వన్ నేషన్- వన్ విజన్' నినాదంతో ముందుకెళ్లాలి. డబుల్ ఇంజిన్ గ్రోత్ సాధించే దేశంగా భారత్ ఎదుగుతుంది. కొత్త పన్నులతో వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థకు రూ.2లక్షల కోట్లు సమకూరుతుంది" అని సీఎం వివరించారు. జీఎస్టీ మార్పులను స్వాగతిస్తూ ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసింది. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన ముఖ్యమంత్రి చంద్రబాబును అభినందిస్తూ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

## చారిత్రాత్మక జీఎస్టీ సంస్కరణలకు ఏపీ తొలి మద్దతుదారు

-మొదటిపేజీ తరువాయి

దీనివల్ల దేశం స్థిరమైన వృద్ధి పెరుగుతోందని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్. ఇది ప్రజలు, ఆర్థిక వ్యవస్థకు చాలా లాభదాయకని నొక్కిచెప్పారు. వ్యవసాయ పనిముట్లు, యంత్రాల రేట్లు తగ్గి ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు. పాలు, పెరుగుపై పన్ను 5శాతం నుంచి సున్నా శాతానికి అలాగే నిత్యావసరాల ధరలు చాలా వరకూ 18 నుంచి 5శాతానికి తగ్గుతున్నాయని గుర్తుచేశారు. సిమెంట్‌పై పన్నును 28 నుంచి 18కి తగ్గించారని తెలిపారు. అత్యవసర మందులపై జీఎస్టీ పన్ను లేకుండా చేయడం ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్కరణల ద్వారా ప్రజల చేతిలో సంపద పెరిగి వస్తువుల వాడకం పెరుగుతుందని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్. జీఎస్టీ విషయంలో అన్ని వాణిజ్య, వ్యాపార సంఘాలు అంగీకారం తెలిపినందుకు ఏపీ ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ ఏఏ బెనిఫిట్స్ జీఎస్టీ సంస్కరణల ద్వారా అమలు అవుతాయో తెలియజేయాల్సిన అవసరం కూడా ఉందని నొక్కి చెప్పారు పవన్. పరస్పర అవగాహనతోపాటు మీడియా వేదిక ద్వారా ప్రజలకు లాభాల గురించి తెలియజేయాలని కోరారు. జీఎస్టీ సంస్కరణలపై ఏపీ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## జలజీవన్ మిషన్‌ను వైకాపా సర్కార్ నిర్లక్ష్యం చేసింది: రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం: జలజీవన్ మిషన్‌ను గత వైకాపా సర్కార్ నిర్లక్ష్యం చేసిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు విమర్శించారు. పదేళ్లలో ఎంపీ లాడ్స్ ద్వారా మారుమూల ప్రాంతాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీ లాడ్స్, జాతీయ రహదారులు, జల జీవన్ మిషన్ పథకాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఏ సంవత్సరం ప్రారంభించిన కార్యక్రమాన్ని, అదే ఏడాది పూర్తి చేయాలన్న విధానంతో ఎంపీ లాడ్స్ నిధులను ఖర్చు చేశామన్నారు. లాజిస్టిక్ కనెక్టివిటీ వల్ల ఎకనామిక్ గ్రోత్ ఉంటుందన్న ఆయన.. కోస్టల్ కారిడార్ డీపీఆర్‌ను రూపొందించేందుకు ఇప్పటికే విశాఖపట్నంలో కార్యాలయం కూడా ప్రారంభించినట్లు చెప్పారు. భోగాపురం విమానాశ్రయాన్ని వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని.. దానికి అనుసంధానమయ్యే జాతీయ రహదారులపైనా తాజాగా సమీక్ష నిర్వహించామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలో 180కి.మీ పైగా ఉన్న జాతీయ రహదారిలో అనేక బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని, వీటి దగ్గరే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వాటిని తగ్గించేందుకు స్పష్టమైన ప్రణాళికతో వెళ్లాలని అధికారులకు సూచించారు. మూలపేట పోర్ట్ ప్రారంభం తర్వాత హైవే పై మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా జాతీయ రహదారి విస్తరణ కూడా త్వరలో జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి 13,050 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిన కేంద్రం

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. సీఎం చంద్రబాబు చొరవతోనే ఇతర రాష్ట్రాల కన్నా అధిక మొత్తంలో రాష్ట్రానికి యూరియాను కేంద్రం కేటాయిస్తుందని మంత్రి అచ్చెన్న తెలిపారు.

## లండన్ ను చుట్టేస్తున్న లోకేష్



**విజయవాడ :** ఏపీకి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు మంత్రి నారా లోకేష్ గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన తరచూ విదేశాల్లో పర్యటిస్తూ దిగ్గజ పారిశ్రామికవేత్తలను కలుస్తున్నారు. ఇలా కలిసే క్రమంలో చాలామంది పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా నారా లోకేష్ లండన్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో పెట్టుబడి పెట్టబోయే పారిశ్రామికవేత్తలతో సమావేశం అవుతున్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించేందుకు మాత్రమే నారా లోకేష్ లండన్ పర్యటన కొనసాగుతోంది. మరోవైపు తన పర్యటన విజయవంతంగా జరుగుతున్నట్టు నారా లోకేష్ స్వయంగా తన ట్విట్టర్ ఖాతా ద్వారా తెలిపారు. లోకేష్ పర్యటన ఆంధ్రప్రదేశ్లో కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.విశాఖ సమ్మిట్ కు ప్రచారంగా.. విశాఖలో త్వరలో ఏపీ ప్రభుత్వం పార్టనర్షిప్ సమ్మిట్-2025 నిర్వహిస్తోంది. నవంబర్ 14, 15 తేదీల్లో జరగనున్న ఈ సమ్మిట్ కు సంబంధించి లండన్ లో లోకేష్ భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సమ్మిట్ ను భారత ప్రభుత్వ డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్, ఏపీ ప్రభుత్వం, కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. లండన్ లో పెట్టుబడుదారులను ఆకర్షించేందుకుగాను సుమారు 150 మంది పెట్టుబడిదారులతో ఈ రోడ్ షో కొనసాగనుంది. ముఖ్యంగా లోకేష్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎడ్యుకేషన్, ఫిన్ టెక్, ఫార్మా, హెల్త్ కేర్, డీప్ టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెడ్ టక్ వంటి రంగాలపై దృష్టి పెట్టారు. ఈ రంగాలలో ఏపీలో ఉన్న అవకాశాలను వివరించే ప్రయత్నం చేశారు.లోకేష్ లండన్ పర్యటన విజయవంతంగా జరుగుతోంది. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని ఆయన వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా చంద్రబాబు విజన్, డిజిటల్ గవర్నెన్స్, ఈస్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి విధానాలను అక్కడి పారిశ్రామికవేత్తలకు వివరిస్తున్నారు. ఈ రోడ్డు షో ద్వారా పెట్టుబడులను ఆకర్షించి.. కొత్త ఉద్యోగాలను సృష్టించాలన్నదే లోకేష్ లక్ష్యంగా కనిపిస్తోంది. గత ఏడాది అమెరికాలో పర్యటించారు నరా లోకేష్. శాన్ ఫ్రాన్సిస్కో లో కూడా ఇలాంటి ప్రచారాలు నిర్వహించారు. అప్పట్లో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, అడోబ్ సీఈవో శాంతను నారాయణన్ తో సమావేశం అయ్యారు. దీంతో కొన్ని సంస్థలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధపడ్డాయి. ఆ మధ్యన లోకేష్ సీఎం చంద్రబాబు తో కలిసి సింగపూర్ పర్యటనకు వెళ్లారు. కొన్ని సంస్థలతో ఒప్పందాలు కూడా చేసుకున్నారు. ఇప్పుడు తాజాగా లండన్ పర్యటన ఏపీకి గేమ్ చేంజర్ అవుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# వైసీపీ ఓటర్లపై కమలం గురి

**కాకినాడ :** ఇదే సరైన సమయం. వైసీపీతో మనకు ఎలాంటి చీకటి ఒప్పందం లేదు. అంతర్గత దోస్తీ అంతకంటే లేదు. ఈ విషయం ఏపీ ప్రజలకు క్లారిటీ ఇవ్వాలి. ఏపీలో కాషాయం బలపడాలంటే ఫ్యాన్ పార్టీ ఓటు బ్యాంకు మనకు టర్న్ కావాల్సిందే. వైసీపీ ఓటర్లు బీజేపీ వైపు మళ్లాలంటే ఆ పార్టీపై సాఫ్ట్ కార్నర్ ఉంటే కుదరదు. వైసీపీకి ఇచ్చి పడేస్తేనే ఏపీ పొలిటికల్ పిచ్‌లో సెట్ అయిపోవచ్చు.ఇప్పుడిదే ప్లాన్‌తో ఉందట బీజేపీ. మొన్నటి దాక పొత్తులు..మద్దతు అంటూ ఊగిసలాడిన కమలనాథులు నవ్యాంధ్రలో బలపడడానికి ఇదే సరైన టైమ్ అని భావిస్తున్నారట. వైసీపీ అపోజిషన్‌లో ఉన్నప్పుడే ఆ పార్టీని మరింత వీక్ చేస్తే..టీడీపీకి షిఫ్ట్ కాని వైసీపీ ఓటర్లంతా తమకు వైపు మళ్లుతారని లెక్కలు వేసుకుంటున్నారట. ఈ పొలిటికల్ గేమ్‌తోనే ఏపీ సెంట్రిక్‌గా పెద్ద గేమ్ స్టార్ట్ చేసిందట బీజేపీ.వైసీపీని బీజేపీ రాజకీయంగా దూరంగానే పెడుతోంది. 2024 ఎన్నికల వేళ కూడా గుంటూరులో జరిగిన సభలో మోదీ వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి ప్రభుత్వం అని నాడు బీజేపీ పెద్దలు అన్నారు. అదే నిజమని ఇప్పుడు మరోసారి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విశాఖ వేదికగా వైసీపీ మీద తీవ్ర వ్యాఖ్యలే చేశారు. ఈ సారి ఇంకాస్త డోస్ పెంచారనే చెప్పొచ్చు. 2024 ఎన్నికల్లో ఏపీలో అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపారని..వైసీపీది అసమర్థ అస్తవ్యస్తమైన పాలన అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.మోదీ, అమిత్‌షాతో సహా బీజేపీ అగ్రనేతలెవరూ ఇప్పటివరకు ఈ స్థాయిలో వైసీపీని టార్గెట్ చేయలేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడి హోదాలో నడ్డా చేసిన కామెంట్స్ ఇప్పుడు కమలం క్యాడర్‌లో జోష్‌ను నింపుతున్నాయి. వైసీపీని ఒక డెత్ ట్రాప్‌గా అభివర్ణించారు నడ్డా.కూటమిగానే ఉంది. కేంద్రంలో టీడీపీ, జనసేన ఎంపీల




మద్దతుతోనే అధికారంలో కొనసాగుతోంది బీజేపీ. అయితే ఏపీలో ఒంటరిగా బలపడి డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉండాలని..అవసరమైతే సొంతంగా అధికారంలోకి వచ్చేంత స్ట్రాంగ్ కావాలని కలలు కంటోంది కమలం పార్టీ. ఇప్పుడు తమ బలం పెంచుకోవడానికి..కూటమిగానే ఉంటామంటోంది.అలా అని రాజకీయ వ్యూహాల విషయంలో ఏ మాత్రం తగ్గడం లేదు. కూటమిని డిస్టర్బ్ చేయకుండా..సొంతంగా బలపడాలంటే వైసీపీని టార్గెట్ చేయడం తప్ప మరో మార్గం లేదని డిసైడ్ అయిపోయింది కమలం పార్టీ. వైసీపీకి 40 శాతం ఓటింగ్ ఉంది. ఆ పార్టీ ఓటు బ్యాంకును తమవైపునకు తిప్పుకునే స్కెచ్ వేస్తోంది బీజేపీ. అందుకు అనుగుణంగా గతంలో ఏ బీజేపీ జాతీయ నాయకుడు చేయని విధంగా జేపీ నడ్డా వైసీపీని టార్గెట్ చేశారు. ఏకంగా వైసీపీని ఎమ్మెల్సీనే చేర్చుకుని..గత వైసీపీ పాలనపై నడ్డా సహా నేతలంతా తీవ్ర విమర్శలు చేయటం హాట్ టాపిక్‌గా మారింది.ఆ 40 శాతం పొలిటికల్ వాక్యూమ్ మీదే కమలనాథులు ఫోకస్ పెట్టినట్లు క్లియర్ కట్‌గా అర్థమవుతోంది. వైసీపీ విషయంలో సాఫ్ట్ కార్నర్‌తో ఉన్నా.. విమర్శలు చేయకుండా ఉన్నా తమకే నష్టమని భావిస్తున్నారట బీజేపీ నేతలు. భవిష్యత్‌లో వైసీపీ బలపడటం, తిరిగి అధికారంలోకి రావడమన్న సంగతి తర్వాత..ఇప్పుడు ఏపీలో మనం బలపడాలి. అంతకంటే ముందు ఏపీ ప్రజలు మనల్ని నమ్మాలని పెద్ద వ్యూహమే రచిస్తున్నారట. ఇక నుంచి మీటింగ్ ఏదైనా..విషయం మరేదైనా వైసీపీ టార్గెట్‌గా అటాక్ మొదలు పెట్టకపోతే పొలిటికల్‌గా పికప్ అవడం కష్టమని లెక్కలు వేసుకుంటున్నారట.కూటమిలోనే ఉన్నా.. జగన్‌తో బీజేపీ అగ్రనేతలకు సన్నిహిత సంబంధాలున్నాయని ఇన్‌సైడ్ టాక్ నడుస్తుంటుంది. జగన్ మీద బీజేపీ ఏ యాక్షన్ తీసుకోవడం లేదు.. తీసుకోలేదన్న గుసగుసలు ఉన్నాయి. వీటన్నింటికి చెక్ పెడుతూ ఏపీలో తమ రాజకీయ శత్రువు వైసీపీనే అని బీజేపీ క్లియర్ కట్‌గా చెప్పేస్తోంది. ఆ పార్టీ ఓటు బ్యాంకు టార్గెట్‌గానే ఫ్యూచర్ ప్లాన్స్ ఉంటాయని కమలనాథులు చెప్పకనే చెప్తున్నారు.ఇప్పటికే ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పీవీఎన్ మాధవ్..రాయలసీమ నుంచే తన పర్యటనలకు శ్రీకారం చుట్టారు. జగన్ ఇలాకాగా, వైసీపీ కంచుకోటగా పేరున్న రాయలసీమలో ఆ పార్టీ ఓటు బ్యాంకులో చీలిక తెస్తే వైసీపీ వీక్ అయి తమకు కలిసి వస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు. వైసీపీ ఓటు బ్యాంకును తమవైపునకు టర్న్ చేసుకోవాలని బీజేపీ వేస్తున్న ఎత్తులు వర్కౌట్ అవుతాయో లేదో చూడాలి మరి.

## సంపాదకీయం

# కార్యదీక్షతకు నిలువుటద్దం

ఆయన నిజాం వ్యతిరేక పోరాటయోధులలో ప్రముఖుడు. స్వార్థం అనే పదాన్ని దగ్గరకు రానీయకుండా, రాజకీయ పదవులకు ఏనాడూ పాకులాడకుండా, కేవలం ప్రజలకు, విలువల కొరకు ఎంతటి వారినైనా, ఎదిరించి ధైర్యంగా నిర్మొహమాటంగా నిలబడటం ఆయనకే చెల్లింది. సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవడాన్ని అవమానంగా భావించి, పోరాడి సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభింప చేసిన ఘనత ఆయనదే. హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించిన కృషీవలుడు ఆయన. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని కోర్టు తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకు లందరిని ఒక తాటిపైకి తెచ్చి, ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించిన గొప్పతనం ఆయనదే. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు. ఆయనే పోరాట పటిమకు, కార్యదీక్షతకు నిలువుటద్దంగా నిలిచిన యోధుడు కాటం లక్ష్మీ నారాయణ. కాటం లక్ష్మీనారాయణ (సెప్టెంబరు 19, 1924 – ఫిబ్రవరి 25, 2010) రంగారెడ్డి జిల్లా శంషాబాదులో, లక్ష్మయ్య, సత్తెమ్మ దంపతులకు 1924 వ సంవత్సరంలో సెప్టెంబరు 19 న జన్మించారు. అయన తాత కాటం నారాయణ స్థానిక జమీందారుల అకృత్యాలను ఎదిరించిన ధైర్యవంతులు. తాత పేరుతో పాటు ధైర్య సాహసాలు కూడా పుణికి తెచ్చు కున్నారు. 1942 అక్టోబరు 12 న బూర్గుల రామకృష్ణారావు చాదర్ ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండులో సత్యాగ్రహం చేయడానికి సన్నాహాలు చేసిన సందర్భంలో నైజాము పోలీసులు బూర్గుల రామకృష్ణారావును, లక్ష్మీ నారాయణను అరెస్ట్ చేశారు. అప్పటికి నారాయణ వయస్సు పంతొమ్మిది. అప్పటి నుండి లక్ష్మినారాయణ బూర్గుల రామకృష్ణారావుని గురువుగా బావించారు. పోలీసులు లక్ష్మినారాయణను ఏడు నెలల పాటు చెంచల్ గూడ జైల్లో వుంచారు. తర్వాత లక్ష్మినారాయణ న్యాయవిద్య పూర్తిచేసి బూర్గులవారి వద్దనే జూనియర్ లాయర్‌గా చేరారు. బూర్గులతో పాటు అన్ని కార్య కలాపలాలలో క్రియా శీలక పాత్ర పోషించారు. ఆనాటి సామాజికి సమస్యలలో కూడా పాలు పంచుకున్నారు. నిజాం ప్రభుత్య ఆజ్ఞలను దిక్కరించి హింది పాఠశాలను స్థాపించారు. ఖాది వ్యాప్తి, దళిత జనోద్ధరణ వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆచార్య రంగా ప్రేరణతో 1945లో లక్ష్మినారాయణ హైదరాబాదు యువ జన కాంగ్రేసు స్థాపించి తాను ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. లక్ష్మి నారాయణ ఏదో ఒక ఉద్యమంలో పాల్గొనడం, అరెస్ట్ కావడం, తిరిగి రావడం, మళ్లి జైలుకెళ్లడం నిత్య కృత్యంగా మారింది. నిజాం పాలన అంతమై, నూతన రాష్ట్రం ఏర్పాటు అయ్యాక, ఆర్థిక, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో రాష్ట్ర పునర్ నిర్మాణానికి 1949 డిసెంబరులో "జనత" పేరుతో ఒక పత్రికను ప్రారంబించారు. గతంలో రజాకార్ల చేతిలో హతుడైన షోయబుల్లా ఖాన్తో కలిసి పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం ఇప్పు డితనికి బాగా ఉపక రించింది. అంతే గాక రైతుల సమస్యల పరిష్కారానికి 1952లో రాష్ట్ర కర్షక సంఘాన్ని స్థాపించారు."తెలుగు భూమి" అనే మరొక పత్రికను 1969లో ప్రారంబించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు. 1968లో హైకోర్టు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకులందరిని ఒక తాటిపైకి తెచ్చి ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించారు. ఆ సందర్భంలో ఒక మహా సభ ఏర్పాటు చేయించారు. దానికి లక్షలాది మంది రాగా నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంది కూడా రావడం విశేషం.లక్ష్మి నారాయణ సాధించిన ఘన విజయాలలో ఇది ఒకటి. స్వాతంత్ర్య ఉద్యమాలలో పాల్గొన్న యోధులకు పెన్షన్ ఒక వరం లాంటిది అని నమ్మేవారు లక్ష్మి నారాయణ. స్వతంత్ర భారత్ లో ఈ అవకాశాన్ని అందరు వినియోగించు కుంటున్నా.... నిజాం పాలిత ప్రాంతాల యోధులకు ఆ అవకాశం రాలేదు. దీనిపై లక్ష్మి నారాయణ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. కేంద్రం అంగీకరించక పోవడంతో లక్ష్మి నారాయణ " తెలంగాణ సమర యోధుని సత్యాగ్రహం" అని రాసిన ఒక అట్టను మెడలో వేసుకుని ప్రధాని ఇంటి ముందు నిరాహార దీక్ష చేసారు.ఢిల్లీ పత్రికలు ప్రముఖంగా ఈ అంశాన్ని ప్రచురించాయి. దాంతొ ఇందిరా గాంధి లక్ష్మి నారాయణను పిలిపించి కారణం అడగగా..... " సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను మీరు గుర్తించక పోవడాన్ని మేము అవమానంగా భావిస్తున్నాము. బ్రిటిష్ ఆంధ్ర స్వాతంత్ర్య యోధులు ఒక బ్రిటిష్ వారితోనె పోరాడారు. కాని సంస్థాన లోని యోధులు అటు సంస్థానాధీశుల తోను, ఇటు బ్రిటిష్ వారితోను పోరాడారు. 15 ఆగస్టు మాకు స్వాతంత్ర్య దినం కాదా? హైదరాబాదు విముక్తి జరిగిన సెప్టెంబరు 17 ను స్వాతంత్ర్య దినంగా జరుపుకో మంటారా? ఒక్క హైదరాబాదు సంస్థాన ప్రజలే కాదు పలు సంస్థానాల ప్రజలు భారతీయులు కారా? అవునా? కాదా? ముందు ఇది తేల్చండి? " అని సూటిగా, ధైర్యంగా ఇందిరా గాంధిని ప్రశ్నించి యోధుడు లక్ష్మి నారాయణ. దాంతో సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభించింది. ఈ యోధుడు సాధించిన అతి పెద్ద ఘన కార్యం. నేటికీ ప్రామాణిక గ్రంథంగా ఉన్న 844 పేజీల హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించారు... దాన్ని అప్పటి భారత రాష్ట్ర పతి జైల్ సింగ్ చేత ఆవిష్కరింప జేసారు. పి.వి.నరసింహ రావు, టి. అంజయ్య, కాసు బ్రంహానంద రెడ్డి, భవనం వెంకట్రామ రెడ్డి, నలుగురు ముఖ్య మంత్రులతో ఒక పెద్ద సభను నిర్వహించారు. అయన నిర్వహించిన సభలకు ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు, పీఠాధిపతులు, స్వాతంత్ర సమర యోధులు, దలైలామ వంటి వారు కూడా పాల్గొనే వారు. ఆ మహా యోధుడు 2010 వ సంవత్సరం ఫిబ్రవరి 25 నాడు ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

## స్థానిక సమస్యల పరిష్కారమే

# పంచాయితీ రాజ్ లక్ష్యం



భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయ తీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థలవ్యవస్థ. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనా వ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగు ణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్ పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వ పరిపాలనా సంస్థలు రూపు దిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్ర ప్రదేశ్ లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్ నగర్ జిల్లా, షాద్‌నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతి సమితి, జిల్లా స్థాయి లో జిల్లా పరిషత్ ఏర్పడింది. 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్ గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగా త్మక ప్రాతిపదికగా, సమాజ వికాసా భివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుక బడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యా లు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీ ని 1956లో నియమించా రు. ఈ కమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి. బల్వంతరాయ్ మెహతా (1900 ఫిబ్రవరి 19 – 1965 సెప్టెంబరు 19) స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక కార్యకర్త, పంచాయితీ రాజ్ నూతన వ్యవస్థ మార్గదర్శకుడు. ఆయన బర్డోలి సత్యాగ్రహ భాగస్వామి. గుజరాత్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. స్వయం పాలన కోసం ప్రజల పోరాటం ఆయన జీవితా శయం. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సంబంధంగా... "బల్వంతరాయ్ మెహతా కమిటీ" సిఫార్సులు దేశంలో అమలు పరచబడి, ప్రాచుర్యం పొందిన పంచాయితీ రాజ్ అనే విప్లవాత్మక కార్యక్రమంతో మెహతా గుర్తింపు పొందాడు. స్వాతంత్ర్యం తరువాత మెహతా భారతదేశ లోక్‌సభకు పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికయ్యా డు. పార్లమెంట్ అంచనా కమిటీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ప్రణాళిక ప్రాజెక్ట్స్ కమిటీ అధ్యక్షుడుగా రాష్ట్రాలలో మూడు అంచెల వ్యవస్థ స్థాపన కోసం మెరుగైన విధానానికి అద్భుతమైన నివేదికను సిద్ధం చేశాడు. తద్వారా భారత దేశపు పంచాయితీ రాజ్ ఫాదర్‌గా ప్రశంసించ బడ్డాడు. 1952, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన సమాజ అభివృద్ధి కారక్రమం ప్రాతి పదికగా, జాతీయాభివృద్ధి మండలి 1957, జనవరి, 16న బల్వంత్ రాయ్ గోపాల్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీ క్షించి, గ్రామ పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3 – అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ను సిఫారసు చేస్తూ, తన నివేదిక ను 1957, నవంబరు 24న జాతీ యాభివృద్ధి మండలికి సమర్పించిం ది. కమిటీ నివేదికను జాతీయా భివృద్ధి మండలి 1958, జనవరిలో ఆమోదించింది. ఈ నివేదికలోని అంశాల అమలు వివిధ రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థఏర్పాటుకు ప్రయత్నించాయి. భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచ నంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్ జిల్లాలోని, సికార్ అనే ప్రాంతంలో ఈ విధానా న్ని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం..."నేడు ప్రారంభమ వుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడతాయి". మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1959, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్లోని రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వద్ద నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెహ్రూ ప్రారంభించారు. బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు... దేశంలో 3 అంచెల పంచాయతీ రాజ్ విధానం ఏర్పాటు చేయాలి. 1) జిల్లా స్థాయిలో – జిల్లా పరిషత్, 2) బ్లాకు స్థాయిలో – పంచాయతీ సమితి, 3) గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నిక లను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమ బద్ధంగా ఎన్నికలు జరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కింది స్థాయి లో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయుల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరి పాలనా, వనరుల, ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేయాలని బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగా పరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్ వ్యవస్థ యొక్క ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్య సాధన కోసం స్వాతంత్ర్యానంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తనవంతు కృషి చేస్తూనే ఉన్నాయి.

# మనసు కవి ఆత్రేయ

1921 మే 7 న శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సూళ్ళూరుపేట మండలంలో గల మంగళంపాడు గ్రామంలో ఆత్రేయ జన్మించారు. తండ్రి కృష్ణమాచార్యులు. తల్లి సీతమ్మ. చిన్నప్పటినుండి నాటకంలోని పద్యాలను రాగయుక్తంగా చదివేవారు. సమాజంలో మధ్య తరగతి కుటుంబ సమస్యలను తీసుకుని మనోహరమైన నాటకాలుగా మలిచారు. 'ప్రవర్తన', 'ఎన్.జి.వో' నాటకాలు ఆంధ్ర నాటక కళా పరిషత్ అవార్డుల ను గెలుచు కున్నాయి. విశేషంగా రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో ప్రదర్శనలు జరిగాయి. అలాగే 'కప్పలు' బాగా ప్రాచుర్యం పొందిన నాటకం. రాయలసీమ క్షామ పరిస్థితుల ను వివరించే 'మాయ' నాటకం, స్వాతంత్ర్యానంతరం దేశంలో చెలరేగిన హిందూ ముస్లిం హింసాకండను 'ఈనాడు' అనే మూడంకాల నాటకం, విశ్వశాంతిని కాంక్షించే 'విశ్వశాంతి' నాటకాన్ని రచించారు. విశ్వశాంతి నాటకానికి కూడా రాష్ట్ర స్థాయి బహుమతి లభించింది. 'సామ్రాట్ అశోక', 'గౌతమ బుద్ధ', 'భయం' నాటకాలు కూడా వ్రాసారు. ఆత్రేయ పలు చలన చిత్రాలకు సంభాషణలు, పాటలు రాశారు. ఆయన పాటలలో ఎక్కువగా మనసుకు సంబంధించిన ప్రస్తావన ఉండటం వలన అతను మనసు కవి, మన సుకవి అయ్యారు. దీక్ష (1950) చిత్రానికి తొలిసారి గీత రచన, అదే సంవత్సరంలో విడుదలైన సంసారం చిత్రానికి తొలిసారి కథా రచన చేసారు. వాగ్ధానం (1961) చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం కూడా చేసాడు. చిన్ని చిన్ని పదాలతో స్పష్టమైన భావాన్ని పలికించడంలో ఆత్రేయ ఘనాపాఠి. తెలుగు పాటను ఆస్వాదించే అందరి మనసులను దోచుకున్న ఈ మనసు కవి 1989, సెప్టెంబర్ 13 న ఈ లోకాన్ని వదిలిపోయారు. ఆత్రేయ తాత్విక ధోరణితో రాసిన సంభాషణలు జీవిత తత్వాన్ని గుట్టు విప్పుతాయి. జీవితాన్ని కాచి వడబోసిన నగ్నసత్యాలు. ప్రతి వ్యక్తి జీవితానికి మార్గ దర్శకాలు. "వెలుగు నీడలు" చిత్రంలో ఇటువంటి ఓ అద్భుత సంభాషణ తనదైన శైలిలో రాసి ఓ సన్నివేశానికి ఆత్రేయ జీవం పోసారు. సెంటిమెంటల్ అనే పదానికి భావగర్భితమైన, కరుణ రసముగల, శృంగార భావములుగల అర్థాలున్నాయి. సినిమా పరిభాషలో సెంటిమెంటల్ డైలాగ్స్ అంటే పరస్పర ప్రేమాను రాగాలను, ఆత్మీయానుబంధాలతో, కరుణరస భరితంగా ఒకరికొకరు సంభాషించు కోవడం. సెంటిమెంటల్ డైలాగ్స్ రాయడంలో ఆత్రేయది అందెవేసిన చెయ్యి. ఆత్రేయకు లేడీస్ సెంటిమెంట్లు లేకపోయినా లేడీస్ సెంటిమెంట్ డైలాగ్స్ బాగా రాస్తారని చెప్పుకుంటారు. ఆత్రేయ గొప్ప వేదాంతి. ప్రతి విషయాన్ని వాస్తవిక దృష్టితో ఆలోచించి సంభాషణలను సమకూర్చాడు. "వేదాంతం, వైరాగ్యం ఒంటపడితే చాలా ప్రమాదం. వాటి జోలికిపోకుండా ఉంటే చాలా మంచిది. అవి మనిషిలోని కార్య దీక్షను, గట్టి విశ్వాసాలను దెబ్బతీస్తాయి" అని ఆత్రేయ అనే



వారు. శృంగార రసం శృతి మించితే అశ్లీలం అవుతుంది. ఇటువంటి కొన్ని సన్నివేశాలకు రచయిత పచ్చిగా రాయక తప్పదు. నేను రాయను అని మడికట్టుకు కూర్చుంటే సినీ రచయితగా చిత్ర పరిశ్రమలో ఏ రచయితా నిలబడ లేడు. ఈ కారణమే ఆత్రేయను బూత్రేయ అని కూడా పేరు మూట గట్టుకునేలా చేసింది. 'దీక్ష' (1950) చిత్రానికి తొలిసారి అతను పాటలు రాశారు. "పోరా బాబు పో.." అంటూ సాగే పాట ప్రేక్షకులను, సినీ మేకర్స్‌ని బాగా ఆకట్టుకోవడం ఆత్రేయ పాటల్లోని మాధుర్యం ఏంటో సినిమా పరిశ్రమకు తెలిసింది. అదే ఏడాదిలో విడుదలైన 'సంసారం' చిత్రానికి తొలిసారి కథా రచన కూడా చేశారు. దీంతో దర్శక, నిర్మాతలంతా ఆత్రేయతో పాటలు రాయించేందుకు క్యూ కట్టారు. 'అర్థాంగి' చిత్రంలో 'రాక రాక వచ్చావు చందమామా..', 'తోడి కోడళ్ళు' చిత్రంలో 'కారులో షికారుకెళ్లి...', 'శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం'లో 'శ్రీశైలవాసా శ్రీ వెంకటేషా...', 'మంచి మనసులు'ల్లో 'శిలలపై శిల్పాలు చెక్కినారు...', 'మూగ మనసులు' చిత్రంలో 'ముద్దబంతి పువ్వులో...' 'డాక్టర్ చక్రవర్తి'లో 'నీవులేక వీణ ...', 'అంతస్తులు'లో 'తెల్ల చీర కట్టుకున్నది ఎవరి కోసము...', 'ప్రేమ్‌నగర్'లో 'నేను పుట్టాను ఈ లోకం మెచ్చింది. నేను ఏడ్చాను ఈ లోకం నవ్వింది. నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది...', 'మరోచరిత్ర'లో 'ఏ తీగ పువ్వునో ఏ కొమ్మ తేటినో...', 'ఇంద్ర ధనస్సు'లో 'నేనొక ప్రేమ పిపాసిని నీవొక ఆశ్రమ వాసివి...', 'అంతులేని కథ'లో 'కళ్ళల్లో ఉన్నదేదో కన్నులకు తెలుసు...', 'మరో చరిత్ర'లో 'విధి చేయు వింతలన్నీ...', 'ఇది కథ కాదు'లో 'సరిగమలు గలగలలు...', 'స్వాతిముత్యం'లో 'చిన్నారి పొన్నారి కిట్టయ్య...' తోపాటు 'తేనే మనసులు', 'ప్రైవేట్ మాస్టర్', 'బ్రహ్మచారి', 'మట్టిలో మాణిక్యం', 'బడి పంతులు', 'పాపం పసివాడు', 'భక్త తుకారం', 'బాబు', 'జ్యోతి', 'అందమైన అనుబంధం', 'గుప్పెడు మనసు', 'ఆకలి రాజ్యం', 'అభిలాష', 'కోకిలమ్మ', 'అభినందన', 'ప్రేమ' వంటి చిత్రాల్లో 400లకుపైగా పాటలు రాసి తెలుగు ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. పాటలన్ని భావోద్వేగాల సమాహారంగా ఉండటంతో ఆత్రేయను 'మనసు కవి'గా ప్రేక్షకులు, అభిమానులు అభివర్ణించారు. ఎంతటి బరువైన భావాలనైనా అర్థవంతమైన తేలికైన పదాలతో పలికించడంతో ఆత్రేయ దిట్ట. మూడున్నర దశాబ్దాల సినీ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను చవిచూశారు. పాటల్లో తన అనుభవాలను పొదిగి, గుండె బరువును దించుకునే వారని ఆయన సన్నిహితులు పలు సందర్భాల్లో చెప్పారు. రాయక నిర్మాతలనూ రాసి ప్రేక్షకులనూ ఏడిపిస్తాడని ఆయన పై ఓ ఛలోక్తి. కానీ ఆత్రేయ... రాస్తూ నేనెంత ఏడుస్థానో ఎందరికి తెలుసు అనేవారు. తెలుగు సినిమా పాటలను మామూలు వాడుక మాటలతోనే రాయగలిగిన ప్రతిభా శాలి ఆత్రేయ. ఉదాహరణకు, తేనె మనసులు సినిమాలో ఈ రెండు పాటలు "ఏవమ్మా నిన్నేనమ్మా ఏలా ఉన్నావు," "నీ ఎదుట నేను వారెదుట నీవు, మా ఎదుట ఓ మామా ఎప్పుడుంటావు." అలాగే ప్రేమనగర్ సినిమాలో "నేను పుట్టాను ఈలోకం మెచ్చింది,, నేను ఏడ్చాను ఈ లోకం నవ్వింది, నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది." పాట,, "తేట తేట తెలుగులా తెల్లవారి వెలుగులా" పాట. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ చిట్టా అనంతమే అవుతుంది. మరోచరిత్ర సినిమాకి రాసిన పాటలు/ ఏ తీగ పువ్వునో...ఏ కొమ్మ తేటినో.../ పదహారేల్లకు...నీలో నాలో/ బలే బలే మగాడివోయ్ ...నీ అన నీ దానినోయ్...అనే పాటలు ఇప్పటికి శ్రోతలని అలరిస్తూనే ఉన్నాయి. కృష్ణ, శారదలు నటించిన "ఇంద్రధనుస్సు" సినిమాలోని పాట "నేనొక ప్రేమ పిపాసిని నీవొక ఆశ్రమ వాసివి" అనే పాట ఆత్రేయకు అత్యంత ఇష్టమైన పాటగా చెబుతారు. అతన్ను ఒకసారి ఏదో సందర్భంలో ఈ పాట నా జీవితానికి సంబంధించిన పాట అని చెప్పారు. మనసును గూర్చి ఆత్రేయ రాసినన్ని పాటలు వేరొకరు రాసి ఉండలేదు. అందుకనే ఆయనను మనసు కవి అనేవారు. ఆత్రేయ పాటల రచయిత మాత్రమే కాకుండా, అనేక సినిమాలకు మాటల రచయితగా కూడా ఉన్నారు. ముఖ్యంగా ప్రేమనగర్ సినిమా విజయంలో ఆత్రేయ రాసిన పాటలు, మాటలు ముఖ్యభూమిక వహించిందంటే అతిశయోక్తి కాదు.

# విద్యార్థినులకు చట్టపరమైన అవగాహన కల్పిస్తున్న శక్తి టీం బృందాలు





**అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా (ప్రతాప్)** అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో శక్తి టీం బృందాలు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థినులకు శక్తి యాప్, డయల్ 100, 112, 1091, 1098, 181, 1930 వంటి అత్యవసర సేవల గురించి వివరించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మధ్య తేడా, స్వీయ రక్షణ పద్ధతులు వివరించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ ప్రభావం, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం మరియు మహిళలరక్షణకు ఉన్న ఇతర చట్టాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు, బాలికలు, యువతులు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చిస్తూ, వాటిని ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థినుల్లో జాగ్రత్త, ఆత్మవిశ్వాసం, చట్టపరమైన అవగాహన పెరుగుతోందని అధికారులు తెలిపారు.

# తల్ సైనిక్ క్యాంప్ ను విజయవంతంగా పూర్తి చేసిన ఎస్ కే పి డిగ్రీ కళాశాల విద్యార్థి

**విద్యార్థి మల్లికార్జున ను అభినందించిన కళాశాల ప్రిన్సిపల్ బృందం**




**గుంతకల్లు సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి (ఎస్. కె. పి.) ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) విద్యార్థి హెచ్. మల్లికార్జున సెకండ్ బి.ఎ జాతీయ స్థాయిలో జరిగిన తల్ సైనిక్ క్యాంప్ ను విజయవంతంగా పూర్తి చేసుకుని గురువారం కళాశాలకు రావడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ లక్ష్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్. ఎ.లక్ష్మయ్య కళాశాల అధ్యాపకు బృందం విద్యార్థి మల్లికార్జునను అభినందిం చారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ హెచ్.మల్లికార్జున కర్ణాటక బార్డర్ లో ఉన్నటువంటి కోసిగి మండలంలోని మారుమూల గ్రామం అయినటువంటి చింతకుంట గ్రామంలో వ్యవ సాయ నేపథ్యం కలిగినటు వంటి కుటుంబం నుంచి అంచలంచలుగా ఎదిగి ఢిల్లీ దాకా వెళ్ళగలిగాడు. తల్ సైనిక్ క్యాంపుకు అబ్ స్టాకిల్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రెండు రాష్ట్రాల నుంచి 10 మంది విద్యార్థులను సెలెక్ట్ చేయగా అందులో ఒక్కరు ఎస్కేపి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి హెచ్. మల్లికార్జున అని, తల్ సైనిక్ క్యాంప్ సెలక్షన్స్ అనేక స్థాయిలలో జరుగుతాయి. మొదట ఏ.టి.సి/సి.ఎ.టి.సి క్యాంపు లో అర్హత సాధించాలి. తర్వాత ఇంటర్ బెటాలియన్ 6(ఆంధ్ర),9( ఆంధ్ర),28 (ఆంధ్ర),1(ఆంధ్ర) మెడికల్ స్థాయిలో అర్హత సాధించాలి. తర్వాత ఇంటర్ గ్రూప్స్ కర్నూల్,తిరుపతి,గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, వరంగల్,హైదరాబాద్, సికింద్రాబాద్, మరియు నిజామాబాద్ వీరందరికీ కలిపి నిర్వహించిన పోటీలో అర్హత సాధించి టిఆర్జి -1, టిఆర్జి-2, టిఆర్జి -3 లో అర్హత సాధిస్తే ఏ.ఐ.టి.ఎస్.సి. కి సెలెక్ట్ అవుతారు. ఏడు రకాల స్థాయిలలో అర్హత సాధిస్తే ఆల్ ఇండియా తల్ సైనిక్ క్యాంపు లో పాల్గొనే అవకాశం దక్కుతుంది. ఆల్ ఇండియా తల్ సైనిక్ క్యాంపు లో పాల్గొనడం వల్ల త్రివిధ దళాలయిన (ఆర్మీ,నేవీ మరియు ఎయిర్ ఫోర్స్ )లో ఉద్యోగం సాధించడానికి అవకాశం ఎక్కువగా ఉంటుం ది. జాతీయస్థాయిలో నిర్వ హించే ఆర్మీకి సంబంధించిన ఉద్యోగాలలో ఏడు మార్కులు కలపడం జరుగుతుంది. ఇంత పెద్ద విజయాన్ని సాధించిన ఎస్ కె పి కళాశాల ఎన్సిసి విద్యార్థి హెచ్.మల్లికార్జునను విద్యార్థులందరూ కూడా ఆదర్శంగా తీసుకొని జాతీయ స్థాయిలో కళాశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో ప్రిన్సిపాల్ డాక్టర్.ఏ. లక్ష్మయ్య మరియు ఎన్సిసి అధికారి లెఫ్ట్ నెంట్. డాక్టర్.సి. బాలకృష్ణ క్యాడెట్ మల్లికార్జున ను పూలమాల వేసి శాలువా తో అభినందించారు. అలాగే అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మరియు విద్యార్థులందరూ మల్లికార్జునను అభినందించారు. ఈ కార్యక్రమంలో హిస్టరీ అధ్యాపకులు డాక్టర్.కే.గోపి నాయక్, వైస్ ప్రిన్సిపాల్ ఏ.రవిశంకర్ శర్మ, ఐక్యూఎస్సీ కోఆర్డినేటర్ జమీల బిబి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్. ఆర్.నాగరాజు, ఎన్సిసి క్యాడెట్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పొలం పిస్తుంది కార్యక్రమం





**జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శివ నారాయణ**

**లక్కిరెడ్డిపల్లి సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి)** గురువారం జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శివ నారాయణ రైతు పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఈ క్రప్ బుకింగ్ కార్యక్రమం అమలులో పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, రైతుల వివరాలు సకాలంలో నమోదు అయ్యేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. రైతుల పంట వివరాలు సమగ్రంగా నమోదు అయితే భవిష్యత్‌లో పంటల అంచనాలు, సబ్సిడీలు మరియు ప్రభుత్వ పథకాలు మరింత సమర్థవంతంగా రైతులకు చేరుతాయని చెప్పారు. ఏపీ సి ఎం ఎఫ్ (ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్) పద్ధతిలో సాగు చేస్తున్న రైతులను ఉత్సాహపరిచారు. సహజ వ్యవసాయాన్ని అనుసరించడం ద్వారా పంటల ఉత్పాదకత పెరగడంతో పాటు ఖర్చులు తగ్గుతాయని వివరించారు. అలాగే, ప్యాడీ లైన్ సోయింగ్ (వరి వరుస విత్తనం) ప్రదర్శనను పరిశీలించారు. వరుసలుగా విత్తనం వేసిన పద్ధతితో మొక్కల మధ్య, వెలుతురు సమానంగా లభించడం వల్ల దిగుబడి పెరగడంతో పాటు నీటి వినియోగం కూడా తగ్గుతుందని రైతులకు వివరించారు. అదే విధంగా సహజ వ్యవసాయంలో ముఖ్యమైన ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని, దాని వినియోగాన్ని రైతులకు సూచించారు. జీవామృతం వలన నేలలో సూక్ష్మజీవులు పెరిగి, పంటలు ఆరోగ్యంగా ఎదిగి, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఆయన చెప్పారు. ఈ సందర్శనలో వ్యవసాయ విభాగ అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు. రైతులు తమ అనుభవాలు పంచుకొని, జెడిఎ ప్రశ్నలు అడిగి వివరణలు పొందారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతులు, సహజ వ్యవసాయం, మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృత అవగాహన చేశారు.

## విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలి



**గుంతకల్లు సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):** విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని వక్తలు అన్నారు. స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో గురువారం జీవ సాంకేతిక శాస్త్రం (బయోటెక్నాలజీ) విభాగం ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ప్రతి ఒక్కరి జీవితంలో డిగ్రీ విద్య అమూల్యమైనదని వక్తలు అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని వారి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు కృషి చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులు డిగ్రీ స్థాయిలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో సాధించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. బయోటెక్నాలజీ విద్యార్థు లకు అనేక అవకాశాలు ఉన్నా యని ఆయన తెలిపారు. బయోటెక్నాలజీ సీనియర్ విద్యార్థులు,జూనియర్ విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంత రం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నా యి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టి. వెంకటరమ ణ,బి .క్రిష్ణయ్య, ఖాజావలి, కురుపాటి రాకేష్,శివయ్య, డాక్టర్ వైశాలి,వరలక్ష్మి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీలో ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని:

**ఆర్టీసీ ఎండి. ద్వారక తిరుమల రావుకు వినతి**



**గుంతకల్లు సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):** గురువారం గుంతకల్లు ఆర్టీసీ డిపోను పరిశీలించడా నికి వచ్చిన ఏపీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి) ద్వారకా తిరుమల రావుకు గుంతకల్లు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులు కలసి తమకు ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఔట్సోర్సింగ్ కార్మికులు మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్ పూర్తిచేసి గత కొన్ని సంవత్సరాలుగా గుంతకల్లు ఆర్టీసీ డిపోలో ఔట్సోర్సింగ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నామని, కాంట్రాక్టర్ల విధానాన్ని రద్దుచేసి, ఏపీఎస్ఆర్టీసీ కార్పొరేషన్ ద్వారానే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎండికి ఇచ్చి తమకు న్యాయం చేయాలని అవుట్సోర్సింగ్ కార్మికులు ఎండిని కోరారు.

## మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ ఎండి షఫీ నాయక్ ను సన్మానించిన

**లక్కిరెడ్డి పల్లె మండల యాదవ్ సంఘాలు**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న అటవీ శాఖ డైరెక్టర్ యర్రగొల్ల రెడ్డెయ్య యాదవ్**



**లక్కిరెడ్డిపల్లి సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)** గురువారం నాడు లక్కిరెడ్డి పల్లె మార్కెట్ యార్డ్ నందు చైర్మన్ డాక్టర్ ఎస్ ఎండి షఫీ నాయక్ ను మర్యాదపూర్వకంగా కలసిన లక్కిరెడ్డి పల్లె మండల యాదవ సంఘాల నాయకులు అనంతరం చైర్మన్ డాక్టర్ ఎస్. ఎం. డి షఫీ నాయక్ ను దృశ్యాలువతో సన్మానించి పూల బుకే అందచేశారు

## కార్పొరేట్ మంగళ షాపులను తొలగించాలని రెండవ రోజు సంతకాల సేకరణ




**గుంతకల్లు సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):** గుంతకల్ పట్టణంలోని కసాపురం రోడ్డు వాల్మీకి సర్కిల్ నందు క్షరవృత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలో కార్పొరేట్ మంగళ షాపులను తొలగించాలని ప్రజల మద్దతు కోరుతూ రెండవ రోజు సంతకా ల సేకరణ చేయించడం జరిగిం ది. ఈ కార్యక్రమానికి మద్దతు గా ప్రజలు,ప్రజా సంఘాల నాయకులు,డివైఎఫ్ నాయకు లు సురేంద్రబాబు,తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ కుమార్ గౌడ్, అనిల్ గౌడ్,మాజీ పట్టణ అధ్యక్షుడు ముక్కన్నగారి రామాంజనేయులు, వాల్మీకి సంఘం పట్టణ అధ్యక్షులు ఎల్లప్ప,టిఎన్ఎస్ఎఫ్ సురేష్, కురువ చంద్రశేఖర్ వివిధ ప్రజాసంఘాల నాయకులు ఈ కార్యక్రమాన్ని సంఘీభావం తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో క్షవరవృత్తి దారుల సంఘం ప్రధాన కార్యదర్శి సూరి,అధ్యక్షులు బెలగంటి లక్ష్మీనారాయణ, బ్రహ్మ,అంజి,సాగర్,సురేంద్ర, శివ,లీలా కుమార్,అజయ్, వాసు, బాలకృష్ణ, బాల సాయి మొదలగు వారు పాల్గొనడం జరిగింది.

## నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక టూర్ ప్యాకేజీ

**ఏపీటీడీసీ**

**భక్తుల సౌకర్యార్థం శీఘ్ర దర్శన టిక్కెట్లు, మినీ వాహనాల కోసం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాం నారాయణరెడ్డి కి ఏపీటీడీసీ చైర్మన్ డా. నూకసాని బాలాజీ విజ్ఞప్తి.**



**విజయవాడ ప్రజా జ్యోతి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ విజయవాడలో జరగబోయే శ్రీ కనకదుర్గమ్మ దసరా నవరాత్రుల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా ఏపీటీడీసీ చైర్మన్ డా. నూకసాని బాలాజీ గురువారం సచివాలయంలోని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి ప్రత్యేక టూర్ ప్యాకేజీ గురించి వివరించారు. అనంతరం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తో ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 2 వరకు హైదరాబాదు విజయవాడ ప్రత్యేక ప్యాకేజీ టూర్ ను కార్పొరేషన్ నిర్వహించనుంది. ఇందులో అమ్మవారి శీఘ్ర దర్శనం తో పాటు పర్యాటకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించబడతాయి. ఈ సందర్భంలో, రూ.500 విలువ గల 60 శీఘ్ర దర్శన టిక్కెట్లు మంజూరు చేయాలని, అలాగే 12 సీటర్ల మినీ వాహనాలను గిరిపాదం నుండి ఆలయ ప్రాంగణం వరకు నడిపేందుకు అనుమతి ఇవ్వాలని ఎండోమెంట్స్ శాఖకు విజ్ఞప్తి చేసారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు ఆధ్యాత్మిక అనుభవం కలిగించే యాత్రా సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మంత్రికి విన్నవించారు.

# దివ్యాంగుల కుటుంబాలను కూటమి ప్రభుత్వమే ఆదుకోవాలి

దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర అధ్యక్షులు వంగిమళ్ల రంగారెడ్డి



**రాయచోటి సెప్టెంబర్ 18 ప్రజా జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర అధ్యక్షులు వంగిమళ్ళ రంగారెడ్డి డిమాండ్ చేశారు.గురువారం అయినా రాయచోటి పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ దివ్యాంగుల కుటుంబాలను రోడ్డున పడకుండా కాపాడే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. గతంలో రూ.3 వేలుగా ఇస్తున్న దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.6 వేలకు పెంచడం,రూ.10 వేలుగా ఉన్న పింఛన్ ను రూ.15 వేలకు పెంచి దివ్యాంగుల కుటుంబాలను ఆదుకున్నారన్నారు.అయితే ఇటీవల కొన్ని కారణాలతో కూటమి ప్రభుత్వం బోగస్ సర్టిఫికెట్లు తెచ్చుకొని వికలాంగులమని మోసం చేసి పింఛన్లు తీసుకుంటున్నారని, అలాంటి కుటుంబాలపైన రీ సర్వే చేసి నిజమైన దివ్యాంగులని గుర్తించిన తర్వాత పింఛను మంజూరు చేస్తామని ప్రభుత్వం తెలియజేసిందన్నారు.అయితే దివ్యాంగుల సంక్షేమ సంఘాలు కూడా ప్రభుత్వం చెప్పిన మాటకు కట్టుబడి బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్న దివ్యాంగులను తొలగించి నిజమైన దివ్యాంగులకు పింఛన్లు ఇస్తారని ఆశిస్తున్నామన్నారు. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆసరాగా తీసుకుంటున్న కొంతమంది డాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిజమైన వికలాంగులకు కూడా పర్సెంటేజ్ తగ్గించి మీరు నిజమైన వికలాంగులు కాదని చెప్పడం జరిగిందన్నారు.అయితే దివ్యాంగుల సంక్షేమ సంఘాలతో పాటు కుల సంఘాలతో కలిపి అందరం కూడా అన్ని జిల్లాల్లో డాక్టర్లకు ఒకటే అడుగుతున్నా మన్నారు.అప్పట్లో సదరం సర్టిఫికెట్స్ ఇచ్చే రోజు క్యాంపుకు వెళ్లిన వికలాంగులను ముగ్గురు డాక్టర్లు ఒక్కొక్క వికలాంగునికి మూడు గంటలు టైం తీసుకుని పరీక్షలు నిర్వహించి నీవు నిజమైన వికలాంగుడని ఆ డాక్టర్లు ఆ రోజు సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగిందన్నారు.అయితే ఈ రీ సర్వేలో సర్టిఫికెట్స్ జారీ చేసిన డాక్టర్లను డాక్టర్లను దివ్యాంగుల సంఘంగా మేము ఒకటే ప్రశ్నిస్తున్నాం.అయ్యా మూడు గంటలు టైం తీసుకుని పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్స్ ఇచ్చిన డాక్టర్లు కరెక్ట్ కాదా అన్నారు.రీ సర్వేలో భాగంగా 30 నిమిషాలలో 30 మందికి రీసర్వే చేసి నీవు వికలాంగునివి కాదని ఏ విధంగా చెప్పుతారో మాకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.అయితే కూటమి ప్రభుత్వం ఆ డాక్టర్లది కరెక్ట్ కాదని మళ్లీ నెలలో కూడా యధా విధంగా పింఛన్లు మంజూరు చేసి అందరికీ ఇవ్వడం జరిగిందన్నారు.అదే విధంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు లేకుండా ఉండాలంటే బోగస్ వికలాంగులు ఉంటే ప్రభుత్వము వీరిని గుర్తించాలంటే స్థానికంగా ఉన్న డాక్టర్లు,ఎంపిడిఓలు,గ్రామ సచివాలయాల ఉద్యోగుల ద్వారా రీసర్వే చేసి వికలాంగుల కుటుంబాలకు అన్యాయం జరగకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# జిల్లా అభివృద్ధికి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి..





జిల్లా, డివిజన్, మండల స్థాయి పనులు మాత్రమే కాకుండా కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

పీలేరు అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండల స్థాయి మరియు నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం

**పీలేరు, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** జిల్లాలో అభివృద్ధికి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం పీలేరు అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండల స్థాయి మరియు నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ను పీలేరు గ్రామపంచాయతీ కార్యాలయం లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, సిరికల్చర్, పశుసంవర్ధక,సివిల్ సప్లై, మైనర్ ఇరిగేషన్, రీ సర్వే, ఎడ్యుకేషన్, శ్రీ శక్తి పథకం, అన్నదాత సుఖీభవ, పి 4,హౌసింగ్, పంచాయతీరాజ్, స్వమిత్వ, ఐ విఆర్ఎస్, ఏపీ ఎస్పీడీసీఎల్ తదితర అంశాలపై నియోజకవర్గ,మండల ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్ని లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అధికారులను ఆదేశించారు.ప్రతి పంచాయతీ కార్యదర్శి, లు ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి వనరుల తనిఖీ చేయాలి .ప్రకారం క్లోరినేషన్, శుభ్రపరిచే చర్యలు తప్పనిసరిగా చేయాలి. ప్రతి సారి ఫోటోలు, టైమ్ స్టాంప్‌తో రికార్డులు ఉండాలని ఆదేశించారు.పైప్‌లైన్ ఎక్కడా డ్రైనేజీ లైన్‌తో కలిసిపోకూడదని, అలాంటి చోటు ఎక్కడైనా కనిపిస్తే, సంబంధిత పంచాయతీ కార్యదర్శి, అధికారులు జాయింట్‌గా బాధ్యత వహించాలన్నారు. ట్యాంకుల కవరేజ్ తప్పనిసరి. ట్యాంకులపై సరైన కవర్లు ఉండాలని లేకుంటే పక్షులు, ఎలుకలు, చెత్త వంటి పదార్థాలు నీటిలో పడే ప్రమాదం ఉందన్నారు. ట్యాంకుల శుభ్రపరిచే పనులు రెగ్యులర్‌గా చేయాలి. ఈ వారం చివరికల్లా అన్ని లు, గ్రామ పంచాయతీలు, అధికారులు కలసి నివేదిక ఇవ్వాలని, పైప్‌లైన్‌లు ఎక్కడా డ్రైనేజీ పక్కన లేకుండా ట్యాంకులుకు మూత ఉన్నాయని, క్లోరినేషన్ సక్రమంగా జరుగుతోంది అని నిర్ధారించుకొని నివేదికలను అందజేయాలని తెలిపారు. జిల్లాలో తాగునీటి సమస్య పెద్దగా లేదని చెప్పారు. అయితే, పంపిణీ, నిర్వహణ, పరిశుభ్రత అంశాల్లో కఠిన చర్యలు అవసరమని అన్నారు. అలాగే సింగిల్ విలేజ్ స్కీమ్స్, బోరువెల్స్ వద్ద రీచార్జ్ స్ట్రక్చర్స్‌ను ఈ రోజే తనిఖీ చేసి ఎక్కడైనా లేకుంటే వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదానికి పంపాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండల అభివృద్ధి అధికారులు, గ్రామ పంచాయతీలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కలకడ మండలంలోని వాటర్ సప్లై పాయింట్లను పరిశీలించి నీటి కొరత సమస్యలు ఎదుర్కొనే గ్రామాలకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా రైతు బావుల సమీపంలో అదనపు రీచార్జ్ స్ట్రక్చర్స్ ఏర్పాటు చేసి, ఈ ప్రణాళికలపై రైతులతో చర్చించి వారి సూచనల ఆధారంగా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.జిల్లా అధికారులు , డివిజన్, మండల స్థాయి పనులు మాత్రమే కాకుండా కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలని వచ్చే ఆరు నెలల్లో, వచ్చే ఒక సంవత్సరంలో మీరు చేయాలనుకున్న కొత్త ప్రతిపాదనలు, ప్రణాళికలను పూర్తిగా సిద్ధం చేసుకోవాలని, తదుపరి సమావేశంలో వాటిపై సమీక్ష ఉంటుందన్నారు. అంతేకాక, నేషనల్ హైవే, రైల్వే ప్రాజెక్టులు, వివిధ ప్రాజెక్టులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిపై చర్యల నివేదికలు సమర్పించాలని కలెక్టర్ గారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొట్టమొదటి సారీ పీలేరు నియోజకవర్గానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ కు ఆర్డిఓ, డి ఆర్ డి ఏ పి డి పుష్పగుచ్ఛం ఇచ్చి, దుశ్శాలవతో సత్కరించారు.ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్, డిఆర్డిఏ పిడి నాగేశ్వరరావు, డిపిఓ రాధమ్మ,జి ఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, వాల్మీకిపురం, కలికిరి,కలకడ, గుర్రంకొండ, కె.వి పల్లి తాసిల్దార్లు, ఎంపీడీవోలు, అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అధికారులు, ఎంఈఓ లు, మండల సర్వేలు, ఇతర మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కూటమి పాలన

- జర్నలిస్టులపై దాడులు అమానుషం
- పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న కూటమి ప్రభుత్వం
- ప్రజల తరపున ప్రశ్నించే హక్కు మీడియాకు ఉంది
- నిజాలను నిర్భయంగా ప్రచురించే మీడియాను అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం
- పత్రికలపై ,జర్నలిస్టులపై దాడులు చేయడం ,అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలి
- రాష్ట్రంలో పేద విద్యార్థులకు దూరమవుతున్న వైద్య విద్య
- వైద్య కళాశాలలను ప్రవేటీకరణ చేస్తున్న కూటమి
- వైపాకా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు



**శ్రీకాకుళం ,ప్రజాజ్యోతి న్యూస్ :** ప్రజలకు ,ప్రభుత్వానికి మధ్య వారధిలా నిలిచే పత్రికా స్వేచ్ఛను హరిస్తు కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పాలన సాగిస్తోందని వైకాపా జిలా అధికార ప్రతినిధి కోట గోవింద రావు అన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తూ నిజాలను నిర్భయంగా ప్రచురించే సాక్షి పత్రికపైన ,యాజమాన్యం పైన , జర్నలిస్టులను వేధింపులకు గురి చేయడం పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛను హరించే హక్కు కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగానికి నిదర్శంగా చంద్రబాబు పాలన సాగుతుందన్నారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకముగా కూటమి చేసే అరాచకాలు ప్రశ్నించే గొంతును అణచివేయడం మానుకోవాలని హితవు పలికారు. వాక్ స్వాతంత్ర్యాన్ని ,భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా దాడులు చేయడం ,అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. ప్రశ్నించే గొంతును అణచివేసే ప్రభుత్వాలు ఎంతకాలం మనుగడ సాగించలేవన్నారు. చంద్రబాబుపాలనలో పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారిందన్నారు. ప్రతీ ఒక్కపేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలనే సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి ,వైసిపి పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తే వాటిని ప్రవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సుదీర్ఘ అనుభవం ఉందని ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబు నాయుడు ఒక్క మెడికల్ కళాశాలను అయినా ప్రభుత్వపరంగా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీలను ప్రవేట్ వ్యక్తుల చేతుల్లో పెడితే ఊరుకునేది లేదన్నారు.

# పార్టీ కార్యకర్తలకు అండగా తెలుగుదేశం ప్రభుత్వం.

డా.మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి



**రాయచోటి సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలిపారు.గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి నందు గౌ. రాష్ట్ర రవాణా,యువజన,క్రీడల శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో అన్నమయ్య జిల్లా సంబేపల్లికి చెందిన పార్టీ కార్యకర్త నాగరాజు జల్లా అకాల మరణంతో వారి కుటుంబ సభ్యులకు పార్టీ తరపున ప్రమాద బీమా మొత్తం ను అందజేశారు.అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం, పిఎన్ కాలనీ తెలుగుదేశం పార్టీ కార్యకర్త నాగరాజ జల్లా పార్టీ కి ఎనలేని సేవ చేసి అకాల మరణం పొందడం పార్టీకి తీరని లోటని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి కుటుంబానికి పార్టీ తరపున ప్రమాద బీమా ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సాయం ను నాగరాజు జల్లా భార్య కృష్ణమ్మ జల్లాకు మరియు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు జల్లా వారి కుటుంబ సభ్యులు గౌ.రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, గౌ.రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గారికి, గౌ.రాష్ట్ర రవాణా,యువజన,క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

# స్వచ్ఛత హీ సేవలో భాగంగా బాపట్లలో శుభ్రతా కార్యక్రమాలు ప్రారంభం




**బాపట్ల సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మహాత్మా గాంధీ జయంతి (అక్టోబర్ 2)ని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథ రెడ్డి పర్యవేక్షణలో 19వ వార్డు రైతు బజార్, మార్కెట్ ఆవరణ, ప్రధాన వీధులను శుభ్రపరిచారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు సయ్యద్ నజీర్, కరుణా, పురపాలక, మెప్మా సిబ్బంది సుబ్రహ్మణ్యం,విజయలక్ష్మి , ఆర్‌పీలు, సచివాలయ పారిశుధ్య మరియు పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పది సంవత్సరాలు గా సర్పంచ్ గా అధికారమిచ్చిన గ్రామాభివృద్ధి లేదు ఆవేదన వ్యక్తం చేసిన సల్కాపురం గ్రామస్తులు




**(ప్రజాజ్యోతి న్యూస్) కర్నూలు సెప్టెంబర్ 18** పాణ్యం నియోజకవర్గంలోని సల్కాపురం గ్రామం నందు పది సంవత్సరాలు సర్పంచ్ గా అధికారం ఇచ్చిన కూడా గ్రామ సమస్యలు ఎలాంటివి పరిష్కారం చేయలేదని 9 కోట్ల పనులు ఎక్కడ చేశాడో తెలియని పరిస్థితి గ్రామంలో నాణ్యతలేని సిసి రోడ్లు డ్రైనేజీ కాలువలు మరియు వ్యవసాయ రహదారులకు దారి లేని పరిస్థితి ఏర్పడింది మరియు పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని తమకు సంబంధించిన వాళ్లకు మాత్రమే తప్ప ఇతరులకు ఎవరికీ ఇల్ల పట్టాలు అందలేదని అన్నారు. ఈసారి జరగబోయే ఎలక్షన్లలో కూటమి అభ్యర్థులకి ఎవరికీ కేటాయించిన గెలిపించుకొని ఆరు నెలలలోనే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని సవాల్ విసిరారు ఇప్పటివరకు గ్రామంలో జరిగిన ప్రతి పని తెలుగు దేశం పార్టీ హాయంలోనే జరిగిందని ఐ.టి.డి.పి.మేంబర్ మహేందర్ అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీపై అధికారుల నిర్లక్ష్యం బాధాకరం ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు



**బాపట్ల సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ రైస్ కార్డుల పంపిణీ నిర్ణయం ఎంతో హర్షణీయమని ఎంపీటీసీ సభ్యులు, మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు అభిప్రాయపడ్డారు. అయితే కొంతమంది అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వానికి పేరు ప్రతిష్టలు తెచ్చే విధంగా అమలు చేయకపోవడం విచారకరమని ఆయన తెలిపారు.ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థలకు సమాచారం ఇవ్వకుండా గుట్టుచప్పుడు కాకుండా కార్డులు పంపిణీ చేయడం సరైంది కాదని విమర్శించారు. ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యతగా గ్రామ సభల ద్వారా గానీ, వార్డుల వారీగా సమావేశాల ద్వారా గానీ ప్రభుత్వం ఉద్దేశించిన ప్రయోజనాలను వివరించాల్సిన అవసరం ఉందని సూచించారు.కర్లపాలెం మండలంలో అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన తాండ్ర సాంబశివరావు, ప్రజా ప్రతినిధులను పక్కన బెట్టి ప్రత్యేక అధికార పాలనలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు.ప్రభుత్వ కార్యక్రమాలు పది మందికి చేరేలా ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా అధికారులు ముందడుగు వేయాలని, ఈ విషయంపై బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మరాజు జోక్యం చేసుకోవాలని తాండ్ర విజ్ఞప్తి చేశారు.

# మిడిల్ ఈస్ట్ వరల్డ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన శ్రీ తులసి సహస్ర

**51 నిమిషాల్లో 700 భగవద్గీత శ్లోకాలు తో వరల్డ్ రికార్డ్**
**మిడిల్ ఈస్ట్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన ఏలూరు బాలిక**





**ఏలూరు సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి న్యూస్** అనితర సాధ్యమైన700 భగవద్గీత శ్లోకాలను కేవలం 51 నిమిషాలలో చెప్పి మిడిల్ ఈస్ట్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ అవార్డును ఏలూరు కు చెందిన మాచవరం శ్రీ తులసి సహస్ర సాధించారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాదులో జరిగిన మిడిల్ ఈస్ట్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే వారి వేడుకలలో ఏలూరు కి చెందిన మాచవరం శ్రీ తులసి సహస్రకు అవార్డును ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారు. 12 సంవత్సరాల వయసులో సర్ సి .ఆర్ .రెడ్డి .పబ్లిక్ స్కూల్, ఏలూరు నందు8వ తరగతి చదువుతూ అనేక సభలలో భగవద్గీత శ్లోకాలు పఠిస్తూ ఎన్నో అభినందనలు, ఆశీర్వాదాలను అందుకొని ప్రపంచ రికార్డ్ స్థాయి అవార్డును అందుకోవటం పట్ల తులసి సహస్ర తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తులసి సహస్ర మాట్లాడుతూ ఇంత ఘనత సాధించడానికి తన గురువులు, తన తల్లిదండ్రులు మాచవరం సతీష్ కుమార్ శ్రీలక్ష్మి ల ప్రోత్సాహం కారణమని అన్నారు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక శ్లోకాలు పద్యాలు, ఇష్టమని చిన్నతనంలోనే బాల వికాస్ ఆన్లైన్ క్లాసుల లో నారదోపనిషత్ ,గణపతి అథర్వో పనిషత్ నేర్చు కున్నట్లు తెలిపారు. ఏడవ తరగతి నుంచి భగవద్గీత నేర్చుకున్నానని తొలుత కొంత ఇబ్బంది అనిపించిన ఆ తర్వాత నుంచి ఉపాధ్యాయుల తల్లిదండ్రుల ప్రోత్సాహంతో భగవద్గీత నేర్చుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తన మామయ్య 53 నిమిషాల్లో భగవద్గీత శ్లోకాలు చదివిన ప్రపంచ రికార్డు ఉందని దానిని అధిగమించేలా కృషి చేయాలని సూచించడంతో ఆ లక్ష్యంతో ప్రయత్నాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. తాను చదువుకునే పాఠశాలలో ఉపాధ్యాయిని వేదాంతం విష్ణు ప్రియ టీచర్ ప్రోత్సాహంతో భగవద్గీతను పూర్తిగా నేర్చుకున్నట్లు తెలిపారు. తమ ఉపాధ్యాయిని విష్ణు ప్రియ హిందీ సంస్కృతం క్లాసులు చెబుతారని భగవద్గీత ప్రవచనాలు పలు ఆలయాలలోనూ చానల్స్ లోనుచెబుతారని వారు అందించిన ప్రోత్సాహంతోనే భగవద్గీతలోని శ్లోకాలను కంఠతా చేసినట్లు వివరించారు.పాఠశాలలో 700 శ్లోకాలు నేర్చుకునే వారికి ఉపాధ్యాయుని వేదాంతం విష్ణు ప్రియ శ్లోకాలను నేర్పుతారని తన కోసం ప్రత్యేకంగా కొంత సమయాన్ని కూడా కేటాయించి శ్లోకాలను నేర్చుకునేలా ప్రోత్సహించారని, నీవు మొత్తం శ్లోకాలు చెప్పగలవు అని ధైర్యం చెప్పి ప్రోత్సహించారని తమ ఉపాధ్యాయిని వేదాంతం విష్ణు ప్రియకు ధన్యవాదాలు తెలిపారు. రోజును ఐదు నుంచి 10 శ్లోకాలను నేర్చుకునే దాని నని పరీక్షల కారణంగా మొత్తం ఆరు నెలల సమయం తనకు పట్టినట్టు తెలిపారు. పరీక్షలకు సమయంలో ఎక్కువ టైం పాఠాలకు కేటాయించామని లేకపోతే మూడు నెలల్లోనే తాను పూర్తి చేయగలనని ధీమా తులసి సహస్ర వ్యక్తం చేశారు. తాను శ్లోకాలు నేర్చుకున్న తర్వాత శృంగేరి పీఠం ,దత్త పీఠం కంచి కామకోటి పీఠం లలో తన ప్రదర్శనను ఇచ్చినట్లు ఆ పీఠాల నుంచి అభినందనలు పొందినట్లు తెలిపారు. ఎన్నో జిల్లా రాష్ట్రస్థాయి పోటీలలో సైతం పాల్గొన్నట్లు తెలిపారు.పరీక్షల సమయంలో తన తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించి సహకరించే వారిని తెలిపారు. భగవద్గీత ద్వారా ఏ పనినైనా ఇష్టంతో చేయాలని, ఫలితాన్ని ఆశించ కూడదని, కష్టమైన పని అని చేయలేమని సంశయం అసలు ఉండకూడదని ఎలా జీవించాలో జీవన విధానాన్ని తెలుపుతుందని తాను నేర్చుకున్నట్లు తెలిపారు. తనకు ఐఏఎస్ కావాలన్నది లక్ష్యమని తెలిపిన తులసి సహస్ర తనకు డ్రాయింగ్ క్రాఫ్ట్ డెకరేషన్ ఐటమ్స్ ఇష్టమని వివరించారు. అతి చిన్న వయసులోనే పిట్ట కొంచెం కూత ఘనం అన్న చందాన, ప్రపంచ స్థాయి రికార్డు సాధించిన తులసి సహస్ర మరెన్నో అవార్డులను రివార్డులను సాధించి తను అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆశిద్దాం.

# మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ చేస్తున్న కృషి అభినందనీయం

**జి.కొండూరు:(సెప్టెంబర్ 18,ప్రజా జ్యోతి రిపోర్టర్ బి.నాగేశ్వరరావు):** జి.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు, కార్యదర్శి లంక నాగేశ్వరరావు(నానీ) గురువారం ప్రజా జ్యోతి విలేఖరితో పత్రిక ముఖంగా మాట్లాడుతూ,మైలవరం నియోజవర్గ అభివృద్ధికి శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ చేస్తున్న నిరంతర కృషి అభినందనీయమన్నారు.... ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో అనేక చోట్ల గుంటల మయంగా మారిన రహదారులను... తారు రోడ్లు వేయించడమే కాకుండా,ప్రజలు,వాహనదారులు ఇబ్బందులు పడకుండా రహదారులు నిర్మిస్తున్నారన్నారు.అలాగే నియోజవర్గ పరిధిలోని అన్ని గ్రామాల రైతాంగానికి యూరియా,ఎరువులు కొరత లేకుండా సకాలంలో రైతులకు సహకార పరపతి సంఘాల ద్వారా యూరియా,ఎరువులను అందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తుండం విశేషం అన్నారు. నియోజవర్గంలో అనివర్గాల ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడంలో శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ కృత నిశ్చయంతో పనిచేస్తున్నారన్నారు. వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ప్రజలకు సేవ చేయడానికి వచ్చారని సంపాదించుకోవడానికి కాదని, వసంత కృష్ణ ప్రసాద్ నీతి...నిజాయితీ గురించి మైలవరం నియోజవర్గ ప్రజలకు తెలుసని నియోజవర్గంలో అన్ని వర్గాల ప్రజల గుండెల్లో అందరివాడిగా ఎదిగారన్నారు. రెండోసారి కూడా అత్యధిక మెజార్టీతో వసంత గెలుపొందడం గర్వకారణమన్నారు .త్వరలో రానున్న పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో మండలంలో అత్యధిక గ్రామా పంచాయతీలను, అలాగే ఎంపీటీసీలను, జడ్పిటిసిని మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో... కార్యకర్తలను కలుపుకొని పోయి, అత్యధిక సీట్లను తెలుగుదేశం పార్టీ విజయం సాధించేందుకు మండల పార్టీ అధ్యక్ష,కార్యదర్శులుగా... మా వంతు మేం కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా నే.... అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి లంక నాగేశ్వరరావు (నానీ) మాట్లాడుతూ, జోగి రమేష్ బూడిద రాజకీయాలు చేయడం తగదన్నారు.గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హాయంలో బూడిద ను, ఇసుకను దోచుకుంది ఎవరో? నియోజవర్గ ప్రజలకు తెలుసన్నారు. ఆనాడు బూడిద,ఇసుక గురించి జోగి రమేష్ ఎందుకు మాట్లాడలేదన్నారు .ఆనాడు...ఈనాడు శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ నీతి....నిజాయితీతో పనిచేశారన్నారు. మైలవరం నియోజకవర్గ ప్రజలు నీతి...నిజాయితీ కలిగిన నాయకులను, ఓటర్లు ఎప్పుడు మరిచిపోలేరన్నారు.



టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు. | మైలవరం నియోజవర్గ ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ | టిడిపి మండల పార్టీ కార్యదర్శి లంక నాగేశ్వరరావు (నానీ)

# కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదు

**-యుటిఎఫ్ రణభేరిలో రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు హెచ్చరిక.**




**బద్వేల్ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి న్యూస్)** కూటమి ప్రభుత్వ తీరు మారకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికాక తప్పదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రణభేరి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ చేపట్టిన ప్రచార జాత గురువారం సాయంత్రం కడపకు చేరుకుంది. జాతకు యుటిఎఫ్ నాయకులు సాదర స్వాగతం పలుకుతూ కడప ఆర్టీసీ బస్టాండ్ నుండి మహావీర్ సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్ మీదుగా బాలాజీ నగర్ వద్ద గల యుటిఎఫ్ భవన్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ భవన్ వద్ద జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ నేతలు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. గత పాలకుల విధానాలనే ఈ ప్రభుత్వం సైతం కొనసాగిస్తున్నదని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికల తర్వాత మరొకలా పాలకులు వ్యవహరిస్తున్నారని వారు దుయ్యబట్టారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటామని, ఉద్యోగుల అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను ఆరు నెలలలోగా చెల్లిస్తామని పేర్కొన్నారన్నారు. కూటమి పెద్దల హామీలు నిజమని నమ్మి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరిస్తే, ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను పూర్తిగా విస్మరించిందన్నారు. పిఆర్సీ గడువు ముగిసి రెండేళ్లయినా ఆ ఊసే లేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన 12వ పిఆర్సీ చైర్మన్ డాక్టర్.మన్మోహన్ సింగ్ రాజీనామా చేసి ఏడాదైనా నూతన చైర్మన్ ను నియమించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వాలు డిఏ లు చెల్లించకపోతే ఉద్యోగులు ఎలా జీవిస్తారని ప్రతిపక్ష హోదాలో అప్పటి ప్రభుత్వాన్ని నిలదీసిన ఇప్పటి పాలకులు నాలుగు డీఏలను చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారన్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డీఏలను పెంచకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎలా జీవనాన్ని సాగించాలో కూటమి పెద్దలే సమాధానం చెప్పాలని నిలదీశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలన్నింటినీ ఆరు మాసాలలోగా చెల్లిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన కూటమి ప్రభుత్వం కేవలం 7500 కోట్ల రూపాయలను మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన 30 వేల కోట్ల రూపాయల బకాయిలపై స్పష్టత లేదన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్, మెడికల్ రీయంబర్స్మెంట్లు సైతం చెల్లింపులకు నోచుకోవడం లేదన్నారు. కరోనా మహమ్మారితో మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియమాకాలను సైతం చేపట్టడం లేదంటే ఉద్యోగుల కుటుంబాల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న మానవీయత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చున్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న కూటమి పెద్దలు, ఇచ్చిన హామీని పూర్తిగా మర్చిపోయినట్లున్నారని ఎద్దేవా చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, జయచంద్రా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా పాలన సాగిస్తామని ప్రగల్బాలు పలికిన పాలకులు, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రపంచ బ్యాంక్, సాల్ట్ తో చేసుకున్న ఒప్పందం మేరకు ప్రణాళికబద్ధంగా ప్రభుత్వ విద్యకు పాడెకట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే ఉపాధ్యాయులను నిరంతరం బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు ప్రభుత్వ విద్యా రంగం పట్ల ప్రేమ కనపరుస్తున్నట్లు కనబడుతూనే మరో ప్రక్క ప్రభుత్వ విద్యను పాతాళానికి తొక్కేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా ప్రభుత్వ విద్యారంగం పట్ల వారి తీరు మారడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం తీవ్రతరం కాక తప్పదని అందుకు ప్రభుత్వమే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఈసందర్భంగా హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 25వ తేదీ చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టి భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జాబీర్, జెవివి జిల్లా అధ్యక్షులు, సమీర్ భాష, యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, సహాధ్యక్షులు వై.రవికుమార్ డి.సుజాత రాణి, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహమ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్టారెడ్డి, సిపిఎస్ జిల్లా కన్వీనర్ సి.సుదర్శన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ఆదివాసీల కొరకు చర్చ జరగాలి



**కుక్కునూరు,ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 18 :**గురువారం నాడు ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యకర్తల సమావేశం కుక్కునూరు మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు కూరం సంజీవరావు మాట్లాడుతూ ,ప్రస్తుత ఆదివాసి ఎమ్మెల్యేలు మాత్రం రాజ్యాంగ రిజర్వేషన్ తోటి ఎమ్మెల్యేగా గెలుపొంది దర్జాగా వారి సకల సౌభాగ్యాలు చూసుకుంటున్నారని,కానీ ఆదివాసి నిరుద్యోగులు ఆదివాసి ప్రజానీకం ఏమైపోతున్న వాళ్లకి పట్టటం లేదని కేవలం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న సాధారణ సంక్షేమ పథకాలను ఏజెన్సీలో ఇన్ని రోజులు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటూ వచ్చారని ఇకపై మీ ఆటలు సాగవని ఆయన హెచ్చరించారు.సంక్షేమ పథకంతో ఆదివాసీల అభివృద్ధి సాధ్యం కాదని విద్యా ఉద్యోగ ఉపాధి వంటి రంగాలలో ఆదివాసులు రాణిస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు.అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వేళ ఆదివాసి ఎమ్మెల్యేలకు కనువిప్పు కలగాలంటే ఆదివాసి నిరుద్యోగులు ప్రజానీకం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు మొదలు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రజా పోరాటంతోనే ఏదైనా సాధించగలమని, నిరుద్యోగులు ఆదివాసి ప్రజలు బయటకు వచ్చి ఉద్యమించకపోతే ఉన్న చట్టాలు కూడా పోతాయని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ ప్రధాన కార్యదర్శ పోడియం వేణుగోపాల్ పైదా పరమేశ్వరావు జేడి రఘు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నారులపై నేరాలు చేస్తే కఠిన చర్యలు :
**జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్**



**బాపట్ల సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ లతో పాటు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, క్రైమ్ రికార్డులు, కేసుల పురోగతిని పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.మహిళలు, చిన్నారులపై అమర్యాదగా ప్రవర్తించినా, నేరాలకు పాల్పడ్డా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా సంబంధిత కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, సహాయ కేంద్రాల్లో మహిళా పోలీస్ తప్పనిసరిగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మత్తులో వాహనాలు నడపడం, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాల కట్టడి కోసం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సీసీ కెమెరాల ద్వారా నిఘా పెంచి నేరాలను అరికట్టాలని, ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుండి విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే, సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్ లకు వచ్చే యాత్రికుల భద్రత కోసం పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పీ జి. రామాంజనేయులు, ఎస్‌బి సిఐ జి.నారాయణ, సిఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాపట్ల మండలం మూలపాలెంలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్



**బాపట్ల సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల మండలం మూలపాలెం గ్రామంలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లోకసభ ప్యానెల్ స్పీకర్ మరియు బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ చేతుల మీదగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజా పంపిణీ వ్యవస్థలో పూర్తి పారదర్శకత కోసం కూటమి ప్రభుత్వం ఈ స్మార్ట్ రైస్ కార్డులను ప్రవేశపెట్టిందని ఎంపీ తెలిపారు. ఇప్పటివరకు బియ్యం, పప్పులు, పిండి, నూనె వంటి సరుకుల పంపిణీలో చోటుచేసుకున్న అవినీతి, మధ్యవర్తుల దోపిడీ ఇకపై చోటుచేసుకోదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్డుల ద్వారా లబ్ధిదారులకు నేరుగా సరుకులు చేరేలా చర్యలు చేపట్టామని వివరించారు.ప్రజలకు సకాలంలో, నాణ్యమైన సరుకులు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీ పునరుద్ఘాటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. స్మార్ట్ రైస్ కార్డులు ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా రూపొందించబడిన ఆధునిక పద్ధతి అని వివరించారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ సర్పంచ్, మున్సిపల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత స్థాయిలో యూరియా సమస్యపై రైతుల అపోహలు నివృత్తి

**. జిల్లాలో యూరియా కొరత లేదు కలెక్టర్ కీర్తి చేకూరి**
**.దొమ్మేరు ప్యాక్స్ వద్ద రైతుల తో నేరుగా సంభాషణ**



**కొవ్వూరు/తాళ్లపూడి ,సెప్టెం బర్18, ప్రజాజ్యోతి న్యూస్** జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గురు వారం సాయంత్రం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి వెళ్లి రైతులతో నేరుగా మాట్లా డారు. ఇటీవల యూరియా సరఫరా, అందుబాటు పై పలు అపోహలు వ్యాపించడంతో వాటిని తొలగించేందుకు కలెక్ట ర్ స్వయంగా దొమ్మేరు ప్యాక్స్ వద్దకు చేరుకున్నారు.కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో రైతులకు అవసరమై నంత యూరియా సరిపడా నిల్వలో ఉందన్నారు. ఎక్కడా యూరియా కొరత లేదనీ , రైతులు ఆందోళన చెందవల సిన అవసరం లేదన్నారు. సమ యానికి యూరియా అందుబా టులోకి వచ్చేలా అన్ని చర్యలు తీసు కుంటున్నాం" అని స్పష్టం చేశారు. పర్యటన నేపథ్యంలో రైతులను ప్రశ్నిస్తూ, వివిధ పం టలలో యూరియా వాడకం, దిగుబడులపై వారికి ఉన్న అ నుభవాలను తెలుసుకున్నా రు. ఇక్కడ సాగు చేసే పం టలు మార్కెటింగ్, తదితర అంశాలను కూడా రైతుల నుం చి తెలుసుకోవడం జరిగిం ది. అధిక మోతాదులో యూరియా వాడటం వలన నేల ఆరోగ్యం దెబ్బతినడం, పంటలకు నష్టం కలగడం, దిగుబడి తగ్గడం వంటి అనర్థాలను వివరించా రు. రైతులు శాస్త్రీయ పద్ధతు ల్లో, సిఫార్సు చేసిన మోతాదు లోనే యూరియాను వినియో గించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కొవ్వూరు రెవె న్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత, సొసైటీ అధ్యక్షులు గారపాటి రామకృష్ణ, వ్యవసా య సహాయ సంచాలకులు సి.హెచ్. శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ఏ. గంగా ధర్, తహసీల్దార్ ఎం. దుర్గాప్ర సాద్, రైతులు, గ్రామ వ్యవసా య సిబ్బంది, ఆర్ఎస్ కే, సొసై టీ ప్రతినిధులు పాల్గొన్నారు

# విజయవాడ ఉత్సవ్' లో భాగంగా గొల్లపూడిలో ఎగ్జిబిషన్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వసంత





**జి.కొండూరు:(సెప్టెంబర్ 18,ప్రజా జ్యోతి రిపోర్టర్ బి.నాగేశ్వరరావు):**ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజవర్గం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ గురువారం విజయవాడ ఉత్సవ్-2025' ను కన్నుల పండువగా నిర్వహించడానికి గొల్లపూడిలో భారీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనుండగా...దీనికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ....పన్నెండేళ్లుగా విజయవాడలో ఎగ్జిబిషన్ నిర్వహించటం లేదని ,దసరా ఉత్సవాల సందర్భంగా మైలవరం నియోజకవర్గం గొల్లపూడిలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే వసంత ఆదేశించారు.అలాగే మైసూరులో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల తరహాలో రూపొందించిన ఒక ఘనమైన సాంస్కృతిక మహోత్సవమే 'విజయవాడ ఉత్సవ్' అన్నారు. విజయవాడ నగరాన్ని కళా, సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ ఉత్సవాన్ని 11 రోజులపాటు నిర్వహించనున్నట్లు వసంత వెల్లడించారు.కళలు,విద్యలు పునరుద్ధరించడంతో పాటు ప్రజలకు వినోదాన్ని అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు.గొల్లపూడి ఎగ్జిబిషన్ ఎక్స్-పోలో ఎడ్యుకేషన్ పెవిలియన్ ఏర్పాటుతో దేశ, విదేశాల్లో విద్యా సదుపాయాలు, వివిధ కోర్సులు, శిక్షణకు సంభందించిన సమాచారం లభిస్తుందనీ,ఎడ్యుకేషన్ పెవిలియన్ లో వివిధ యూనివర్సిటీలు, విద్యాసంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేస్తాయన్నారు.దీన్ని స్థానిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# గేదెల వ్యాధిపై ఆందోళన అవసరం లేదు




. పెద్దేవం ఐ.పంగిడి గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

రైతులకు కలెక్టర్ కీర్తి చేకూరి భరోసా

**తాళ్లపూడి,సెప్టెంబర్18, ప్రజాజ్యోతి న్యూస్** కొవ్వూరు నియోజకవర్గం తాళ్ల పూడి మండలం పెద్దేవం గ్రా మంలో గేదెలు మరణాలపై ప్ర త్యేక నిపుణుల పర్యవేక్షణ లో పశువుల చికిత్స కొనసాగింపు జరుగుతోందని ఇందు కోసం ప్ర త్యేక వైద్యుల బృందాన్ని రా ష్ట్ర ప్రభుత్వం పంపడం జరిగిం దని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం కొవ్వూ రు నియోజకవర్గం పరిధిలోనీ పెద్దేవం, ఐ. పంగిడీ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి రైతులతో ముఖాముఖి గా సంభాషించి, వారికి భరోసా ఇవ్వడం జరిగిం ది. ఈ సందర్భంగా జిల్లా కలెక్ట ర్ మాట్లాడుతూ, గేదెల వ్యాధి నివారణ కు అన్ని చర్యలు తీ సుకుంటున్నామని, రైతులు ఎ టువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పశువుల పేడ పరీక్షల్లో బి కోలి మరియు పొట్ట జలగ వ్యాధి నిర్ధారణ అయ్యిందన్నారు. గేదెలకు చికిత్స చేయడం కొనసాగు తోందనీ, ఇప్పటికే కొంతమేరకు సానుకూల ఫలితాలు కనిపిస్తు న్నాయని , వ్యాధి లక్షణాలు త గ్గడం గుర్తించినట్లు వైద్యులు తెలియ చేయడం జరిగిందని కలెక్టర్ రైతులకి వివరించారు. ఈ సందర్భంగా గేదెలలో కని పించిన వ్యాధి లక్షణాలకు సం బంధించిన చికిత్స జరుగు తుందని, మరిన్ని ల్యాబ్ పరీ క్షల కోసం నమూనాలు సేక రించబడినట్లు, రెండు మూడు రోజులలో వాటి వివరాలు వస్తా యని కలెక్టర్ పేర్కొన్నారు. విజ యవాడ పశువైద్య జీవవిజ్ఞాన పరిశోధన సంస్థ (వి బి ఆర్ ఐ) ప్రత్యేక నిపుణుల బృందం ప ర్యవేక్షణలో పశువులపై చికిత్స వ్యాధి తీవ్రత తదితర అంశా లపై కలెక్టర్ క్షేత్ర స్థాయిలో స మీక్షించడం జరిగింది. బుధ వారం పెద్దేవం గ్రామంలో మృతి చెందిన గేదె కు విజయవాడ నుండి వచ్చిన జాయింట్ డైరె క్టర్ డా.చంద్రమౌళి ఆధ్వర్యం లో శవ పరీక్షలు చేపట్టడం జరి గిందని , వాటికి సంబంధించిన నమూనాలు తదుపరి పరీ క్షలు నిమిత్తం విజయవాడ పంపు తున్నట్లు తెలిపారు.పర్యటన నేపథ్యంలో తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన రైతు జె. సత్యనారాయణ, కొవ్వూరు మండలం ఐ.పంగిడీకి చెందిన రైతు జె. కృష్ణార్జున లతో కలెక్టర్ ముఖా ముఖి జరిపారు. గత పది రోజులకు ఇప్పటికీ వ్యాధి లక్షణాలు తగ్గుతున్నట్టు రైతులు వివరించారు. వ్యాధి నిర్ధారణ కోసం సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌లో పూర్తిగా పరీక్షించడం జరుగుతుంద న్నారు. ఎటువంటి కొత్త కేసు లు నమోదు కాలేదని అధి కారులు కలెక్టర్ కు వివరించా రు. ఈ పర్యటనలో ఆర్డీవో రాణి సుస్మిత, విజయవాడ వి.బి.ఆర్.ఐ. కేంద్రం జాయింట్ డైరెక్టర్ డా. చంద్రమౌళి, సహా య సంచాల కులు డా. శిరీష, జిల్లా పశుసం వర్ధక అధికారి డా. టి. శ్రీనివా స్, డీడీ సత్యనారాయణ, ఏ. డి. వెంకటరెడ్డి, తాసిల్దార్ లక్ష్మీ లావణ్య , తది తరులు పాల్గొన్నారు.

# ఆర్.సి.యం ఎయిడెడ్ ఉపాధ్యాయ పోస్టుల అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని

**బద్వేల్ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి న్యూస్)** విద్యా సంవత్సరం 2024 - 2025లో ఆర్ సి యం. ఎయిడెడ్ మేనేజ్మెంట్ వారు 24 మంది ఉపాధ్యాయ నియమకాలను నిర్వహించే క్రమంలో ప్రభుత్వ ఉత్తర్వులు జీవోలను విద్యాశాఖ ప్రొసీడింగ్స్ ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఆదేశాలను పూర్తిగా ఉల్లంఘించారని వాటిపైన సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారిన అరెస్ట్ చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. గురువారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్కే ఆదిల్ లతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ..... హైకోర్టు అనుమతించిన 24 నియామకాలు మాత్రమే జరగవలసిన సందర్భంలో మేనేజ్మెంట్ వారు డయాసిస్ అధికారులు ఫాదర్ జాన్సన్ చె ట్టి ర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పాస్టర్ తలారి బాలరాజు (వికార్ జనరల్ ) పాస్టర్ సంబుటూరు సురేష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సంబటూరు రవీంద్రబాబు సహకారంతో సుమారు 6 కోట్ల రూపాయలు నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుల నుండి వసూలు చేసి అవినీతిలో నిమగ్నమయ్యారు ఇందులో అప్పటి ప్రస్తుత విద్యాశాఖ అధికారులైన అనురాధ మీనాక్షి శ్యామల్ పాత్ర కూడా ఉందని ఇది తెలిసిన విద్యాశాఖ అధికారులు మౌనం వహించడమేనక ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు నకిలీ పోస్టు ఐడీలు సృష్టించి సంబంధిత ఎంఈఓ లు మరియు హెచ్ఎం లతో కలిసి ట్రెజరీలకు తప్పుడు బిల్లులు సమర్పించి జీతభత్యాలు పొందారు జిల్లా విద్యాశాఖ అధికారులు ఆర్జెడి కార్యాలయ సిబ్బంది మరియు ప్రభుత్వ అధికారులు ఈ అక్రమాలకు పాలుపంచుకొని సహచార నిందితులుగా వ్యవహరించారు అందుకు నిదర్శమే పీవీ వసంతకుమారి స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ సెయింట్ జోసెఫ్ గర్ల్స్ హై స్కూల్ నందు నూతనంగా అవకాశం ఇచ్చిన ఈమె గతంలో బిసి బి నుండి బిసిసిగా కన్వర్ట్ చేసి ఉన్నారు అలాగే అనకర్ల ఓబులమ్మ ఇండియన్ హిందూ మాదిగ నుండి కన్వర్ట్ క్రిస్టియన్ గా మార్చి అదే పాఠశాలలో బయాలజీ టీచర్ పోస్ట్ ఇచ్చి ఉన్నారు పై ఇద్దరినీ హిందూ మతం నుంచి క్రైస్తవ మతంలోకినికి మత మార్పిడి చేసినట్లు తమరికి విన్న ఇస్తున్నాను విద్యార్థులు లేని లేదా మూసివేసిన పాఠశాలలకు పోస్టులు కేటాయించడం రోస్టర్ పాయింట్లను తారుమారు చేయడం బిసిసి రోస్టర్ కొరకు




మతమార్పిడులను ప్రోత్సహించడం తప్పుడు సర్టిఫికెట్లు ఆధారంగా ఎంపికలు చేయించడం మేనేజ్మెంట్ బంధువులు అనుకూలాలు కోసం ఉత్తర్వులను మార్చి సౌకర్యమంతమైన పాఠశాలలో పోస్టు ఇవ్వడం జరిగిందని సంబంధిత ఆర్ సి ఎం మేనేజ్మెంట్ సభ్యులు డయాసిస్ అధికారులు సంబటూరు రవీంద్రబాబు మరియు విద్యాశాఖ అధికారులపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యార్థి యువజన సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడుతామని వారు హెచ్చరించారు.

## ఫెస్టివల్ వేడుకలకు సీఎం చంద్రబాబు రానున్న సందర్భంలో భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

**బాపట్ల సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఈ నెల 26, 27, 28 తేదీల్లో సూర్యలంక సముద్రతీరంలో జరగనున్న బీచ్ ఫెస్టివల్ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 27న విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ గురువారం పరిశీలించారు.సముద్రతీర ప్రాంతం, హెలిపాడ్, సభా వేదిక, వీఐపీ వాహనాల కాన్వాయ్ మార్గం, స్టాల్స్ ఏర్పాటు ప్రదేశాలను ఆయన పరిశీలించారు. యాత్రికుల వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని ఎస్పీ సూచించారు. వాహనాలు ఇబ్బంది లేకుండా సెక్టార్ల వారీగా మార్గాలను ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు.సముద్రతీరంలో పెద్ద సంఖ్యలో యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నందున గజఈతగాళ్లను పెంచి, పడవలలో గస్తీ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దిష్ట లోతుల వద్ద జెండాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పోలీస్ పెట్రోలింగ్ నిరంతరం కొనసాగి యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎస్పీ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సమయంలో ట్రాఫిక్



సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. పర్యాటక శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి జి. రామాంజనేయులు, ఎస్బి ఇన్స్పెక్టర్ జి. నారాయణ, బాపట్ల రూరల్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రిని చంపిన కొడుకు......



**ప్రజా జ్యోతి రిపోర్టర్ మధు పామిడి...** పామిడి టౌన్ బెస్త వీధికి చెందిన బెస్త కులానికి చెందిన బెస్త సుధాకర్ (వయస్సు: 45 సం, ఐచర్ లారీ డ్రైవర్) తన భార్య మీనాక్షిని ప్రతిరోజూ మద్యం సేవించి తిడుతూ, కొడుతూ వచ్చేవాడు. ఈ కారణంగా సుధాకర్ కుమారుడు ప్రకాశ్ (వయస్సు: 17 సం) తండ్రితో తరచూ గొడవ పడేవాడు. ఈ రోజు అనగా 17-09-2025 తేదీ రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో, సుధాకర్ మద్యం మత్తులో భార్యతో గొడవపడగా, కుమారుడు ప్రకాశ్ ఆవేశంలో అక్కడే ఉన్న రోకలి కర్రతో సుధాకర్ తలపై గట్టిగా కొట్టాడు. దాంతో సుధాకర్ తలకు తీవ్ర రక్తగాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు అని సమాచారం..

## రేపు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**తాళ్లపూడి, సెప్టెంబర్18, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలంలో శనివా రం 33/11 కె.వి ప్రక్కిలంక సబ్ స్టేషన్ మరమత్తులు నిమిత్తము ఉదయం 8 గంటల నుండి మ ధ్యాహ్నం 1 గంట వరకు విద్యు త్ సరఫరా నిలిపివేయడం జ రుగుతుందని. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. నారాయణ అ ప్పారావు ప్రకటన విడుదల చే సినట్లు తాళ్లపూడి ఎలక్ట్రిక ల్ ఏఈ జి. శ్రీనివాసరావు తెలిపా రు.కావున ఈ సబ్ స్టేషను పరి దిలో ఉన్న అన్ని 11 కె.వి ఫీడ ర్ కి విద్యుత్ సరఫరా ఉండద న్నారు. దీని వలన తాడిపూడి, తాళ్ళపూడి ,కుక్కునూరు, ప్రక్కిలంక ,వేగేశ్వరపురం ,పైడిమెట్ట ,పోచవరం ,రాగోలోపల్లి ,తుపాకుగూడెం ,గజ్జరం ,బల్లిపాడు,పెద్దేవం గ్రామాలకు విద్యుత్ సర ఫరా నిలిపివేయడం జరుగు తుందని అలాగే వ్యవసాయ వి ద్యుత్ సరఫరా ఉదయం 4 గం టల నుండి 8 గంటల వరకు మరియు మధ్యాహ్నం 1గంట నుండి సాయ త్రం 6 గంటల వ రకు సరఫరా ఇవ్వడం జరుగు తుందన్నారు. కావున వినియో గదారులు అందరూ సహకరిం చాలన్నారు

## రైతులకు ఎరువుల కొరత లేదు

జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



**బాపట్ల సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు .వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్ఎస్‌కేలు మరియు ప్యాక్స్ కేంద్రాల ద్వారా 2075 మంది రైతులకు 259.170 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని, అదనంగా 366 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్‌లో అందుబాటులో ఉందని ఆయన పేర్కొన్నారు .రైతులు అవసరమైన యూరియాను సమీపంలోని కేంద్రాల ద్వారా పొందాలని కలెక్టర్ సూచించారు.

## శ్రీ విజేత లో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు




**తాళ్లపూడి,సెప్టెంబర్18, ప్రజాజ్యోతి న్యూస్** భారత ప్రధాని నరేంద్ర మోదీ 75 వ జన్మదిన వేడుకని శ్రీ వి జేత హై స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కే క్ కటింగ్ చేసి ప్రధాని మోదీ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలి పారు. అనంతరం విద్యార్థుల కు వక్తృత్వ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అం దచేశారు . ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డా జె వి ప్రమోద్ కుమార్, అకడమిక్ ఇంచార్జ్ కె. కరుణ, ఉపాధ్యాయులు వెంకట్, విజయ్, గంగా రత్నం, సలోమి, సాయి, మేరీ కిరణ్మయి, చంద్ర మాలిక, చం ద్రిక, విద్యార్థులు పాల్గొన్నారు

## అంకేం ఇందిరా ప్రియదర్శినికి ప్రవాసి అధినేత చప్పిడి రాజశేఖర్ సత్కారం



**జి.కొండూరు:(సెప్టెంబర్ 18,ప్రజా జ్యోతి రిపోర్టర్ బి.నాగేశ్వరరావు):**జి.కొండూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మైలవరం నియోజకవర్గం రైతు ప్రధాన కార్యదర్శి అంకేం సురేష్,సతీమణి విజయవాడ పార్లమెంట్ తెలుగు మహిళా కార్యదర్శి అంకేం ఇందిరా ప్రియదర్శిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన వివిధ కార్పొరేషన్ కమీటి లలో మైలవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆశీస్సులతో ఇరిగేషన్ డెవెలప్మెంటల్ కార్పొరేషన్ కి సంబంధించి ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం నుంచి డైరెక్టర్ గా నియమితులైన సందర్భంగా జి.కొండూరు మండల కేంద్రంలో వారి నివాసం నందు ఆంధ్ర ప్రవాసి అధినేత, ఎన్నారై తెదేపా కోఆర్డినేటర్, టిడిపి సెంట్రల్ ఆఫీస్, చప్పిడి రాజశేఖర్ శాలువాతో సత్కరించి, అభినందించారు.

# మర్దగూడ గ్రామంలో సి.సి రోడ్ శంకుస్థాపన చేసిన అనంతగిరి మండల జడ్పిటి.




సి దిసరిగంగరాజు. పాల్గొన్న ఎంపీపీ నీలవేణి.

**అనంతగిరి మండలం. సెప్టెంబర్ 18. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అనంతగిరి మండల జడ్పి.టి.సి సభ్యుడు దిసరి గంగరాజు అంటేనే ఒక బ్రాండ్ గల గిరిజన నాయకుడు గిరిజన సమస్యలపై గిరిజనుల అభివృద్ధిపై నిత్యపోరాటయోధుడు. ఇటువంటి నాయకుడు అనంతగిరి మండల వాసులకు లభించడం ఒక వరంగా భావించవచ్చు. నాయకుడు అంటే ఎలా ఉండాలో.ఎలా ప్రజాసేవ చేయాలో నాలుగు సంవత్సరాలగఅనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్నలు పొందుతున్న ఏకైక నాయకుడు మన గంగరాజు అంటున్నారు మండల ప్రజలు. అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. ఎగువశోభ గ్రామపంచాయతీ పరిధి మరద గూడ గ్రామానికి సిమెంట్ రోడ్డు మరియు డ్రైనేజీల నిర్మాణానికి జడ్పిటిసి నిధులు కింద ఏడు లక్షల రూపాయలు మంజూరు చేశారు. మంజూరు చేసిన నిధులతో తక్షణమే పనులు ప్రారంభించాలనే ఆలోచనలో భాగంగా స్థానిక సర్పంచ్ కోర్ర సింహాద్రి ఆధ్వర్యంలో గురువారం నాడు జడ్పి.టి.సిగంగరాజు రోడ్డు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ జడ్పిటిసి నిధులు కింద అభివృద్ధి పనులు నిమిత్తం ఈమధ్యకాలంలో కోటి 50.లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని ఇంకా సమయం ఉన్నందున మండల అభివృద్ధి కొరకు మరిన్ని నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.ప్రాణం ఉన్నంతవరకు నాయకుడిగా గిరిజన ప్రజల సేవకే తన జీవితం అంకితమని అభివృద్ధి పోరాటంలో రాజీ పడే ప్రసక్తి లేదని జడ్పి.టి.సి గంగరాజు స్పష్టం చేశారు. అదేవిధంగా ఎం.పీ.పీ నీలవేణి మాట్లాడుతూ గిరిజన ప్రజల అభివృద్దే తమ ముఖ్య ఉద్దేశమని ఎం.పీ.పీ నీదులు కోట్ల రూపాయలతో గిరిజన గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఇకముందు కూడా పనులు జరిపిస్తామని ఎం.పీ.పీ అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి సర్పంచ్ సో మేలబుతు. టోకూరు సర్పంచ్ కిల్లో మోసయ్య. అనంతగిరి మాజీ వైస్ సర్పంచ్ జన్ని గుండు. జనసేన పార్టీ అధ్యక్షుడు మురళి. సిపి.ఎం పార్టీ నాయకుడు నాగులు . రాము. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

# ప్రజల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించిన ప్రజానేత,



దివంగత మాజీ మంత్రి రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి హసనాపురం గ్రామం, గొల్లపల్లెలో ఘనంగా 12 వ వర్ధంతి కార్యక్రమం
నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే లు గడికోట శ్రీకాంత్ రెడ్డి, రెడ్డెప్పగారి రమేష్ కుమార్ రెడ్డి




**రామాపురం సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** దివంగత మాజీ మంత్రి రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి గారు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయిన ప్రజానేత అని మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, రెడ్డెప్పగారి రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన 12వ వర్ధంతి సందర్భంగా వైఎస్ఆర్ సీపీ నాయకులు పప్పిరెడ్డి అమరనాథ్ రెడ్డి, ఆధ్వర్యంలో రామాపురం మండలంలోని హసనాపురం గ్రామంలోని గొల్లపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాజగోపాల్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి, ఆయన ప్రజాసేవలను ప్రస్తావిస్తూ శ్రీకాంత్ రెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి లు మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి పేదల కోసం అనేక సేవలందించారని, అహింసవాదిగా పేరుగాంచారన్నారు. అయిదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన రాజగోపాల్ రెడ్డి వెలిగల్లు తదితర ప్రాజెక్టుల రూపకల్పనలో కీలక పాత్ర వహించారని తెలిపారు.ఈ సందర్భంగా పప్పిరెడ్డి అమరనాథ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ గడికోట జనార్ధన్ రెడ్డి, జెడ్పిటీసీ మాసన వెంకట రమణ, మాజీ మార్కెట్ కమిటీచైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచులు నాగభూషణ్ రెడ్డి, వెంకట రెడ్డి, రామాంజులు, బాబు రెడ్డి, రఘు,మాజీ సర్పంచ్ రాజారెడ్డి, యువజన నాయకులు సూరం వెంకట సుబ్బారెడ్డి,మాజీ సింగల్ విండో అధ్యక్షుడు యర్రంరెడ్డి, చలమా రెడ్డి,నాగేంద్ర రెడ్డి, రంగారెడ్డి ,మాజీ డైరెక్టర్ ఆంజనేయులు, సయ్యద్ అమీర్, హాజీమ్, శివయ్య, కొవ్వూరి ఈశ్వర్ రెడ్డి, దివ్యకుమార్ రెడ్డి,వినోద్ రెడ్డి,భార్గవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి సహకరించాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావును కోరిన గుమ్మనూరు నారాయణ స్వామి

**గుంతకల్లు సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి):**గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి సహకరించాలని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమల రావుకు గుంతకల్లు మండలం ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి కోరారు. గురువారం గుంతకల్లు మరియు గుత్తి ఆర్టీసీ బస్టాండ్ మరియు డిపోలను పర్యవేక్షిం చడానికి విచ్చేసిన ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమల రావు ని మరియు ఆర్టీసీ రీజనల్ చైర్మన్ నాగరాజు ని గుంతకల్లు ఆర్టీసీ డిపో నందు గుమ్మనూరు నారాయణస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గుత్తి ఆర్టీసీ బస్టాండు అభివృద్ధికి నాలుగు కోట్ల రూపాయలు కేటాయించి నందుకు కృతజ్ఞతలు తెలియ జేశారు.అలాగే గుంతకల్లు పట్టణ ఆర్టీసీ బస్టాండ్ కు కూడా నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ముందుగా గుంతకల్లు ఆర్టీసీ డిపో ఆవరణలో గుమ్మనూరు నారాయణ స్వామి, ఎండి ద్వారక తిరుమలరావు మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిఎస్ కృష్ణారెడ్డి, టిడిపి నాయకులు రామన్న చౌదరి,బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్ మరియు డిపో సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి



**(ప్రజాజ్యోతి న్యూస్) కర్నూలు సెప్టెంబరు 18** మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయవద్దని ప్రజలు విద్యార్థులు, ప్రతిపక్ష పార్టీ ఆందోళన చేస్తున్న కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పిపిపీ విధానం ద్వారా ప్రభుత్వం సోమ్మును ప్రైవేట్ వ్యక్తులతో కలిసి చంద్రబాబు దోచుకొవడానికి ప్రయత్నం చేస్తున్నారు. పులివెందుల, ఆదోని మార్కాపురం, మదనపల్లె మెడికల్ కళాశాలలను పిపిపికి టెండర్లు పిలవడం ఏమిటని ప్రశ్నిస్తున్నాం. ఆదోని మెడికల్ కళాశాలకు 50 కోట్లు నిధులు ఇస్తే చాలు విద్య తోపాటు ప్రభుత్వం వైద్యం వస్తుంది. ఇప్పటికే మంత్రి నారాయణ కు మెడికల్ కళాశాలల, ఆసుపత్రులు ఉన్నాయి. ఈ మెడికల్ కళాశాలను కూడా అప్పగించేందుకు చేస్తున్నారు. రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ నిధులు నివ్వడం లేదు. ఈ సందర్భంగా అన్ని నెట్ వర్క్ సేవలు బంద్ చేస్తున్నారు. పిపిపి విధానం ద్వారా ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు, విద్యను కూటమి ప్రభుత్వం ఇస్తుందా దీనిపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలి. ప్రభుత్వ సోమ్మను ప్రైవేట్ పరం చేస్తే తాము ఊరుకొము, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం. 8,480 కోట్లు ఖర్చు చేసి 17 మెడికల్ కళాశాలలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఖర్చు చేశారు. ఇప్పటికే 4,800 ఖర్చు చేసి మెడికల్ కళాశాలలను పూర్తి కావోచ్చాయి. లక్ష కోట్లు ఖర్చు చేసి రాజధాని నిర్మాణం చేస్తున్నారు. కానీ ప్రభుత్వం వైద్యం అందించేందుకు 5 వేల కోట్ల ఎందుకు ఖర్చు చేయలేరా.. వెనుకబడిన ప్రాంతాల్లో మెడికల్ పూర్తి చేసి వైద్య సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలి. ప్రైవేట్ వ్యక్తులతో దోచుకొని దాచుకోవడానికి చంద్రబాబు కుట్రలు చేస్తున్నారు. ఇప్పటికే లూలు కంపెనీ ఇచ్చారు. రాష్ట్రంలో ఒక్క వైపు రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు, యూరియా లేక ఇక్కట్లు పడుతున్నారు. చంద్రబాబు పాలనలో ఆరోగ్య శ్రీ నిధులను కూడా నిలిపి వేసి ఆరోగ్య శ్రీ పి నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు టెండర్లు ను అడ్డుకుంటాం. ప్రైవేట్ వ్యక్తులతో చేసే అభివృద్ధి తోపాటు పనులను కూడా అడ్డుకుంటాం.. ఈనెల 19వ తేదీన మెడికల్ కళాశాల ప్రైవేటికరణ వ్యతిరేకంగా కర్నూలు జిల్లా ఆదోని మెడికల్ కళాశాల వద్ద ఆందోళన కార్యక్రమం చేస్తున్నాం.

## హిజ్రాలకు అన్నవరం పోలీసుల కౌన్సిలింగ్



**అన్నవరం సెప్టెంబర్ 18 ప్రజాజ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** అన్నవరం మరియు మరియు పరిసర ప్రాంతాలలో సంచరిస్తున్న హిజ్రాలతో అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు ఒక సమావేశం ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఎప్పటికప్పుడు సంఘ వ్యతిరేక శక్తులు మరియు అనైతిక కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలియజేసిన ఉత్తర్వులు ప్రకారం ఈ సమావేశం నిర్వహించారు. హిజ్రాలు వివాహ కార్యక్రమాలు మరియు ఇతర శుభకార్యాలలో బలవంతపు వసూళ్లకు పాల్పడరాదని, హైవే పై వ్యభిచారము నిషేధమని తెలియజేశారు. దారిదోపిడీలు దొంగతనాలలో కూడా హిజ్రాలు పాల్గొన్న కొన్ని సంఘటనలు ఉన్నాయని, అటువంటి సంఘటనల పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ హెచ్చరించారు. ప్రస్తుత సమాజంలో గౌరవంగా జీవించాలని, అందుకు ప్రభుత్వం తరపున సహాయం అందిస్తామని, ప్రత్యామ్నాయ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎస్సై హితవు పలికారు. అన్నవరం పరిధిలో హిజ్రాల గణన, సామాజిక పరిస్థితులపై వివరాలు సేకరించినట్లు, వారి కదలికలపై నిఘా ఉంచినట్లు ఎస్ఐ తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్తిపాడు సిఐ సూర్య అప్పారావు పర్యవేక్షించారు. సామాజిక కోణంలో పోలీసులు తీసుకున్న చర్యల పట్ల ప్రజలు హర్షించారు

## వందసంవత్సరాలు పైబడిన శంఖవరం సీతారామాలయం దయనీయ పరిస్థితి

దేవాదాయ శాఖ నిర్లక్ష్యంపై లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ పర్వత జానకిదేవి ఆగ్రహం



**శంఖవరం సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి ప్రతినిధి** 125 సంవత్సరాల ప్రాచీన శంఖవరం సీతారామస్వామి వారి ఆలయాన్ని దర్శించిన లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ పర్వత జానకిదేవి ఆలయ పరిస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ,ఒకప్పుడు సుమారు 100 ఎకరాలస్థిరాస్తి కలిగిన ఆలయం ప్రస్తుతం 34 ఎకరాలకు క్షీణించిందని,ఆలయంలో కనీసం దీపారాధన జరగని స్థితి ఏర్పడిందని, గణపతి ఆలయ అర్చకులను పిలిచి స్వయంగా దీపారాధన చేయించానని తెలిపారు.ఆలయమంతా శిధిలమైపోయి, స్వామి వారి ధ్వజస్తంభం విరిగిపోయిందని,స్వామి, అమ్మవార్ల పల్లకిని గ్రామోత్సవాల్లో ఉపయోగించిన తరువాత ప్రస్తుతం ఆరుబయట పొదల్లో వదిలేయబడిందని ఆవేదన వ్యక్తం చేశారు.దేవాదాయ శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరితో ఉన్నందువల్లే ఆలయం ఈ దయనీయ స్థితికి చేరిందని జానకిదేవి మండిపడ్డారు. ధ్వజస్తంభం విరిగిపోవడాన్ని ప్రజలు అరిష్టంగా భావిస్తున్నారని, ఇప్పటికైనా దేవాదాయ శాఖ స్పందించి ధ్వజస్తంభాన్ని పునఃనిర్మించి ఆలయ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

## స్వామివారి దసరా మహోత్సవాలకు విరాళం



**అన్నవరం సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** శ్రీ స్వామివారి దేవస్థానం, 22.10.2025 నుంచి 02.11.2025 వరకు జరుగనున్న దసరా మహోత్సవములు సందర్భంగా ఆలయ ప్రధానాలయం, యంత్రాలయం, శ్రీ వన దుర్గమ్మ ఆలయం, కనకదుర్గమ్మ ఆలయం మరియు ఇతర ఉప ఆలయాలకు ప్రతి సంవత్సరం నిత్య దాతగా ఉన్న విజయవాడ వాస్తవ్యులు రావాడ చిరంజీవిరావు దంపతులు ఈ సంవత్సరం సుమారు 2,75,000 వేల రూపాయలు విలువ గల వస్త్రాలను కానుకగా సమర్పించారు. దసరా ఉత్సవములు ఘనంగా జరగడానికి తోడ్పడుతున్న ఈ దాతృత్వం ఆలయ అధికారులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పోషణ మహోత్సవ కార్యక్రమం

వెల్దుర్తి మండలం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ శ్రీరంగాపురం సచివాలయం పోషణ మహోత్సవం కార్యక్రమం

ఐసిడిఎస్ సూపర్వైజర్ సరస్వతి ఆధ్వర్యంలో




**(ప్రజాజ్యోతి న్యూస్) వెల్దుర్తి సెప్టెంబరు 18** బొమ్మిరెడ్డి పల్లె గ్రామం మజార గ్రామం నార్లాపురం శ్రీరంగాపురం గ్రామం ఆరోగ్య కేంద్రంలో జరిగినది ఉబకాయం గురించి తల్లులకు పిల్లలకు అనారోగ్యం గురించి చక్కెర ఉప్పు ఆయిలు వంటలు ఎక్కువ వాడకూడదు చిన్నపిల్లలు ఉబకాయం వలన చాలా రోగాలు వస్తాయి. గర్భవతులు బాలింతలు కూడా ఎక్కువగా వాడకూడదు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపాధ్యాయులు హెల్త్ ఏఎన్ఎం ఆశా వర్కర్ చక్కర ఉన్న వస్తువులు పదార్థాలు కేక్ స్వీట్ ఎక్కువగా తీసుకోకూడదు తల్లులకు ఆరోగ్యం గురించి వివరించారు ఎం ఎస్ కె అంగన్వాడి టీచర్స్ పద్మావతి మాణిక్యమ్మ అండ్ హెల్పర్స్ తల్లులు బాలింతలు పాల్గొన్నారు

# ప్రిన్సిపల్ సాయి దివ్య పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్

**జాయింట్ కలెక్టర్ శ్రీ ఆదర్శ రాజేంద్రన్ గారిని కలిసిన అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నగిరిమడుగు కిరణ్ కుమార్**

**ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించి పోస్టింగ్ లోకి వచ్చిన ప్రిన్సిపల్ సాయి దివ్య పై చర్యలు తీసుకోవాలి**



**రాయచోటి సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** అన్నమయ్య జిల్లా వీరబల్లి మండల పరిధిలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం నందు ప్రిన్సిపల్ గా (గతంలో) పనిచేసిన సాయి దివ్య గారు రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు ప్రభుత్వ అధికారులను తప్పుదారి పట్టించి వీరబల్లి కేజీబీవీ పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ గా ఉద్యోగం లోచేరడం జరిగింది. అయితేవెరిఫికేషన్ లిస్ట్ లో గాని, మెరిట్ లిస్ట్ లో గాని,ఈమె పేరు లేదు.2023 వ సంవత్సరంలో కడప జిల్లాలో కేజీబీల ప్రిన్సిపాల్ గా 27 మంది రిక్రూమెంట్ అయితే అందులో ఈమె పేరు లేదు.మరి ప్రిన్సిపాల్ గా ఏ విధంగా ఉద్యోగం వచ్చింది సమగ్ర విచారణ జరపాలి. ఇన్ని రోజులు కాలంగా ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ ధనాన్ని (జీతం) గా దుర్వినియోగం చేసిన (సొమ్మును)రికవరీ చేసిప్రభుత్వ ఖజానాలో వేయాలి,ఈమెపై సమగ్ర విచారణ జరిపి ఉద్యోగం ఏ విధంగా రిక్రూమెంట్ చేశారో తెలియజేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ గా కోరుతున్నాము. 11 /09 /2025 వ తేదీన రాష్ట్ర చీఫ్ సెక్రటరీ (అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్) కలెక్టర్ల ను బదిలీ చేయడం జరిగింది. అయితే ఆగ మేఘాల మీద 13/09/2025 (రెండవ శనివారం సెలవు)వ తేదీన ప్రిన్సిపల్ సాయి దివ్య గారికి పోస్టింగ్ ఇస్తూ ఆర్డర్ ఇవ్వడం జరిగింది. జిల్లాలో అభివృద్ధికి సంబంధించిన ఎన్నో ఫైలు పెండింగ్లో ఉన్నప్పటికీ తప్పు చేసిన వారిని ప్రోత్సహించే విధంగా ఎటువంటి విచారణ లేకుండా విచారణ కమిటీ లేకుండా ఆగ మేఘాల మీద పోస్టింగ్ ఇచ్చిన విధానాన్ని విద్యార్థి సంఘం గా తప్పుబడుతున్నాము. కావున తమరు ఈ యొక్క పోస్టింగ్ ఆర్డర్లను రద్దు పరచి విచారణ చేసి అనంతరం నిర్ణయం తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా కమిటీగా కోరుకుంటున్నాము.

# రాయచోటి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి వివిధ శాఖల వారు ప్రాధాన్యత అంశాలపై దృష్టి సారించాలి.

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**రాయచోటి, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** రాయచోటి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి వివిధ శాఖల వారు ఆయా శాఖలకు సంబంధించిన ప్రాధాన్యత అంశాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్లో ఎమ్మార్వోలు ఎంపీడీవోలు వివిధ శాఖల మండల స్థాయి సిబ్బంది తదితరులతో రెవెన్యూ, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, వ్యవసాయం, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల, విద్యుత్, పర్యాటకం, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రాయచోటి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.సమావేశాన్ని ప్రారంభించిన రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్.అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం, దీపం, తల్లికి వందనం, వంటి పథకాలపై వివిధ అంశాలను జిల్లా కలెక్టర్కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అన్నదాత సుఖీభవ పథకంలో ఈ కేవైసీ పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. స్త్రీ శక్తి పథకంలో బస్సులలో ఆకుపన్ని రేషియో తదితర అంశాలపై ఆర్టీసీ శాఖ అధికారిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ శాఖపై సమీక్షిస్తూ ఇంకా కొన్ని నీళ్లు పూర్తిగా కాకపోవడానికి కారణాలను డిఇ మరియు ఏఈలను అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరాలపై సమీక్షిస్తూ స్మార్ట్ కార్డుల పంపిణీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉద్యానవన శాఖ గురించి సమీక్షిస్తూ టమాట ఎక్కువగా పండించడానికి కారణాలు మరియు ఇతర సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ నీటి సరఫరా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలపై సమీక్షిస్తూ ప్రస్తుతం చేపడుతున్న వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పల్లె పండుగ పనులపై వివిధ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ మరియు ఐసిడిఎస్ శాఖలవారు సమన్వయంతో పని చేయాలన్నారు. రహదారులు మరియు భవనాలు శాఖలో పెండింగ్ పనులపై వివిధ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాగునీరు మరియు తాగునీటి పై సమీక్ష నియోజకవర్గంలోని చిన్న మధ్య తరహా ప్రాజెక్టులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖపై సమీక్షిస్తూ ప్రధానమంత్రి కుసుం మరియు ప్రధానమంత్రి సూర్య ఘర్ కొత్తకాలపై వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణ పై దృష్టి సారించాలని అని మండలాల ఎంపీడీవోలను ఆదేశించారు. అనంతరం రి సర్వే, పర్యాటకం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, రాయచోటి నియోజకవర్గం మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# డ్రోన్లతో జూదగాళ్లపై అన్నమయ్య పోలీసుల ఆపరేషన్





**అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** అన్నమయ్య జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు ఆధునిక టెక్నాలజీని వాడుతున్నారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్,. గారి ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాల సహాయంతో జూదం, బహిరంగ మద్యపానం లాంటి చట్టవ్యతిరేక పనులపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు.మదనపల్లి డీఎస్పీ యస్. మహేంద్ర గారి పర్యవేక్షణలో నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బోయకొండ అటవీ ప్రాంతంలో కొండల్లో పేకాట ఆడుతున్న వారిని డ్రోన్తో పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని వదిలిపెట్టేది లేదని ఎస్పీ గారు స్పష్టం చేశారు. ఎక్కడైనా ఇలాంటి పనులు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# జనగణనలో కుల గణన చేపట్టాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య డిమాండ్ చేశారు




**(ప్రజాజ్యోతి న్యూస్) కర్నూలు సెప్టెంబర్ 18** స్థానిక సి.ఆర్.భవన్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో గిడ్డయ్య మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు సంబంధించి 143 కులాలు ఉన్నాయని శ్రమశక్తితో సంపదను సృష్టించే వెనుకబడిన తరగతులను యంత్రాలుగా చూస్తున్నారే తప్ప రాజ్యాధికారంలో వారిని భాగస్వాములు చేయడం లేదని ఆయన విమర్శించారు,మన పక్కనే ఉన్న తెలంగాణ,కర్ణాటక రాష్ట్రాలలో అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకొని జన గణనలో కులగణన చేసి జనాభా ప్రతిపాదిక ప్రకారం స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని చూస్తూ ఉంటే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి జనగణన లో కుల గణన చేయడానికి ముందుకు రాకపోవడం సమంజసం కాదని, దేశంలో ఉన్న అందరూ ముఖ్యమంత్రుల కంటే నేనే సీనియర్ అని,రాష్ట్రంలో ఎస్సీల, బీ.సీ ల రాజకీయంగా ఎదుగుదలకు పాటుపడే ఏకైక పార్టీ మాదే అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు నాయుడు గారు మరి కులగణన ఎందుకు చేయలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. మన రాష్ట్రంలో కూడా కుల గణన చేసి జనాభా ప్రతిపాదికన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కులగన్న చేపట్టడానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరుతూ అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులను ఆహ్వానించి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు ఆయన తెలియజేశారు.ఈ సమావేశం లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప,నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, సిపిఐ నాయకులు రామాంజనేయులు,ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎంతోమంది నిరుపేద విద్యార్థులను తీర్చిదిద్దిన పంతులమ్మ ఇక లేరు



**(ప్రజా జ్యోతి న్యూస్) వెల్దుర్తి సెప్టెంబరు 18** మండల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దశాబ్దాల క్రిందట ఎంతో మంది నిరుపేద విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్దిన మహెూన్నత ఉపాధ్యాయురాలు హైమావతి తన 80 సంవత్సరాల వయసులో స్వర్గస్తురాలయ్యారు. వెల్దుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో దశాబ్దాల క్రిందట వెల్దుర్తి లో ఆమె చాలా సంవత్సరాలు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ నిరుపేద విద్యార్థిని, విద్యార్థులను ఎంతో కృషిచేసి వారికి అక్షరాభ్యాసం చేయించి వారు ఉన్నత చదువులు చదువుకునేలా ఎంతో ప్రోత్సహించింది. కొన్ని వందల కుటుంబాలు ఆమె మృతికి కన్నీరు మున్నీరవుతున్నారంటే ఆమె తన వృత్తి పట్ల ఎంత నిబద్ధతతో వ్యవహరించిందో అర్థం చేసుకోవచ్చు. ఆమె దగ్గర చదువుకున్న ఆనాటి విద్యార్థిని విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో గొప్ప స్థాయిలో ఉన్నారు. గ్రామ పెద్దలు మరియు ఆమె శిష్యులు ఆమె పార్థీవ దేహాన్ని దర్శించి ఆమెకు ఘనంగా నివాళులు అర్పించారు.


## ఇద్దరు దొంగల అరెస్ట్ 118 గ్రాములు బంగారం స్వాధీనం




**బద్వేల్ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి న్యూస్)** ఈనెల 10వ తేదీన బద్వేల్ మున్సిపాలిటీ వెంకటయ్య నగర్ లో ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి తెగబడి బంగారు ఆభరణాలతో పరారైన దొంగలను గురువారం అరెస్టు చేశామని డీఎస్పీ రాజేంద్రప్రసాద్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటనా స్థలంలో సేకరించిన ఫింగర్ ప్రింట్స్ మరియు సీసీ ఫుటేజ్ ల ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు నిందితులు కడప ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్స్ నారాయణ దిలీప్ కుమార్, షేక్ నాయబ్ రసూల్ గా గుర్తించామన్నారు. వీరి వద్ద నుండి చోరీకి గురైన 118.04 గ్రాముల బంగారం తో పాటు 4 గ్రాముల వెండి నాణేలు స్వాదీనం చేసుకున్నామన్నారు నేరానికి ఉపయోగించిన ఆటోను మొబైల్ ను సీజ్ చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ కేసులో త్వరగా స్పందించి ముద్దాయిలను పట్టుకొని దొంగిలించిన బంగారు ఆభరణాలను మొత్తం రికవరీ చేసిన బద్వేల్ అర్బన్ సీఐ లింగప్ప ఎస్సై సత్యనారాయణ పోలీస్ సిబ్బందిని క్రైమ్ పార్టీ, సిసిఎస్ పోలీస్ సిబ్బందిని కడప జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మరియు మైదుకూరు డి.ఎస్.పి రాజేంద్రప్రసాద్ గారు అభినందించారు.

## కూటమి ప్రభుత్వంలో అడవారిపై వేధింపులు

వైఎస్ఆర్ సీపీ స్టేట్ సోషల్ మీడియా విభాగం జాయింట్ సెక్రటరీ మజ్జిగ పాల్ రెడ్డి




**రాయచోటి సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి** మొన్న గీతాంజలి , నిన్న బెండపూడి బడి పిల్లలు , నేడు మరొక మహిళా కండక్టర్! ఇదేమి విజన్ అయ్యా సీఎం గారు? మీరు ప్రతిపక్షంలో ఉండగా.గీతాంజలి అనే మహిళ. "జగన్ పాలనలో నాకు ఇంటి పట్టా వచ్చింది."అని ఆనందంగా చెప్పినందుకు ఆమెను సోషల్ మీడియా వేదికగా వేధించి , ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి కారకులయ్యారుబెండపూడి ప్రభుత్వ బడిలో చదువుకున్న పేద అమ్మాయిలు చక్కగా ఇంగ్లీషులో మాట్లాడితే వారిని కూడా మీ వాళ్ళు సోషల్ మీడియా వేదికగా , బుల్లి తెర వేదికగా మరికొందరు సైకోలు తీవ్రంగా కించపరిచారుఇప్పుడు మీరు అధికారంలో ఉండగా. "ఉచిత బస్సులు అరకొరగా ఉండడం మా చావులకు వచ్చిందని బస్సులలో రద్దీని మహిళల గొడవలను చూడలేక పోతున్నామంటూ, మాకు మనశ్శాంతి లేదంటూ" ఒక మహిళా కండక్టర్ తన గోడును చెప్పుకుంటే ఆమెను మీ ప్రభుత్వం వేధించడం ఏమైనా బాగుందా?మీరు ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్నా ఇలా మహిళలను ఇంత చిన్నచూపు చూడడం ఏమైనా బాగుందా బాబు ?ఇక రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టిన గత ఏడాదిన్నర కాలంలో మహిళలపై జరిగిన దాడులు , అత్యాచారాలు , హింస ఇవన్నీ లెక్కలేనన్ని ఉన్నాయి .

## ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం ను జయప్రదం చేయండి



**రాయచోటి సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నటివంటి కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, దీర్ఘకాలంగా వున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 వ తేదిన స్థానిక రాయచోటి కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమానికి అన్నమయ్య జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు అందరూ పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు ఏ వి రమణ పిలుపునిచ్చారు. గత కొన్ని సంవత్సరాల తరబడి చాలీచాలని వేతనాలతో కాంట్రాక్ట్ కార్మికులు గా పనిచేస్తున్న అందరిని రెగ్యులర్ చేయాలని, పెండింగ్ లో ఉన్న పిఆర్సి అరియర్స్ ను విడుదల చేయాలని, అపరిమితంగా మెడికల్ అలవెన్స్ లు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం 46 వేలు ఇవ్వాలని, రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న 3 లను ఇవ్వాలని, తదితర సమస్యల పైన యజమాన్యానికి, అటు ప్రభుత్వం నికి విన్నవించుకున్నప్పటికీ ఇప్పటివరకు సమస్యల పరిష్కారం కాలేదు అన్నారు కాబట్టి సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశల వారి ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ధర్నా కార్యక్రమం చేపట్టామన్నారు, డిస్కమ్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యంరాజు, డివిజన్ అధ్యక్షులు నగేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనువాసులు రెడ్డి, ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

# విజిబుల్ పోలీసింగ్ తో ప్రజల భద్రతకు భరోసా,రాత్రి వేళ గస్తీ పటిష్టం...






**జిల్లా పోలీసులకు కర్నూల్ జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారు ఆదేశించారు.**

**(ప్రజాజ్యోతి న్యూస్) కర్నూలు సెప్టెంబర్ 18** జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా రాత్రి వేళల్లో ప్రజల భద్రత , రక్షణలో అన్ని ముఖ్య కూడళ్లు, జనం రద్దీగా ఉండే ప్రదేశాలు రహదారులపై సంచరిస్తూ పోలీసు పెట్రోలింగ్ చేస్తూ గస్తీ తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఎటువంటి నేరాలు జరగకుండా ఎటిఎం కేంద్రాల వద్ద రాత్రి గస్తీని పటిష్ట చేశారు.పాత నేరస్థులు, పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న నేరగాళ్లు ఉంటే అరెస్టు చేసేలా మొబైల్ సెక్యూరిటి డివైజ్‌లతో వేలిముద్రలను సేకరిస్తున్నారు. పాత నేరస్థుల జాబితాతో పోల్చి చూస్తున్నారు.వారిని విచారిస్తున్నారు.ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగులకు దూరంగా ఉండాలన్నారు .నేరాల కట్టడిపై నిఘా, రోడ్డు సేఫ్టీ నియమాలపై ప్రజల్లో అవగాహన, తదితర చర్యలు చేపట్టారు.

# ఇన్చార్జిని మర్యాదపూర్వకంగా కలిసిన స్టేట్ డైరెక్టర్



**రాజంపేట సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, మన రాజంపేట పార్లమెంట్ మరియు నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్మోహన్ రాజు గారు మరియు పార్టీ పెద్దలు తను చేసిన సేవలను గుర్తించి స్టేట్ నూర్ బాషా దూదేకుల వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించినందుకు సిద్ధవటం మండలం మాధవరం 1 లోని డాక్టర్ నాగూరు వీరభద్రుడు గారు రాజంపేటలోని టిడిపి పార్టీ ఆఫీసు నందు ఇన్చార్జి గారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలబొకే ఇచ్చి పూలమాలతో ఘనంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ మిఠాయిలు ఒకరికొకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర డైరెక్టర్,సిద్ధవటం మండలం టిడిపి పార్టీ కోసం ఎనలేని కృషిని అందించి గత రాక్షస పాలనలో నుంచి పార్టీని నడిపించి గవర్నమెంట్ వచ్చిన తర్వాత మండలంలోని నాయకులను ఎంతో చాకచక్యంతో సమన్వయం పరుస్తున్న మండల టిడిపి అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి గారిని, మండల టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ దారపునేని దశరథ రామానాయుడు గారిని రాజంపేట ఇన్చార్జి సమక్షంలో శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. మండలంలో ఉన్న టిడిపి నాయకులు కార్యకర్తలు అందరినీ ముందుకు నడిపించిన మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి గారికి, క్లస్టర్ ఇంచార్జ్ దశరథ రామానాయుడు గారికి పార్టీ మంచి పదవులను అందించి వారిని గౌరవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రాజంపేట నియోజకవర్గం మన చమర్తి జగన్మోహన్ రాజు గారి ఆధ్వర్యంలో ఏ కార్యకర్తకు అన్యాయం జరగకుండా కష్టపడిన కార్యకర్తను పార్టీ మర్చిపోకుండా గుర్తించి ముందు ముందు రాబోయే కాలంలో రాజంపేటలో టిడిపి పార్టీ ఒక శక్తిగా ఓటమి ఎరుగని పార్టీగా తయారవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# ఉల్లికి మద్దతు ధర రూ.3వేలు

**ప్రభుత్వమే కొనుగోలు చేయాలి**

**రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి**

**ముఖ్యమంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య లేఖ**



**అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** ఉల్లికి కనీస మద్దతు ధర క్వింటాకు 3వేల రూపాయలు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉల్లి సాగు చేసే జిల్లాలలో ఉమ్మడి కర్నూలు కడప, అనంతపురం జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల ఉల్లి సాగు చేసినట్లు ప్రాథమిక సమాచారం ఉందని, ఎన్నడూ లేని విధంగా ఉల్లి ధర పూర్తిగా పడిపోయిందని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు గురువారం ఈశ్వరయ్య లేఖ రాశారు. ఉల్లికి క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.1200 ఏ ప్రాతిపదికన నిర్ణయించారోఅర్థం కావడం లేదని, రూ.1200 మద్దతు ధర కానే కాదనీ, ఇది రైతులను మోసగించడమే అవుతుందని తెలిపారు. కర్నూలు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేసిందని, దీంతో రైతులు మార్కెట్ యార్డులలోని రోజులు కొద్దీ పడిగాపులు కాస్తున్నారని వివరించారు. జిల్లా కలెక్టర్..ప్రైవేటు వ్యాపారులకు క్వింటా రూ.600కు విక్రయించాలని, దానికి సంబంధించిన బోనస్‌ను ప్రభుత్వమే చెల్లిస్తుందని అంటున్నారని, ప్రభుత్వానికి ఉల్లిని విక్రయిస్తే..సకాలంలో రైతులకు డబ్బులు చెల్లించబోరన్న ఆందోళన, ప్రైవేటు వ్యాపారులకు అమ్మితే డబ్బులు వస్తాయన్న నమ్మకం వారిలో సన్నగిల్లిపోతోందన్నారు. ప్రభుత్వమే ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాలని చెప్పడం విడ్డూరంగా ఉందని, ఇది ప్రభుత్వ వైఫల్యమేనని పేర్కొన్నారు. కడప జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ..ఇంతవరకు పూర్తిస్థాయిలో వాటిని ఆచరణ లో పెట్టలేదన్నారు. రైతులు పండిరచిన ప్రతి ఉల్లి గడ్డ కొనుగోలు చేయాలి గ్రేడిరగ్ పేరుతోను, నాణ్యత పేరుతోను వడబోత చేస్తే మిగిలిన గడ్డలు ఎవరు కొనాలని సూటిగా ప్రశ్నించారు. రూ.1200కు విక్రయిస్తే కనీసం రైతులకు పెట్టుబడులూ రావని తెలిపారు. ఉల్లి ఎకరం సాగు చేయడానికిగాను సేద్యం విత్తనాలు ఎరువులు ,పురుగు మందులు, వ్యవసాయ కూలీలు, వ్యవసాయ మూలధనం వ్యయంతోపాటు నాలుగు నెలల పాటు ఇంటిల్లిపాది కంటికి రెప్పలా చూసుకోవాలని తెలిపారు. చీడలు, తెగులు, వైరస్‌లు వాతావరణ ప్రభావాలను అన్నింటినీ అధిగమించి పంట దిగుబడి చేతికి వచ్చేదాకా ఎకరాకు దాదాపు రూ.80వేల వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఎకరాకు 70క్వింటాలు దిగుబడి వచ్చినా ప్రభుత్వం ప్రకటించిన రూ.1200 విక్రయిస్తే కనీసం పెట్టుబడులు కూడా రాబోవని, ధర వచ్చేదాకా నిల్వ చేయడానికి కావలసిన చల్లని గిడ్డంగులు (కోల్డ్ స్టోరేజ్)ని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదన్నారు. మరోవైపు మార్కెట్లో ధరలు అధికంగా ఉన్నాయని వివరించారు. రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు వినియోగదారులు మధ్య ధరల వ్యత్యాసం నివారించేందుకుగాను, చీకటి మార్కెట్ల నివారణకు రైతులు నష్టపోకుండా ఉండేందుకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ ఆచరణ మాత్రం లేదన్నారు. రైతులు పండిరచిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, ప్రభుత్వాలు తగినంత మద్దతు ధర కల్పించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులపాల్కై ఆత్మహత్యలు చేసుకునే దీనస్థితికి ప్రభుత్వాలు తీసుకువస్తున్నాయని తెలిపారు. ఉల్లి రైతులను ఆదుకోవడం కోసం డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ ప్రతిపాదనల ప్రకారం కనీసం మద్దతు ధర క్వింటాకు రూ.3వేలు కేటాయించి ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు చమర్తి ని ముఖ్యఅతిథిగా ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు



**రాజంపేట సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** రాజంపేట నియోజకవర్గం చుండువారిపల్లి గ్రామంలో దసరా పండుగ సందర్భంగా 25,26,27 తేదీలలో జరిగే శ్రీ వెంకటేశ్వర స్వామి 13వ త్రయోదశ బ్రహ్మోత్సవాలకు రాజంపేట టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు గారిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించిన చుండువారిపల్లి ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు. అనంతరం చమర్తిని దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చుండువారిపల్లి ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు పలువురు తెలుగు తమ్ముళ్లు పాల్గొనడం జరిగినది.

## శ్రీ వాసవి మాత అమ్మవారి ని దర్శించుకున్న

**బద్వేల్ టిడిపి ఇంచార్జ్ రితేష్ రెడ్డి**

**ఆర్డిఓ చంద్రమోహన్**

**డీఎస్పీ రాజేంద్రప్రసాద్**

**అర్బన్ సీఐ లింగప్ప**

**మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి.**



**గోపవరం సెప్టెంబర్ 17( ప్రజా జ్యోతి న్యూస్)** గురువారం నాడు ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు శ్రీ వాసవి మాత అమ్మవారు దర్శనం కొరకు బద్వేల్లో అమ్మవారిశాల వీధిలో బద్వేల్ టిడిపి ఇన్చార్జి రితేష్ రెడ్డి ని .ఆర్డిఓ చంద్ర మోహన్ ను డిఎస్పి రాజేంద్రప్రసాద్ ను అర్బన్ సీఐ లింగప్పను మున్సిపల్ కమిషనర్ వాకమళ్ల నరసింహారెడ్డి తోపాటు పలువురు అధికారులు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు వారికి కి ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటీ సభ్యులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి సన్మానం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు

## జాయింట్ కలెక్టర్ శ్రీ ఆదర్శ్ రాజేందర్ గారి సమక్షంలో లాటరీ ద్వారా బార్ల కేటాయింపు



**రాయచోటి సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** ప్రభుత్వం వారు నూతనంగా అన్నమయ్య జిల్లాలో ఏర్పాటు చేయదలచిన 2 బార్లకు గాను మదనపల్లిలో 1,రాయచోటిలో 1 బార్ కు 18.09.2025 తేది ఉదయం 8.00 గంటలకు జాయింట్ కలెక్టర్ శ్రీ ఆదర్శ్ రాజేందర్ గారి సమక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం లో గల హాల్ నందు లాటరీ డ్రా తీయబడింది. ఇందులో మదనపల్లి బార్ గౌత ప్రేమ కు రాయచోటి బార్ కేడం లక్ష్మయ్య కు లాటరీ పద్ధతిలో కేటాయించబడినవి. పీలేరు బార్ కు తగినన్ని దరఖాస్తులు రానందున లాటరి నిర్వహించలేదు.ఈ కార్యక్రమంలో ఎక్సయిస్ డిప్యూటీ కమీషనర్ కడప జయరాజు, మధుసూదన్, జోగేంద్ర, లు, గురుప్రసాద్, భీమలింగ, ఎక్సయిస్ సిబ్బంది, మరియు దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## పీలేరు కలకడ నేషనల్ హైవేలో రోడ్డు ప్రమాదం



**అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** అన్నమయ్య జిల్లా కె.వి.పల్లి మండలం మఠంపల్లి పంచాయతీ పరిధిలోని కలికిరి వాండ్లపల్లి వద్ద ఈరోజు ఉదయం 11:30 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముందుగా వెళ్తున్న లారీ (నంబర్: 34దీ% 4406) ఎటువంటి ఇండికేటర్స్ ఇవ్వకుండా ఒక్కసారిగా రైట్ వైపు కదలడంతో, వెనుకనుంచి వస్తున్న షిఫ్ట్ డిజైర్ కారు (నంబర్: 09 6048) ఢీకొట్టింది.ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న పడగంటి ఈశ్వర్ (వయసు 26) తీవ్రంగా గాయపడి తలకు గట్టిగా రక్తగాయమైంది. వెంటనే అంబులెన్స్ ద్వారా పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ఫస్ట్ ఎయిడ్ అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.కారు డ్రైవర్ వంజరపు గణేష్ (27), మహేష్ బాబు (28), పోతిరెడ్డి గౌతం (27), గడపాయిన మహేంద్ర (27)లకు స్వల్ప గాయాలు కావడంతో స్థానిక వైద్యులు చికిత్స అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా




**రాయచోటి సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** అన్నమయ్య జిల్లా ఎస్పీ సార్ గారి ఆదేశాల మేరకు, రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గారు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడమైనది. ఈ క్రమంలో, ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసి, బస్టాండ్ ప్రాంతం, గంజా సేవించే ప్రదేశాలు, అలాగే అసాంఘిక కార్యక్రమాలు జరుగే అనుమానం ఉన్న ప్రాంతాలను నిశితంగా పర్యవేక్షించబడినవి. డ్రోన్ కెమెరాల ద్వారానిఘా పెట్టడం వలన, ఎవరైనా చట్టవిరుద్ధంగా లేదా సమాజానికి హానికరంగా వ్యవహరిస్తే వెంటనే గుర్తించి, వారి మీద తగిన చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడింది. ఈ చర్యలతో రాయచోటి పట్టణ పరిధిలో శాంతి భద్రతలు మరింత బలోపేతం కావడంతో పాటు, అసాంఘిక కార్యక్రమాలను నిరోధించడంలో పోలీసు శాఖకు గట్టి బలం లభించింది. ఈ విధంగా ఆధునిక సాంకేతికతను వినియోగించి, రాయచోటి పట్టణంలో ప్రజల భద్రతను కాపాడుతూ, ప్రజా శాంతి స్థాపనకు పోలీసులు కట్టుబడి ఉన్నారు అని తెలియజేయడమైనది.

# సైగల భాష అందరూ నేర్చుకోవాలి

**ప్రపంచమంతా ఒకే సైన్ లాంగ్వేజ్ ఉండాలి:**
**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**




**కరీంనగర్ :** సైగల భాష అందరూ నేర్చుకోవాలని ప్రపంచమంతా యూనివర్సల్ గా ఒకే సైన్ లాంగ్వేజ్ ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అంతర్జాతీయ సైన్ లాంగ్వేజి వారోత్సవాలు ఈనెల 22 నుండి 28 వరకు నిర్వహించనున్నారు. విద్యానగర్లోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ముందస్తు అంతర్జాతీయ సైన్ లాంగ్వేజి దినోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ భాషలు లేని కాలంలో సైగల ద్వారానే కమ్యూనికేషన్ ఉండేదని తెలిపారు. అందువల్ల సైన్ లాంగ్వేజిని చిన్నచూపు చూడొద్దని అన్నారు. ప్రపంచమంతా ఒకే సైన్ లాంగ్వేజి ఉండడం ద్వారా అంతర్జాతీయంగా దివ్యాంగులకు ఎంతో మేలు జరుగుతుం దని సూచించారు. దివ్యాంగుల భావాలను అర్థం చేసుకొని వారితో మెరుగైన కమ్యూనికేషన్ ఉండాలనే ఉద్దేశంతో జిల్లాలో అక్షయ్ ఆకృతి ఫౌండేషన్ ద్వారా అధికారులకు, ఉత్సాహం ఉన్నవారికి సైన్ లాంగ్వేజి నేర్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ భాష నేర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తమ సర్వీసులో ఒకసారైనా అంధుల, బధిరుల పాఠశాలల్లో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు ఇదివరకే టైలరింగ్, రైటింగ్ వంటి స్కిల్స్ లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, డ్రాయింగ్, మొబైల్ రిపేరింగ్ వంటి రంగాల్లో కూడా వీరికి శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వెంకటేష్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. చట్టం ప్రకారం దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి వంటివి అందజేయాలని తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కచ్చితంగా అమలుపరచాలని అన్నారు. దివ్యాంగుల చట్టాలను వారికి వివరించేందుకు ఉపాధ్యాయులు, అధికారులు ఈ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కరీంనగర్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఇండియన్ సైన్ లాంగ్వేజ్ నేర్చుకోవడంతోపాటు అధికారులకు నేర్పించడం మంచి విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఐ.ఈ.పి.ఐ.డి బాధ్యులు డాక్టర్ హిమాన్షు, ప్రియాంక, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జి సి డి ఓ కృపారాణి, తహసిల్దార్ నరేందర్, బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ కమల పాల్గొన్నారు.

# కిషోర బాలికల సంఘాల ఏర్పాటు ప్రక్రియ గురించి దిశా నిర్దేషం




**సిద్దిపేట :** 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలలోపు వయసు గల కిషోర బాలికల సంఘాలను ఏర్పాటు చెయ్యాలని కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పాఠశాల ఇంటర్మీడియట్, లేబర్, ఇండస్ట్రీస్, మెడికల్ మరియు హెల్త్, శిశు సంక్షేమ శాఖ మరియు సంబందిత ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు. జిల్లాలో కిషోర బాలికల సంఘాల ఏర్పాటు ప్రక్రియ గురించి దిశా నిర్దేషం చేశారు. కిషోర బాలికల సంఘాల ఏర్పాటుతో ఎన్నో సామాజిక రుగ్మతలను రూపు మాపవచ్చని పేర్కొన్నారు. 14 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు జీవితంలో అత్యంత కీలక దశ అని, ఈ దశలో సరైన మార్గదర్శకం ఇస్తే కౌమార బాలికలు సమాజానికి దారి దీపము అవుతారని అన్నారు. బాల్యవివాహాలు, చదువు మానేయడం, రక్తహీనత, పోషకఆహార లోపం, వేధింపులు వంటి ఎన్నో సవాళ్లు కౌమార దశలో బాలికలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రతి బాలికకు అవకాశాలు కల్పించడమే నిజమైన సాధికారత అని స్పష్టం చేశారు. డిఆర్డిఓ, డిడబ్లుఓ లు ఈ సంఘాల ఏర్పాటులో భాగస్వాములు కావాలని, ఇలాంటి సంఘాల ద్వారా బాలికల సమస్యలను గుర్తించి అవగాహన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. కిశోర బాలికల భద్రత, పోషకాహారం, ఆరోగ్యం, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనలో ఈ సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ, అటవీ ప్రాంతాల బాలికల సమస్యలు వేర్వేరుగా ఉంటాయని, వాటి స్వభావానుసారం నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమాజంలో వ్యాపిస్తున్న అనేక రుగ్మతలకు రూపుమాపగలిగే శక్తి కిశోర బాలికలలో ఉందని, వీరిచే సంఘాలు ఏర్పాటు చేసి వీటిని బలోపేతం చేస్తే బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలకు సమగ్ర పరిష్కారం లభిస్తుందని అన్నారు. గ్రామాల వారీగా ఎస్ ఇ ఆర్ పి, ఏపిఎం లు,సిసి లు,మరియు వివో ఏ లు, ఈ సంఘాలను ఏర్పాటు చేయాలని అదే విధంగా జిల్లా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

ఈ సమావేశం లో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, అదనపు డిఆర్డిఓ సుదీర్, డీఎంహెచ్వో, జిఎం ఇండస్ట్రీస్ గణేష్ రామ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ రెడ్డి, లేబర్ ఆఫీసర్ శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు టి.రేణుక, వాసుదేవ్, విద్యాసాగర్, డాకయ్య, రాకేశ్ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవన్నీ పూకార్లే : రాజ్ గోపాల్ రెడ్డి



**నల్గొండ :** తనపై మీడియాలో, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను పుకార్లను ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కొన్ని చానల్లో సోషల్ మీడియాలో నా వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బ తినే విధంగా తప్పుడు వార్తలు వస్తున్నాయి. ఈ మధ్యకాలంలో ఆంధ్రజ్యోతి పేపర్ ని తలపించేలా అందజ్యోతి అనే పేరుతో ప్రింట్ చేసి కాలేశ్వరం ప్రాజెక్టులో అవినీతి లేదన్న రాజగోపాల్ రెడ్డి అనే శీర్షికన నేను అనని మాటలు అన్నట్లు ప్రచురిస్తున్నారు. కాలేశ్వరం ప్రాజెక్టు అవినీతి గురించి మొట్టమొదటి అసెంబ్లీలో ప్రస్తావించిందే నేను. నాకు మంత్రి పదవి రానందుకు రేవంత్ రెడ్డి గారి పైన, ప్రభుత్వం పైన నేను అనని మాటలను అన్నట్టు తప్పుడు కథనాలను సృష్టించి అబద్దాలను ప్రచారం చేస్తున్నారు. నా పైన వచ్చే తప్పుడు వార్తలను అబద్దాలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఒకసారి ఎంపీగా ఒకసారి ఎమ్మెల్సీగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాకు కాంగ్రెస్ పార్టీ అన్న సోనియా గాంధీ, అన్న రాహుల్ గాంధీ గారు అన్నా ఎంతో అభిమానమని అన్నారు. మా కుటుంబమే కాంగ్రెస్ పార్టీ నేపథ్యం . నేను రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతున్నానని తప్పుడు వార్తలు రాస్తున్నారు. కొందరు గిట్టని వ్యక్తులు నా ప్రతిష్ట దెబ్బతీయడానికి సోషల్ మీడియా ద్వారా అవస్తవాలు పుకార్లు ప్రచారం చేస్తున్నారు . దయచేసి తెలంగాణ సమాజం పుకార్లను నమ్మకండి. కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కొన్ని సందర్భాలలో అంతర్గతంగా బహిర్గతంగా ఈ విధంగా చేస్తే బాగుంటుంది అని కొన్ని వేదికల్లో చెప్పడం జరిగింది. త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ విషయంలో కొంతమంది అనుకూలంగా మార్చుకున్నారని అనుమానాలు ఉన్నాయి. భూ నిర్వాసితుల విషయంలో కూడా తగిన పరిహారం ఇచ్చి న్యాయం చేస్తే బాగుంటుంది అని నా అభిప్రాయం చెప్పాను. ఈరోజు కూడా నేను గుంటూరు ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరవ్వడానికి వెళ్తుంటే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ని కలవడానికి వెళ్తున్నాడని పుకార్లు సృష్టిస్తున్నారు. నేను గుంటూరు వెళుతున్నాను అంటే మా నియోజకవర్గంలో నుంచి కూడా కొంతమంది నాయకులు నాతో వస్తా అన్నారు. నేను మా నాయకులు కలిసి గుంటూరులో ప్రవేట్ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత అటు నుండి విజయవాడ వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకొని వద్దామని వెళ్తున్నాం. దానికి నేను జగన్ ని కలవడానికి వెళ్తున్నానని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. నా రాజకీయం గురించి నా భవిష్యత్తు గురించి నేను మీడియా సమావేశం పెట్టి చెబుతాను తప్ప అప్పటివరకు ఈ దుష్ప్రచారాలను నమ్మకండని తెలంగాణ సమాజాన్ని కోరుతున్ననని అన్నారు.

## చమర్తి నీ సన్మానించిన హత్యరాల దేవస్థానం కమిటీ

**ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని రాజంపేట టిడిపి ఇంచార్జ్ హామీ**



**రాజంపేట సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** హత్యరాల దేవస్థానం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, సమర్థవంతంగా పనిచేసే ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రతిష్ఠను పెంపొందించేలా కృషి చేయాలని రాజంపేట టిడిపి ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్మోహన్ రాజుగారు సూచించారు. గురువారం రాజంపేట టిడిపి కార్యాలయం లో ఆలయ కమిటీ సభ్యులు చమర్తి జగన్మోహన్ రాజు గారిని ఘనంగా సన్మానించారు. తమకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగ పరచుకుంటామని, ఆలయ అభివృద్ధి కృషి చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ చైర్మన్ పూల నాగమణి, కమిటీ మెంబర్లు రమాదేవి, చిన్నయ్య, రమేష్, భారతి, వెంకటేశ్వర్లు, వేణుమాధవ్, నరసింహులు, ఎక్స్ ఎక్స్ ఎక్స్ ఆఫీషియో మెంబర్ పద్మనాభ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## చమర్తికి జ్ఞాపికను అందజేసిన తాళ్లపాక టిడిపి యూత్ రాయల్స్



**రాజంపేట సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** రాజంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు రాజంపేట టిడిపి ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు గారిని తాళ్లపాక యూత్ రాయల్స్ మర్యాదపూర్వకంగా కలిసి చమర్తికి దృశ్యాలువ కప్పి జ్ఞాపికను అందజేయడం జరిగినది. తాళ్లపాక యూత్ సభ్యులు మాట్లాడుతూ మంచి మనసున్న నాయకుడుగా రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జిగా ఇవ్వడం చాలా శుభపరిణామని అందుకు మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు గారికి యువ నాయకులు ఐటి విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గారికి ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా చమర్తి మాట్లాడుతూ మన యువ నాయకులు నారా లోకేష్ గారిని ఆదర్శంగా తీసుకొని యువత రాజకీయాల్లో వచ్చి క్రియాశీలకంగా వ్యవహరించాలని వారు ఆయనకు సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో తాళ్లపాక యూత్ రాయల్స్ జవ్వాజి హరికృష్ణ, వీరన్నల సురేష్, ఓగేటి ఆంజనేయులు, కొత్తపల్లి నరేంద్ర, జవ్వాజి వెంకటసుబ్బయ్య, జవ్వాజి కృష్ణ, విరనాల సుబ్బ నరసయ్య, కొత్తపల్లి సాయి, సందీప్, పలుకూరి నితిన్, కొమ్మినేని దినేష్ బాబు,మరియు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీర్ పేటలో షూ షాప్‌లో ఘోర అగ్ని ప్రమాదం.. లక్షల్లో నష్టం

**హైదరాబాద్ :** హైదరాబాద్ మీర్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెల్లగూడ మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీశ్రీ ఫుట్‌వేర్ దుకాణంలో గురువారం తెల్లవారుజామున ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. స్వాగత్ గ్రాండ్ బిల్డింగ్ సెల్లర్‌లో ఉన్న ఈ షాప్‌లో షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగినట్టు ప్రాథమిక విచారణలో తేలింది. సుమారు రూ.25 లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. ఉదయం 4:30 గంటల సమయంలో దుకాణం నుంచి మంటలు, పొగలు కనిపించడం స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్థానికు సమాచారం అందుకున్న వెంటనే మీర్ పేట పోలీస్, ఫైర్‌సర్వీస్ సిబ్బంది రెండు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకుని దాదాపు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయని షాపు యజమాని శ్రీనివాస్ చెప్‌పారు. అగ్నిమాపక అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ..."దుకాణంలో మండే స్వభావం ఉన్న పదార్థాలు అధికంగా ఉండటంతో మంటలు అదుపు చేయడంలో ఆలస్యమైంది. దుర్ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదు" అని తెలిపారు.

## కలెక్టర్ పై ఎంపీ ఆగ్రహం

**అదిలాబాద్ :** పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జిల్లా కలెక్టర్ శ్రీహర్షపై ఫైర్ అయ్యారు. కలెక్టర్ వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి, ఎయిర్ పోర్ట్ వివరాలు అడిగితే లేవు అనే నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడం,సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే స్పందించకపోవడం మెసేజ్‌లు చేసిన రిప్లై ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభోత్సవం వేళ ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృవందన పథకం కింద ప్రసూతి ప్రయోజనాలను మహిళలకు వివరించారు. మహిళలు ఈ కార్యక్రమన్నీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు బాగుంటేనే కుటుంబం బాగుంటుందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు,ఆసుపత్రి సిబ్బంది ఆసుపత్రికి అంబులెన్స్ అవసరం ఉందని ఎంపీని కోరారు. దీంతో తప్పకుండా ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా అంబులెన్స్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తర్వాత పక్కనే కొత్తగా నిర్మిస్తున్న ప్రధాన ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. బిల్డింగ్ పనులు ఎలా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే ప్రజా సమస్యలపై సమాచారం అందిస్తే ఎందుకు స్పందించడం లేదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను ఎంపీ ప్రశ్నించారు. రామగుండం ఎయిర్ పోర్ట్,ఇూఎ ఆస్పత్రి వివరాలు అడిగితే ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఎంపీ హోదాలోనే వివరాలు అడిగితే ఇవ్వలేదంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

## రిసెప్షన్ ఖర్చుతో రైతులకు ఉచిత యూరియా

**హైదరాబాద్ :** మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కుమారుడి వివాహం ఈ మధ్య జరిగింది. వివాహాన్ని సింపుల్‌గా చేసుకున్న ఎమ్మెల్యే పెళ్లి విందును మాత్రం గ్రాండ్‌గా ఇవ్వాలని నిర్ణయించారు. కానీ తన నియోజకవర్గంలో రైతులు పడుతున్న ఇబ్బందులు చూసి కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆయన వైరల్‌గా మారారు. ఎమ్మెల్యే కుమారుడి విందుకు అయ్యే ఖర్చును రైతులకు అందజేస్తే ఎలా ఉంటుందని ఆలోచించారు. ప్రస్తుతం ప్రతి ప్రాంతంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగని ఆయనే యూరియా కొని రైతులకు ఇస్తే రాజకీయంగా విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంది. అందుకే ఆయన ఆ డబ్బులు ప్రభుత్వానికి ఇవ్వాలని భావించారు. అనుకున్నట్టుగానే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. తన మనసులో మాట చెప్పారు. తన కుమారుడు ప్రసన్నను, కోడలు వెన్నలతో వెళ్లి ముఖ్యమంత్రికి చెక్ అందజేశారు. విందు కోసం రెడీ చేసుకున్న రెండు కోట్ల రూపాయలను రేవంత్ రెడ్డికి ఇచ్చారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com